
వెల రూ. 10


# సాహిత్య ప్రస్థానం

డిసెంబర్ 2017



## మన కాలపు చార్వాకుడు
# సి.వి.

1930 - 2017




## పగబట్టిన 'పరివారం'

సాహితీస్రవంతి






సాహితీస్రవంతి
ఆధ్వర్యంలో

# కారా మాస్టారుకు ఆత్మీయ సత్కారం

కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) అక్షరబ్రహ్మ, ప్రపంచానికే కథలమాస్టారని సాహితీస్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. శ్రీకాకుళంలోని కథానిలయాన్ని నవంబర్ 18న తెలకపల్లి రవి, చీకటి దివాకర్, ప్రధాన ఆదినారాయణ, కె. శ్రీనివాస్, డి.ఆర్.కె. నాయుడు తదితరులు సందర్శించి కారా మాస్టారును సాహితీస్రవంతి తరపున ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా'భావ ప్రకటనా స్వేచ్ఛ – ప్రతిబంధకాలు' అనే అంశంపై తెలకపల్లి రవి ప్రసంగించారు. కారా మాస్టారును ఒక లెజెండ్ అని అభివర్ణించారు. ఆయన సాహితీప్రపంచానికి ఎనలేని సేవ చేశారని, కథలున్నంత వరకు తెలుగు భాష మరణించదని అన్నారు. కథానిలయాన్ని సందర్శించగానే కథలు పలకరిస్తాయన్నారు.

దేశభక్తి, ఆధునిక కవిత్వం, ప్రేమ, స్త్రీ చైతన్యం, సంఘ సంస్కరణ వంటి ఎన్నో ఉదాత్త వినూత్న భావాలను నిర్వచించి వెళ్లిన రచయిత చరిత్రలో తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంటాడని అన్నారు. ఎవరి కోసమో తన ఉద్యమాన్ని వదులుకొనని సాహితీవేత్తలు నిజాయితీగా ప్రజా సమస్యలపై సాహితీ ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు.

తెలుగు రచయితలలో దీర్ఘకాలం సాహిత్యరంగంలో నిలబడి తర్వాతి తరాలకు ప్రయోజనం కలిగించే విధంగా కథా నిలయాన్ని తీర్చిదిద్దడం కాళీపట్నం మాస్టారుకే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో కారా మాస్టారు మాట్లాడుతూ కథానిలయం తన ఒక్కడి సొత్తు కాదని ఎందరో మిత్రులు చేతులు కలిపి, చేదోడు అందించి నిర్మించిందన్నారు. తాను దారి మాత్రమే చూపించానని, మిత్రులంతా ఒక ఉద్యమంలా కథలు సేకరించి కథా నిలయానికి పేరుప్రతిష్టలు తీసుకువచ్చారని చెప్పారు. బివివి రామారావు నాయుడు, వివినమూర్తి, అట్టాడ అప్పలనాయుడు, రామచంద్రరావు వంటి వారు కూడా ఈ యజ్ఞంలో సమిధలేనని అన్నారు. అందరి సమిష్టి కృషి ఫలితమే కథా నిలయమన్నారు.



సాహిత్య ప్రస్థానం
డిసెంబర్ 2017
సంపుటి : 16 సంచిక : 12

# నిశ్శబ్ద అక్షర యోధుడు

**సివి** మరణంతో తెలుగు సాహిత్యం ఒక నిశ్శబ్ద నిరాడంబర అక్షర యోధుణ్ని కోల్పోయింది. రాశిలోనూ వాసిలోనూ నైశిత్యంలోనూ సాటిలేని ఒక గొప్ప రచయిత ఆయన. ఏ ప్రలోభాలూ ప్రచార లంపటాలూ లేని ప్రజాకవి. ప్రగతిశీల సాహిత్య ప్రస్థానంలో ఒడుదుడుకులు వచ్చి శూన్యత ఆవరించినప్పుడు కవిత్వంతో కారుచీకటిలో కాంతిరేఖలు వెలిగించాడాయన. నిరంకుశత్వం కోరలు చాచినప్పుడు మూఢత్వం వెర్రి తలలు వేసినప్పుడు నిర్భయంగా నిస్సంకోచంగా కలమే కరవాలంగా తలపడ్డారు. ఇతిహాసాలలో మరుగుపడిన అధ్యాయాలపై కొత్త వెలుగులు ప్రసరిస్తూ మహాకావ్య నిర్మాణం చేశారు. సృజన కారులంటే కేవలం స్వీయావరణంలో మునిగితేలేవారన్న అపప్రథను పూర్వపక్షం చేస్తూ చరిత్రనూ సిద్ధాంతాన్ని మథించి శోధించి గొప్ప ప్రామాణిక గ్రంథాలు వెలువరించారు. మార్క్సిస్టు భావజాలానికి సామాజిక న్యాయం, హేతువాద కోణం కలగలిస్తేనే సంపూర్ణ పురోగమనం సాధ్యమని నమ్మి జీవితమంతా ఆ లక్ష్యానికే అంకితం అయ్యారు. ఏ బిరుదులూ పదవులూ కోరుకోలేదు. ఏ ఆడంబరాలూ అట్టహాసాలూ ఆశించలేదు. ఆశయమే ఆలంబనగా ఆఖరు వరకూ అక్షరయానం చేశారు. నమ్మిన ఆదర్శాలకు కట్టుబడ్డారు. అందుకే తెలుగు సాహిత్యంలో సివికి ఒక ప్రత్యేక స్థానం లభించింది. ప్రస్థానం ఆయనకు జోహార్లర్పిస్తున్నది. ఆయన కుటుంబానికీ, సన్నిహితులకూ ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిస్తున్నది. ఆయన గురించిన విశేషాలతో వెలువడిన రెండేళ్లకిందట ప్రస్థానం ప్రత్యేక సంచిక గాని లేదంటే ఆయనకు నివాళిగా వెలువడిన వ్యాసాల సంపుటి సాహితీ మిత్రులందరూ అధ్యయనం చేయాలని అవగాహన పెంచుకోవాలని కోరుతున్నాం.

బొమ్మలు : తుంబలి శివాజి, గంగాధర్

## ఈ సంచికలో ...


కవిత ..... 4
గల్ఫ్ బండి (కథ) ..... 5
సి.వి.కి నివాళి..... 8
సాంస్కృతిక పునర్వికాస శక్తులు ఒక వేదిక మీదకు రావాలి..... 9
కవిత ..... 11
తెలంగాణ పాట – ప్రాదేశికత..... 12
మిషను శబ్దం (కథ) ..... 14
కవిత ..... 17
వదరుబోతుకు వందేళ్ళు..... 18
'పద్మావతి'పై పగబట్టిన పరివారం..... 25
మైనారిటీల సాంఘిక జీవిత ప్రతిబింబం 'అలావా'. 27
బువ్వ (కథ) ..... 31
కవిత ..... 35
మురాసకి శికిబు – ఆధునిక ప్రపంచపు మొదటి నవలా రచయిత్రి..... 36
కవిత ..... 39
కవిత్వమై మెరిసిన నది రేపటి గీతం..... 40
ఇప్పుడిది అసలైన సందర్భం..... 42
జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కృష్ణా సోబతీ..... 44
కవిత ..... 39
స్వీకారం..... 46
డైరీ..... 47



సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** (ప్రధాన సంపాదకుడు)
**వొరప్రసాద్** (వర్కింగ్ ఎడిటర్)
కె. సత్యరంజన్ • చీకటి దివాకర్
గనారా • శమంతకమణి
• కెంగార మోహన్
కె.లక్ష్మయ్య, మేనేజర్



మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం, డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 520 002,
సెల్: 9490099059

హైదరాబాద్ చిరునామా
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ - 500 020

ఇ–మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

**కవిత**

# చరిత్రలో చేగువేరా !



**- నిఖిలేశ్వర్**
**9177881201**

అండిస్ పర్వత పంక్తుల నీడలో
బొలివియన్ గ్రామం లాపిగోయిరాల –
యాభై సం.ల నాటి హత్యకు సజీవ సాక్ష్యం,
సి.ఐ.ఎ. (CIA) దళారీ సైనికుల గుండ్లకు
ధైర్యంగా ఎదురునిలిచి,
"ఒరేయ్ పిరికిపందా !
ఇంకా ఏం ఆలోచిస్తున్నావ్ కాల్చేయ్
అని నినదించిన "ఛే" –
ఒక అంతర్జాతీయ కామ్రేడ్ !
నడచిన చరిత్రలో విప్లవ యోధుడిగా
కార్పొరేట్ వ్యాపారాల ప్రతీకగా
ప్రపంచమంతా గుర్తించిన ఒక 'ఐకాన్' (Icon)
బొలివియాలో రైతుల – కమ్యూనిస్టుల
మొద్దునిదురవదిలించి నియంతను
కూలదోయాలనే విప్లవ స్వప్నంలో
కదతేరిన సాహస గెరిల్లా దళ నాయకుడు !
స్థానికుల సమీకరణ లేకుండా
నిర్మాణంలేని తిరుగుబాటు
దళ చర్యల అరణ్యఘోషలో
వ్యక్తిగత సాహసం వికటించిన ఆపరేషన్,
అయినా రోగగ్రస్థులైన మనుషులకే కాదు
నియంతల దేశాలకు శస్త్ర చికిత్స తప్పదని –
నమ్మిన డాక్టర్ ఎర్నెస్టోగువేరా డిలాసెర్నో (ఛేగువేరా)
అర్జెంటినాలో ఊపిరి పోసుకున్న కామ్రేడ్
ఫిడల్‌కాస్ట్రో సహచరుడిగా క్యూబా విప్లవ నిర్మాత,
విప్లవ ఫలాలు ఆరగిస్తూ
విశ్రాంతిగా సుఖజీవితం తన గమ్యంకాదని
అవిశ్రాంత గెరిల్లాయోధుడిగా
తన శ్వాసకోశాలలో ఎగిసిపడిన
శ్వాసను నియంత్రించిన వైద్యుడు
క్యూబా నుంచి కాంగో – అంగోలా –
ఆఫ్రికన్ పోరాటాల భాగస్వామ్యం,
లాటిన్ అమెరికన్ నియంతలను ధిక్కరించిన స్వరం,
వారసత్వంగా తన అక్షరాల్లో చారిత్రక విప్లవ –

ఆశావాదాన్ని లిఖించినవాడు,
"మృత్యువు ఎదురై మనల్ని అబ్బురపర్చవచ్చు – ఆహ్వానిద్దాం !
మన విప్లవ రణన్ నినాదం స్పందించే చెవులకు చేరవచ్చు
మరో చెయ్యి ఆయుధాలు ధరించి ముందుకు చొచ్చుకరావచ్చు"

**(9-10-1967 న బొలివియన్ సైనికులు చేగువేరాను హత్య చేసారు)** ♦

## నవంబర్ నెల పురస్కారాలు

**గువ్వగూడు**
కథకు: **రూ.700/-**
రచయిత : డా॥ ఎం. ప్రగతి

**ఘోర పాపమే**
కవితకు : **రూ .500/-**
రచయిత : షా. ఇబ్రహీం

**కథ, కవితకు సినీ రచయిత జనార్ధన మహర్షి అందిస్తున్న పురస్కారాల చెక్కులు ఈ రచయితలకు అందుతాయి**

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు.
సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని
ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

**- ఎడిటర్**



- డా॥ తవ్వా వెంకటయ్య
9703912727

# గల్ఫ్‌బండి

వారానికి మూడుసార్లు అటు, మూడుసార్లు ఇటు తిరుపతి నుండి ఢిల్లీకి వెళ్లి వచ్చే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కోసం ఎదురు చూస్తున్నారు జనం. ఈ రోజు సోమవారం అవ్వడం వల్ల యర్రగుంట్ల రైలు స్టేషన్‌లో జనం కిటకిట లాడుతున్నారు. రైలు రెండవ ఫ్లాట్‌ఫాం మీదికి వస్తుందని అందరికీ తెలుసు. తిరుపతిలో బయలుదేరే ఈ రైలు రేణిగుంట్ల తరువాత కడప జిల్లాలో కడప, యర్రగుంట్లలోనే ఆగుతుంది. సుదూరం వెళ్ళేవాళ్ళు ఈ రైల్లోనే వెళుతూ ఉంటారు. రైలు స్టేషన్‌లో ఉన్న చాలామందిలో సంతోషం లేదు. దేన్నో పోగొట్టుకున్నట్లు, ఎవరినో వదలి వెళుతున్నట్లు అందరిలోనూ ఏదో దిగులు, నిరాశ. కొందరు రైలు స్టేషన్ బయట దారిలో ఎవరి కోసమో ఎదురు చూస్తూ ఉన్నారు. అంతలో ఆటోలో వచ్చిన ఆయన్ని అందరూ గుంపుగా చుట్టుముట్టారు. య్యా య్యావో మా టికెట్లు నీ దగ్గర్నే ఉందా? అందుకేబ్బా మా పెండ్లానికేం తెల్దు సోమీ అన్నీ నేవ్వే సూసుకోవాల అని ఆ వచ్చినాయనతో మరీ మరీ చెప్పి వచ్చాడు ఆంజనేయులు. ఆ వచ్చినాయన పేరు బాషా. అందరూ సౌదీ బాషా అంటారు. ఉండేది ప్రొద్దుటూరు. 15 సంవత్సరాల క్రితం బాషా అన్న ఫీరయ్య సౌదీయా వెళ్ళాడు. కొన్నేళ్ళు అక్కడే ఏదో వ్యాపారం చేసుకుని బ్రతికేటోడు. కానీ ఓ 10 సంవత్సరాల నుండి ఇండియా నుండి కువైట్, సౌదీయాకు ఉపాధి కోసం వెళ్ళే మనుషుల్ని పంపించేందుకు మధ్యవర్తిత్వం చేస్తున్నాడు. ఇప్పుడూ అదే పని.

యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, మైలవరం, జమ్మలమడుగు, వేంపల్లి, చిలమకూరు, పులివెందుల వంటి ప్రాంతాల నుండి నెలలో రెండుసార్లు మనుషుల్ని గల్ఫ్ దేశాలకు పంపుతుంటాడు.

ఇక్కడ నుండి ఢిల్లీ వరకు వీరిని తీసుకుపోయి అక్కడ విమానం ఎక్కించే వరకు బాషాది బాధ్యత. అక్కడ వాళ్ళు విమానం దిగగానే బాషన్న పీరయ్య వారిని తీసుకుని వాళ్ళు పని చేయవలసిన సేట్ ఇంట్లో వదలివస్తాడు. ఇదీ ఈ అన్నదమ్ముల పని. ఇందుకు గానూ వీళ్ళకు గల్ఫ్‌దేశాలలోని ఇంటి యజమానులు (సేట్‌లు) కొంత సొమ్మును ఇస్తారు. ఆ పనిలోనే ఇప్పుడు బాషా యర్రగుంట్ల స్టేషన్‌లో చాలా బిజీగా ఉన్నాడు.


మొదటి ఫ్లాట్‌ఫాం మీద నుండి రెండవ ఫ్లాట్‌ఫాం మీదికి వెళుతున్న బాషా వెంట ఓ 30 మంది మనుషులు కంగారు కంగారుగా నడుస్తున్నారు. రెండవ ఫ్లాట్‌ఫాం మీద నున్న కొందరి దగ్గరికెళ్ళి 50 రూపాయల రిజిస్టర్ స్టాంపులపై సంతకాలు

చేయించుకుంటున్నాడు. ఆ సంతకాలు చేస్తున్నవారిలో ఆడోళ్ళున్నారు. మొగోళ్ళూ ఉన్నారు. సంతకం చేయడం చేతకానివాళ్ళు వేలిముద్రలు వేస్తున్నారు.

లచ్చలచ్చలు అప్పు చేసినాంకదే. నువ్వు యాడన్నా పండుకొని బాకీ తీర్చు. లేదంటే మా కొంపలో నుంచి పో. మా మనవన్ని మేమే సాకుంటాం" అని నరసమ్మ అత్త రోజూ సూటిపోటీ మాటల్తో వేధిస్తూ ఉంటుంది. అందుకే నరసమ్మ 5 సంవత్సరాల కొడుకును వదలి పరదేశం పోయి అప్పు తీర్చాలని బయలుదేరింది. అందరి బంధువులు వచ్చారు. కానీ నరసమ్మ కోసం ఎవ్వరూ రాలా. నరసమ్మ ఉండేది యర్రగుంట్ల రైలు స్టేషన్ దగ్గరే. అయినా కనీసం అత్తమామలు కూడా రాలేదు. ఎవరో దూరపు చుట్టం ఒకాయన వచ్చాడు నరసమ్మ కొడుకు బాలరాజును తీసుకుని. కొడుకును వదలి వెళ్ళబుద్ధికాలా. కానీ బాకీ తీర్చడం కోసం తల్లిగుండెను బండరాయి చేసుకుంది. నరసమ్మ బంధువు వరుసకు చిన్నాన్న అవుతాడు. నరసమ్మ కొడుకును పట్టుకుని కన్నీళ్ళు రాలుస్తున్నాడు. 5 సంవత్సరాల బాలరాజు "మ్మా.... ఊరికా్య నేనొచ్చమా. ఇంటికాడ మా జేజ కొడ్తది మ్మా. అంటా ఉంటే ఆ దృశ్యం చూసిన వాళ్ళ మనసులు కరిగిపోతున్నాయి. "వద్దురా నాయనా నేను చాలా దూరం పోతండా.. మళ్ళా వచ్చులే నాయినా" అంటూ కొడుకును గుండెలకద్దుకుని విలపించింది నరసమ్మ. ఆ ఏడుపులోనూ వాడు "మా... ఓమ్మా మా నాయిన యాడికో పోయినాడంటెనే అట్నే పిల్చుకొని రామ్మా ఆ..... ఎప్పుడొచ్చావుమా రేపామ్మా. నేను బడికి పోనుమా. మా అబ్బ బడికి పోకుంటే కొడ్తదు. నేనూ నీతో వచ్చుమా" అని మారాం పెట్టి ఏడుస్తున్నాడు.

వాడి బాధ చూసి ఆ వచ్చే రైలు క్రిందబడి కొడుకుతో సహా చావాలనుకుంది నరసమ్మ. అయినా అన్యాయంగా వాడి పానమెందుకు తీయాల. బరువైనా, బాధైనా బతికి సాదియ్యాలనుకుంది. కొడుకును తనివితీరా ముద్దాడింది. ఆ వచ్చినాయనతో చిన్నాయిన నా కొడుకును సూచ్చా ఉండు. అని కొడుకు యోగక్షేమాలు చెప్పి రైలు కోసం ఎదురు చూస్తూ ఉంది.

మరో గుంపులో నలుగురు ఆడబిడ్డల్ని కన్నతల్లి బేబీ రాణి. పెద్దకూతురికి పెళ్ళైంది. ఒక పాప కూడా. ఉన్న రెండిళ్ళలో ఒకటి తెగనమ్మి పెద్దకూతురు పెళ్ళి చేశారు. బేబీరాణి కుటుంబం



రోజువారీ కూలీలు. వీరిది ప్రొద్దుటూరు. ముగ్గురు కూతుర్లను తమ కష్టంతోనే చదివిస్తున్నారు. బేబిరాణి భర్త లాజర్‌కు ఈ మధ్యనే కిడ్నీలలో రాళ్ళు పడ్డాయని తిరుపతిలో ఆపరేషన్ చేశారు. అప్పటి నుండి బరువైన కూలీపని చేయడంలేదు. దీంతో ఇంటి భారం అంతా బేబీరాణిపై పడింది. ఈ మధ్యనే అనారోగ్యంతో తల్లిదండ్రి అన్న చనిపోవడంతో మరిన్ని ఆర్థిక కష్టాలు భారమయ్యాయి లాజర్‌కు. దీనికి తోడు పెళ్ళీడుకొచ్చిన ముగ్గురు కూతుళ్ళు. ఇన్ని ఇబ్బందుల మధ్య బేబిరాణి గల్ఫ్‌దేశాలకు వెళ్ళక తప్పలేదు. నలుగురు కూతుర్లను, భర్తను మనువరాలిని వదలి వెళ్ళబుద్ధికాక బేబిరాణికి కన్నీళ్ళు కళ్ళు నిండుకున్నాయి. కానీ పై కష్టాలన్నీ గుర్తుకు తెచ్చుకుని వెళ్ళడానికే నిశ్చయించుకుంది. రైలు ఎక్కేంత వరకు ఓర్పుగా ఏడవకుండా ఉందామనుకుంది.

నలుగురు కూతుర్లు ఏడుస్తుంటే బేబిరాణి కన్నీళ్ళు ఆగలేదు. వ్వా వ్వా అని మాటలు వచ్చీరాని మనుమరాలు పిలుస్తుంటే మనవరాలి ముచ్చట చూడకుండా దూరమౌతున్నాననే వేదనను ఆపుకోలేక నలుగురు కూతుర్లను గట్టిగా కౌగిలించుకుని ధైర్యం చెప్పింది.

ఇలా ఒక్కొక్కరి పయనం వెనుక కొన్ని కన్నీటి కథలు. ఇంతలో "దయచేసి వినండి ట్రైన్ నెం. 163024 గుంతకల్, హైదరాబాద్, భోపాల్, నాగపూర్ మీదుగా తిరుపతి నుండి నిజాముద్దీన్ వెళ్ళవలసిన నిజాముద్దీన్ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ మరికొద్ది సేపట్లో రెండవ ప్లాట్‌ఫాం మీదికి వచ్చును." అనే రైలు అనౌన్స్‌మెంట్ విని అందరి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. కన్నవారిని, కట్టుకున్నవారిని, కడుపున పుట్టిన వారిని, తోడబుట్టిన వారిని, ఉన్నవూరును, సొంతదేశాన్ని వదలి కానరాని తీరాలకు, ఎవరో తెలియని వారి చెంతకు వెళ్ళడానికి వెళ్ళవలసిన వారు లేచారు.

భాష రాదు, అక్కడి తిండి తెలియదు. అయినా బ్రతుకు పోరాటంలో గెలిచేందుకు విధి విధించిన పెనుసవాళ్ళను ఆర్థిక ఆసరాతో జయించేందుకు చెల్లాచెదురౌతున్న గుండెను ఒడిసిపట్టుకుని గల్ఫ్ రైలు బండి ఎక్కేందుకు 12 మంది గల్ఫ్‌కు వెళ్ళేవారు సిద్ధమయ్యారు.

వారిని సాగనంపడానికి తమ బ్రతుకులో భాగమైన వారు, తమ బ్రతుకు బాగుకోసం ప్రాణాలకు తెగించి వెళుతున్న వీరికి కన్నీళ్ళతో, అయిష్టంతో సాగనంపడానికి పైకి లేచారు. రైలు

**కవిత**

# మరికొన్ని... నిజాలు

- సునీత గంగవరపు
9494084576



కొన్ని పువ్వులు
చీకటి నిట్టూర్పులపై
ఆశలరేఖలై విరుస్తాయి

కొన్ని నవ్వులు
నిస్సార ఘడియల్లో
సుస్వర గీతాలు
వినిపిస్తాయి

కొన్ని కలలు
కాలాన్ని మరిపించి
నిశ్శబ్ద రాత్రులను
మేల్కొల్పుతాయి

కొన్ని అక్షరాలు
పదాల పొందికలై
అంతరంగ ఆర్ద్రతను
ఆవిష్కరిస్తాయి

కొన్ని జ్ఞాపకాలు..
అనుభూతుల మధురిమను
అనుక్షణం పంచుతూ..
తుది శ్వాస వరకూ
తోడుంటాయి ♦

---

రైట్ టైం 8.30 నిమిషాలు. ఎప్పుడూ రైలు కోసం ఎదురు చూసే మనుషులు ఈ రోజు కొంతసేపు ఆలస్యంగా వస్తే బాగుండు అనుకుంటున్నారు తమ మదిలో. తమవారిని మరికొంతసేపు తనివితీరా చూసుకోవచ్చనే ఆశతో.

ఇంతలో అందరిమధ్య అలుముకున్న గంభీర వాతావరణాన్ని కన్నీటి సముద్రం చేసేందుకు కూతవేస్తూ వచ్చింది రైలు. బాషాతో పాటు 12 మంది రైలు ముందునున్న జనరల్ బోగిలో ఎక్కారు. బంధువులంతా తమ తమ వారిని పదే పదే చూస్తున్నారు. రైలు పెట్టెలో ఎక్కిన వారు కళ్ళకు గుడ్డలు అడ్డం పెట్టుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్నారు. ఫ్లాట్‌ఫాం మీదనున్న వారు బోరున విలపిస్తున్నారు. ఈ దృశ్యాన్ని ఎ/సి బోగిలలోనూ, రెండవ తరగతిలోనూ స్లీపర్‌లో ఉన్న ఆ వర్గం ప్రయాణికులు వింతగా చూసి నవ్వుకున్నారు. సామాన్యుడి జీవన చిత్రంలోని సాదక బాధకాలు తెలియని వీరు.


నరసమ్మ తన కొడుకుని గట్టిగా ముద్దు పెట్టుకుని "నేను మల్లా వచ్చాలే నాయినా.. నువ్వూ తాత మల్లా ఈడికే రాండి ఇంటికి పోదాం" అని కొడుకును ఓదార్చి తాను ఓర్చుకోలేక ఏడుస్తూ రైలు ఎక్కింది. నరసమ్మకు నా అనే వాళ్ళెవ్వరూ లేరు. ఉన్న ఒక్కగానొక్క కొడుకును వదలిపోతోంది బ్రతుకుదెరువు కోసం. తన ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టి ఒట్టి కట్టె మాత్రమే వెళుతోంది. "తాతా అమ్మ మల్లా వచ్చాదా?" అని అమాయకంగా అడుగుతూ ఉంటే ఏం చెప్పలేని బాలరాజు చినతాత వాడి తలనిమిరి గట్టిగా కౌగిలించుకున్నాడు. ఇంతలో యర్రగుంట్లలో ఒకే ఒక్క నిమిషం ఆగిన రైలు బండి కదిలింది. అందరూ చేతులు ఊపుతున్నారు. గల్ఫ్‌కు వెళుతున్న వాళ్ళు రైలు వాకిట్లో కొచ్చి తమవారికి చేతులు ఊపుతుంటే ఫ్లాట్‌ఫాం పైనున్న వారు తమ వారికి చేతులు ఊపుతున్నారు. కంటికి రైలు కనిపించేంతసేపు నిలుచుండి చూసి తిరుగు ప్రయాణమయ్యారు. అందరూ వారి వారి ఊళ్ళకు వెళ్ళిపోయారు.

నరసమ్మ కొడుకు బాలరాజు ఇళ్ళు యర్రగుంట్ల రైలు స్టేషన్ పక్కనే కాబట్టి తొందరగా వెళ్ళాడు. బాలరాజు అబ్బాజేజి కోపంగా ఉండారు. తమ కోడలు గల్ఫ్ వెళ్తుంటే ఎవరో దూరపుబంధువు వెళ్ళి సాగనంపి వచ్చాడని. కానీ ఆ విషయం గురించి మనవన్ని మాటమాత్రమైనా అడగలేదు. మరుసటి రోజు తెల్లారగానే బాలరాజు తన అమ్మ గల్ఫ్‌కు పోయిన సంగతి మరిచిపోయి "మ్మా.....మ్మా...." అని మంచం మీదే కూర్చుని ఏడుస్తున్నాడు. అంతలో బాలరాజు జేజి వచ్చి "ఏం రా అట్టా మొత్తుకొని సచ్చుండవ్? యాడుంది మీయమ్మ. మీ నాయిన్ను మింగి నిన్ను మా మీద వొదిలి యాడికో పోయింది. ఏట్లోచ్చది కూకో" అంది.

ఆ మాటకు బాలరాజు "ఆ ... మాయమ్మ బెన్నా వచ్చనన్నేది. టేషన్‌కు రమ్మన్నేది నేను పోయి పిల్చుకొని వచ్చా" అని మంచం మీద నుంచి దిగి రైలు స్టేషన్‌కు వచ్చాడు. బాలరాజు అమ్మకోసం రైలుస్టేషన్‌కు వెళ్ళాడని తెలిసి చిన్నతాత స్టేషన్‌కు వచ్చి, "నాయినా రాజు ఇంటికి రారా" అంటే "ఊహూ... రైలు వచ్చె మాయమ్మ వచ్చుది" అని చెప్పి అక్కడే ఉండిపోయాడు. వచ్చిపోయే ప్రతి రైలు బండిని ఆశతో అమ్మకోసం ఎదురు చూస్తూ.....

నివాళి

# ప్రముఖ రచయిత సి.వి. కన్నుమూత



14.01.1930 - 08.11.2017

సాంఘిక విప్లవకారుడు, పరిశోధకుడు, విద్యార్థి, యువజన లోకపు మస్తిష్కాలకు పట్టిన ఛాందస భావాల దుమ్ము దులిపి.. వారిని తన సాహిత్యం ద్వారా అభ్యుదయం వైపు నడిపించిన వచన కవితాగ్రేసరుడు, సాహితీలోకంలో సి.వి.గా సుపరిచితుడూ, సుప్రసిద్ధుడూ అయిన చిత్తజల్లు వరహాలరావు నవంబర్ 8న విజయవాడలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు. లక్ష్మీదేవమ్మ, వెంకట చలపతి దంపతులకు 1930 జనవరి 14న గుంటూరులో సి.వి.జన్మించారు. అక్కడే ఎస్ఎస్ఎల్సి, ఇంటర్, బిఎ చదివారు. మద్రాసులో 1953లో ఎకనామిక్స్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. దళిత కవి శివసాగర్ (కెజి సత్యమూర్తి) ఆయన సహాధ్యాయి. మద్రాసులోనే ఉంటూ అక్కడి కన్నెమెర లైబ్రరీలో రోజుల తరబడి భారత దేశంలో ఒక ప్రత్యామ్నాయ సంస్కృతి ఏర్పాటుకు సంబంధించి ఆయన రాసుకున్న నోట్సు ఆధారంగా ఆయన అనేక పుస్తకాలను రాశారు. 1950 దశకంలో వామపక్ష ఉద్యమాల్లో క్రియాశీలంగా పనిచేశారు. 1970ల్లో తెలుగు సాహితీ లోకంలో ప్రగతిశీల శక్తులకూ, హేతువాదులకూ అక్షరాయుధాలను అందించారు. 'సి.వి.', 'సి.విజయలక్ష్మి'బీ 'అరుణశ్రీ', 'రామిరెడ్డి', 'రాఘవేంద్ర' వంటి పేర్లతో ఆయన వచన కవితలూ, కావ్యాలూ రాశారు. వెల్లువెత్తిన ప్రవాహంలా వచనాన్ని నడిపించడంలో ఆయనది అందె వేసిన చెయ్యి. ఆయన రచనలు ఆలోచనాపరులను, ప్రధానంగా యువతను గొప్పగా ఉత్తేజపరిచాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో రకరకాల వంచకులను ఏకకాలంలో తన రచనల ద్వారా ఎండగట్టారు. దోపిడీ, పీడన శక్తులను రచనల్లో చీల్చి చెండాడారు. సమాజంలో విజృంభించిన వికృత ధోరణులపైన, అర్థంలేని, అంధ విశ్వాసాలపైన ఆయన కలాన్ని ఝుళిపించారు. ఉద్యమాలు, పోరాటాల ప్రభావాన్ని కారుచీకటిలో కాంతిరేఖలా కవిత్వీకరించారు. సాధారణంగా అగ్రశ్రేణి కవులు సాహిత్యేతర సైద్ధాంతిక రచనలు చేయడం అరుదు. కానీ అలాంటి సాధికార చరిత్ర గ్రంథాలు వెలువరించి సివి తన విలక్షణతను చాటుకున్నారు. ప్రపంచంలో శ్రామికవర్గ రాజ్యమైన పారిస్ కమ్యూన్‌పై కవిత్వం, సిద్ధాంతం మేళవించి బృహత్ కావ్యం తెచ్చారు. ఈ విధంగా ఆయన సుమారు 30 గొప్ప పుస్తకాలు వెలువరించారు. 'పారిస్ కమ్యూన్', 'సత్యకామ జాబాలి', 'నరబలి', 'ఊళ్లోకి స్వాములవారు వేంచేశారు', 'సింధు నాగరికత', వర్ణ వ్యవస్థ, 'మధ్యయుగాల్లో కుల వ్యవస్థ', 'ఆధునిక యుగంలో కుల వ్యవస్థ', 'మనుధర్మ శాస్త్రం–శూద్ర దళిత బానిసత్వం', 'కౌటిల్యుని అర్థశాస్త్రం– పుట్టు పూర్వోత్తరాలు', 'ప్రాచీన భారతంలో చార్వాకం', 'డార్విన్ పరిణామవాదం', 'భారత జాతీయ పునరుజ్జీవనం', 'తొలి దళితకవి కుసుమ ధర్మన్న', 'హోచిమన్', 'మనకూ ఒక సాంస్కృతిక విప్లవం కావాలి' వంటి అనేక గ్రంథాలను రచించారు. ముఖ్యంగా ఆయన సామాజికంగా, సాంఘికంగా విస్మరించ బడిన వర్గాల సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకు రావడానికి తన రచనా శక్తిని వెచ్చించారు. జనశక్తి, ప్రజాశక్తి కార్యాలయాలు, పుస్తకశాలలే సివి భావజాల కేంద్రాలుగా విలసిల్లాయి. ఆయన సర్కారు సత్కారాలు, సన్మానాలు, ప్రాపకాలు, ప్రచారాలు కోరుకోలేదు. కీర్తి కండూతులకు దూరంగా ఉంటూ రచనలు అందించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆయన సమగ్ర రచనలను 24 పుస్తకాలుగా ప్రచురించింది. వాటికి ఆయా రంగాలకు చెందిన మేధావులు ముందుమాటలు రాశారు. విజయవాడలో 26 ప్రజా, సాహిత్య, కళా సాంస్కృతిక, దళిత, నాస్తిక, హేతువాద, అంబేద్కరిస్టు సంస్థలు సంయుక్తంగా 'సంగమం' ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహించి ఆ పుస్తకాలను ఆవిష్కరించారు. ఆ సభలో మనువాద సంస్కృతికి, మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా సివి చేసిన రచనా కృషిని వక్తలు కొనియాడారు. సి.వి. కి సాహిత్య ప్రస్థానం తరపున జోహార్లర్పిస్తున్నాం.

నివాళి

# సాంస్కృతిక పునర్వికాస శక్తులు ఒక వేదిక మీదికి రావాలి




***2015 జూన్ 28 న విజయవాడలో జరిగిన 'సి.వి. సమగ్ర రచనలు - సమాలోచన' సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తున్న సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి***

◆ తెలకపల్లి రవి

ఇది ఒక గొప్ప సందర్భం. ఇది ఒక సంకేతం కూడా. ఇది ఒక గొప్ప సంఘర్షణకు నాందీ భూతం. నవ్యాంధ్రప్రదేశ్‌లో అనేకానేక మాయాబజార్లున్న విజయవాడను వేదికగా చేసుకున్నాము. నిజంగా నవ్యాంధ్రప్రదేశ్ గర్వించదగిన నాందీ ప్రస్తావన ఏదైన ఉన్నదంటే అది ఈ రోజున సివిగారికి చేసేటువంటి సత్కారమనడంలో సందేహం లేదు. అందలాలెక్కినవారిని సన్మానించడానికి చాలా మంది ఉంటారు. కాని ఒక జాతి ఒక చైతన్యవంతమైన ఒక సామాజిక బృందం ఒక రచయితని, కవిని 40 సంవత్సరాల తర్వాత గుండెల మీద పెట్టుకుని మీరు వేసిన అంకురాలతోనే చైతన్యవంతంగా ముందుకు పోతున్నామని చెబుతున్నామంటే బహుశా సివిగారికి జీవితంలో ఇంతకంటే సంతోషం ఏముండదని నేననుకుంటున్నాను. తాను రాసింది జాతి మంత్రంగా మార్మోగాలని శ్రీశ్రీ అన్నాడు. 40 ఏళ్ల తర్వాత కూడా తన రచనలు ఇంకా జాతి ఆమోదం పొందుతాయోమోనని వేచిచూస్తున్నానన్నాడు చలం. కాని ఇక్కడ చేరిన చాలా మంది సి.వి.గారు ఆనాడు వేసినటువంటి అంకురాలే.. ఇది ఒక సాహిత్య, రాజకీయ సమ్మేళనం. ఇందులో గొప్ప సంకేతం ఉంది. సివి ఆనాడు ఆకాంక్షించిన సాంస్కృతిక పునరుజ్జీవనం శక్తులు, సాంస్కృతిక పోరాట శక్తులు ఉండటమే కాదు ఒక వేదిక మీదకు సాంస్కృతిక వికాసం కోసం ఉద్యమించే సందర్భం ఉన్నదని ఈ సమావేశం చెబుతుంది. అప్పుడెప్పుడో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం గారికి గొప్ప సన్మానం జరిగింది. తర్వాత శ్రీశ్రీ షష్టిపూర్తి విశాఖలో ఘనంగా జరిగింది.. చిలకమర్తి, శ్రీశ్రీ గారి తర్వాత ఇంత గొప్పగా ఒక అభ్యుదయ కవికి సన్మానం జరిగిందంటే అది సివిగారిదే. ఇది గొప్ప కోసం కాదు. ఒక చారిత్రిక వాస్తవాన్ని తెలియజేయాలనే చెబుతున్నాను. సభలో చాలా మంది కవులు రచయితలున్నారు. హోరాహోరీగా మాట్లాడ గలిగినవారు, పోట్లాడ గలిగినవారు కూడా ఉన్నారు. కాకపోతే కాలం మీద కత్తులు వేలాడుతున్నాయి. అందువలన ఎవరం కూడా చాలా ఎక్కువ సమయం తీసుకునే అవకాశం లేదు.

సివిగారి సంక్షిప్త సందేశంలోనే ఈనాడు గొప్పగా చెప్పారు. ప్రధానమంత్రిగారి ఆధ్వర్యంలో జరిగినటువంటి యోగాసనార్భాటాలకు విరుగుడు ఏదైనా ఉందంటే విజయవాడ వేదికగా జరుగుచున్న ఈ సభే. ఆసనాలు అనేవి వైజ్ఞానికంగా చూస్తే మనం వ్యతిరేకం కాదు. కాని ఆ పేరుతో బాబాలను తీసుకొచ్చి ఉన్నవీ లేనివీ చెబితేనే సమస్య వస్తుంది. వందిమాగద కైవారం వంటి అందమైన అబద్ధం చెబుతున్నావా అని వశిష్టుణ్ని ప్రశ్నిస్తాడు వేనుడు నరబలిలో. అలాగే ఈ ప్రశ్న ఈ రోజు కనుక మనం వేయకపోతే ఈ అందమైన అబద్ధాలు అంత గొప్ప ఇంతగొప్ప అంటూ సాగుతుంటాయి. సత్యకామ జాబాలికి

తండ్రి ఎవరు, రుషి వశిష్ఠుడికి తండ్రి ఎవరు, బానిసజాతికి తండ్రి ఎవరు అని ప్రశ్నిస్తాడు సివి. ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్ని కావాలిప్పుడు. దాచేస్తే దాగని సత్యం అన్న శ్రీశ్రీ మాటలు సివి ప్రతి రచనలో కనిపిస్తూనే ఉంటాయి. శుభంగా తిరిగి రావయ్యా సుందరయ్య అని సుందరయ్య గురించి వ్రాసినా - మళ్ళీ రష్యా దేశం వెళుతున్న మహాకవి శ్రీశ్రీకి అని రాసినా పుస్తెను సైతం కమ్యూనిస్టు పార్టీకి సమర్పించిన సతిని వదలిపెట్టి ఎలా వెళ్లావయ్యా అని డివిఎస్‌పై కవితలో ఆవేదన ప్రకటించినా ఒక మక్కలి ఘోషాల్ గురించి- ఒక చార్వాకుడి గురించి స్మరించినా అన్నింట్లో ఉన్నది ఒకటే- ఉన్నటువంటి యథాతథ స్థితిని, దోపిడీను, పీడనను, సామాజిక అణచివేతను ప్రశ్నించడం, తాను ప్రశ్నించడమే కాదు ప్రశ్నించే వారికండగా నిలబడడమనే గొప్ప విషయం సివిలో మనకు కనపడుతుంది. అందుకే సివిగారు ప్రధానంగా కవి అయినా సృజనాత్మక రచనలే గాక అనేక సైద్ధాంతిక రచనలు చేయడం సాధ్యమైంది. రాష్ట్రంలో చాలా పేరు పొందిన కవులు కూడా కొంతమంది ఒక పీఠిక రాయడానికి ఏడాది, రెండునెలలు తీసుకుంటారు. ఇలా అంటున్నందుకు ఆ కవులు మన్నించాలి. కవిత్వాన్ని సైద్ధాంతిక రచనలను నిర్దిష్టంగా పరిస్థితులకు అన్వయించి అందించడంలో సివి సవ్యసాచి.

హేతువాదం అనేది నిజంగా హేతివాదం. హేతి అంటే కత్తి. రాస్తున్నానొక గీతి, చేస్తున్నానొక హేతి రావోయి రావోయి లోనికి సందేహం దేనికి అని ఖడ్గసృష్టి చేశాడు శ్రీశ్రీ. ఖడ్గసృష్టిపై దాడి చేస్తే ఖడ్గసృష్టి కావ్య పరామర్శ అని సివిగారు రాశారు. పరామర్శ అని ఎందుకు పెట్టారు సార్ అని నేను అడిగాను. తెలుగులో విమర్శ అంటే చీల్చి చెండాటమే, అందుకే పరామర్శ అని పెట్టాను అన్నారు. ఈ రోజు భారతదేశంలో సామాజిక తిరోగమన వాదం, సామాజిక పునరుద్ధరణ వాదం పైకి లేస్తున్నప్పుడు- జాషువా అన్నట్టు నాలుగు పడగల హైందవ నాగరాజు బుసకొడుతున్నప్పుడు మళ్లీ ఒక హేతువాద చైతన్యం రగిలించటానికి ఒక సామాజిక ఉద్యమంలా విశాల వేదిక మీదకు రావాలి అని చెప్పటానికి ఈ సమావేశం దోహదం చేస్తుంది. సివి తొలి రోజుల్లో నా కవితలు చూసేవారు. పదునైన కలం అని అప్పుడే ప్రోత్సహించారు. నరబలి కావ్యంలో క్రైస్తవం, హిందుమతం గురించి రాశారు. ఇస్లాం గురించి వివరణ లేదు అని నేను చెప్పాను. దాని గురించి నాకు అంత అవగాహన లేదు అని మొదట చెప్పారు. తర్వాత అదంతా సేకరించి రాసి ఒక రోజు ఉదయాన్నే పట్టుకొచ్చారు. సివి ప్రూఫ్‌లు చాలా జాగ్రత్తగా చూసుకుంటారు. తన పుస్తకాలు తానే వేసుకున్నారు. మళ్లీ ఇన్నేళ్లకు ఈ రోజున సివి గారి మొత్తం పుస్తకాలు విడుదల కావడం చర్చించడం గొప్ప విషయం. వామపక్ష సమావేశాలన్నింటిలో కూడా విశాల సాంస్కృతిక కృషి ఏదైతే చెబుతున్నారో దానికి ఈ సభ ఆచరణరూపంగా ఉంది. వారు 70వ దశకంలోనే ఆంధ్రలో చేశారు. అప్పుడు టివిలు లేవు. అప్పుడు సౌండ్‌లు చెవిలో ఊదరగొట్టటాలు లేవు. ఆల్‌ఇండియా రేడియో ఒక్కటే. ఇప్పుడు 60-70% ప్రొద్దున్నే ఫోన్లు, టీవీలు ఇవన్నీ ఛాందసాల మోత మోగిస్తున్నాయి. కాబట్టి 70వ దశకంలో వారు చెప్పిన భావాలను మరింత ఉధృతంగా విస్తృతంగా ప్రచారం చేయవలసి వుంది.

అభ్యుదయ సాహిత్యం, దిగంబర కవిత్వం మధ్యలో ఒక శూన్యత వచ్చిందని చెబుతుంటారు. అభ్యుదయ కవిత్వానికి కాలం చెల్లిందని చాలా మంది భావించారు. ఆ సమయంలో కారుచీకటిలో కాంతిరేఖలా వచ్చింది సివి కవిత్వం. తర్వాత ఇతర రచనలు. నలభైఏళ్ళ తరువాత ప్రజాశక్తివారు అన్నింటిని ముందుకు తీసుకురావడం అందరూ హర్షించడం చూస్తున్నాం.


మీరు ఈ రోజు వేసిన ఈ ఆహ్వానం చూసుకుంటే ఎంత మంది వ్యక్తులు, శక్తులు, ఎంత మంది సంస్థలు ఇంకా ఎంతమంది ఇందులో భాగం పంచుకున్నారో అర్థమవుతుంది. వీళ్ళందరూ భవిష్యత్తులోనూ కూడా తప్పకుండా కలసి ముందుకు పోవాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ ఉమామహేశ్వరరావుగారు సినిమా డైరెక్టర్‌గా కాదు సభ డైరెక్టర్‌గా చెప్పినట్టు ఈ రోజు సాంస్కృతిక ప్రపంచీకరణ ప్రజల్ని ముంచెత్తుతున్న పరిస్థితులలో ... రకరకాలుగా ఆర్థిక ఉద్యమాలు, చైతన్యాలు, రాష్ట్ర విభజన, వ్యాపార సంస్కృతి పూర్వరంగంలో నవ్యాంధ్ర సవ్యాంధ్ర అవుతుందా లేదా అనేదే కదా మనం చూడాల్సింది. ఈ నవ్యాంధ్ర రాజధానికి సంబంధించిన వ్యవహారాలు చాలా జరుగుతున్నవి. ఈ నేపథ్యంలో సాంస్కృతిక రంగంలో జరగాల్సినది ఏమిటో చర్చిద్దాం.

**(విజయవాడలో 28.06.2015 న నిర్వహించిన ' సివి సమగ్ర రచనలు - సమాలోచన' సదస్సు అధ్యక్షోపన్యాసం)**

## కవిత

# నేలా-అతనూ-ఓ కలా

- సి.హెచ్.వి.బృందావనరావు
9963399189






అతనిది అనంతమైన కల
దినదినమూ అదే కలను వండుకుంటూ
మోరలెత్తి - కనిపించని వరదాత కోసం
ఆకాశం వైపు చూస్తూనే ఉంటాడు
నేలను ప్రేమగా - జాలిగా
నిమురుతూ తడుముతూ
ధరాగర్భంలో కాసిని ఆశలను నిక్షేపించుకొని
ఒక దయామేఘపు శకలం కోసం
ఎదురెదుర్లు చూస్తూనే ఉంటాడు
ఒక ఆకుపచ్చని దుప్పటి వచ్చి
తన మీదా, తన కుటుంబం మీదా
వాలి పోతుందనే దివాస్వప్నంలో
తిరుగుళ్ళు పడుతూనే ఉంటాడు
ఆ భూమీ - ఆ తూటా
తరాల నుండీ తనతో సహజీవనం చేసే
ఆ ఆకుపచ్చని పాటా
అతని మూతపడని కన్నులకు
ఒక తడి యవనికను అద్దుతూనే ఉంటాయి
చివరాఖరుకు చివికి, శిధిలమై
ఏ ఆశనూ వాగ్దానం చేయకుండానే
ఆ కల భగ్నమై, భుగ్నమై
చిట్లిపోతుంది
అతనో శోక ఘోషగా నిర్జీవమవడం
ఏ చట్టానికీ పట్టదు
సభలన్నీ మిఠాయీలను
పంచుకుంటూనే ఉంటాయి ♦

---

# వలస

- కాట్రాజు లావణ్య సైదీశ్వర్
9603763848




ఈ తోవ నన్ను ఏ చోటుకు
చేర్చుతదో...
ఏ అంతుపట్టని దూరాలకు
పాకిందో.....
ఏడేడు సంద్రాలు.... ఏటవతలకు
బదుగు బ్రతుకులకు బాట పరుసుకుందో
ఎవరికి ఎర్కా...

గడ్డిపోచైనా మొలవలేదు
ఎన్ని వేల అడుగుల దండయాత్రలు జరిగినయో....
కనుచూపులెక్కన అంతా ఎర్రమట్టి
మబ్బులే కానొస్తున్నయ్....
ముందు తరాలు... ఆ ముందు తరాలు
ఈ బాటలోనే నడిసిన్రు...
గిప్పుడు నేను నడుస్తున్న వారసత్వపు వలస బాట ఇది...
ఇంకెన్ని అడుగులు నడవాలో తెల్వదు
దూపగొన్న పాణానికి గుక్కెడు నీళ్ళైనా దొరకవు
రాబందుల రెక్కల సప్పుడు ఈడిదాక ఇనొస్తుంది
నేను చేతులు కాళ్ళు ఆడియ్యాలె
లేకుంటే సచ్చిన పీనిగనని పీక్కుతింటయ్
మా వోళ్ళు తిరగబడలేక తిరగబడి
పాణాలె ఇడిసిన్రు
నేను గోస తీస్తుంది చాలు
నా తోనే ఈ వలస ఆగాలె...
ఇంటిగాడ ఒడిలేసి వచ్చిన మా బుడ్డోడు
ఈ తోవలకెళ్ళి రావద్దు... ఈ దారి మూసేస్తా
కంపగొట్టి కంచె పాతుతా
నాదే ఆఖరి ఆకలి వలస కావాలె
గిదే నా ఆశ... ♦

## పరిశీలన

# తెలంగాణ పాట- ప్రాదేశికత

- డా. సిద్దెంకి యాదగిరి
9441244773



*తెలంగాణ ఉద్యమ ప్రభావంతో విశ్వవిద్యాలయాల్లో పరిపరి విధాలుగా తెలంగాణ అంశంపై పరిశోధనలు వెలువడ్డాయి. ఆ క్రమంలోనే పసునూరి రవీందర్ పాటలపైన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో "తెలంగాణ పాటల్లో ప్రాదేశిక విమర్శ" విస్తృత పరిశోధన చేసాడు. తెలంగాణ మలిదశ ఉద్యమం సాగుతున్నపుడు రవీందర్ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి. పరిశోధన సాగిస్తున్న పరిశోధకుడు. గాయకుడు, పాటల రచయిత అవడం మూలంగా పాటల పరిశోధనవైపు మళ్ళించిందనడంలో సందేహంలేదు.*

ప్రతి సమాజాన్ని నిక్షిప్తంచేసేవి కళలు. కవిత్వం. సర్వకళల్లో శాశ్వతమైన కళగా వర్ధిల్లుతున్నది కవిత్వం. పాటలనగానే గుర్తుకొచ్చేది జానపదం. జనపదులు అంటే పల్లె ప్రజలు. ముఖా ముఖాంగేషు సరస్వతి అన్నట్లు ఒకరి నుంచి ఒకరికి, తరం నుంచి మరో తరానికి పాటలవాహిక ఉన్నరు. తెలంగాణ పాటకాసిన పట్టు. పాటను ఒడిసి పట్టుకునే కాలం. చరిత్రతో నడిసే రెండడుగులు. పాట, కాలం కలబోసిన చరిత్రనే తెలంగాణ. చరిత్రని పాట గానం చేస్తుంటది. కాలం పాటతో పాటు నడుస్తది. కాలానికి పాటకు అవిభాజ్యత సంబంధం ఉంది.

తెలంగాణ పాటకు చారిత్రకంగా దాదాపు వెయ్యి సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉన్నది. తెలుగు స్వతంత్ర కవి పాల్కుర్కి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో పాటగురించి వివరించాడు. ఆనాటికే ప్రజల్లో ఉన్న పాటల్ని ఊటంకిస్తూ గొబ్బిపదాలు, వాలేషుపదాలు, శంకరపదాలు మొదలైనవి ఎన్నో వివరించాడు.

ఇక్కడి ప్రజల సమిష్టితత్వం, పనిపట్లగల నిబద్ధత తెలంగాణ ప్రజల ఐక్యమత్యం అన్నీ కలగలసిన జరిగిన సాయుధరైతాంగ పోరాటం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో విజయం సాధించింది.

తెలంగాణ ఉద్యమ ప్రభావంతో విశ్వవిద్యాలయాల్లో పరిపరి విధాలుగా తెలంగాణ అంశంపై పరిశోధనలు వెలువడ్డాయి. ఆ క్రమంలో పాటలపైనా పరిశోధనలు ప్రారంభించబడ్డాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలంగాణ జీవనవిధానమైన పాటల్ని శాస్త్రీయంగా పరిష్కరించి ఆకృతి తెచ్చిన మహానుభావులు బిరుదురాజు రామరాజు, తంగిరాల వేంకట సుబ్బారావు, జీవియస్ మోహన్, నాయిని కృష్ణకుమారి, గోపు లింగారెడ్డి, ఆర్వీయస్ సుందరం, జయధీర్ తిరుమల్ రావు, వెల్దండ రఘుమారెడ్డి, ఎస్వీ సత్యనారాయణ లాంటి మహామహులు పాటలపైనా పరిశోధన గావించి పాటకు పట్టం కట్టినవారే.

ఆ క్రమంలోనే పసునూరి రవీందర్ పాటలపైన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో "తెలంగాణ పాటల్లో ప్రాదేశిక విమర్శ" విస్తృత పరిశోధన చేసాడు. తెలంగాణ మలిదశ ఉద్యమం సాగుతున్నపుడు రవీందర్ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి. పరిశోధన సాగిస్తున్న పరిశోధకుడు. గాయకుడు, పాటల రచయిత అవడం మూలంగా పాటల పరిశోధనవైపు మళ్ళించిందనడంలో సందేహంలేదు.

పసునూరి రవీందర్ పరిశోధనాంశంగా 'తెలంగాణ

ఉద్యమపాట ప్రాదేశిక విమర్శ' అంశాన్ని ఎంచుకున్నాడు. ఆచార్య పిల్లలమర్రి రాములు పర్యవేక్షణ తోడయి పాటకు పరిపూర్ణతనిచ్చింది. వివిధ కాలాల్లో పాటల్ని బేరీజు వేసాడు. గేయం, గీతం, పాటల నిర్వచన రూపకంగా సోదాహరించాడు. ఆధునిక రూపంలోకి మారిన క్రమాన్ని ముత్యాల సరాలుగా వెలుగొందిన గేయాలు పాటలుగా జనసామాన్యంలో ప్రజల పాటగా, ఉద్యమ పాటగా పరిణామ క్రమాన్ని వివరించాడు.

**రవీందర్ చాలా జాగ్రత్తగా పరిశోధనలో తెలంగాణ ప్రాంత సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాహిత్య ప్రాదేశికతలుగా విభజించి తెలంగాణ గేయ సాహిత్యం – ప్రాదేశిక విమర్శను పాటను కలగలిపి నిరూపించాడు.**

తెలంగాణలో పుట్టుకొచ్చిన వివిధ వాదాల (అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీవాద, మైనారిటీ ) అనంతరం బలమైన ప్రభావానికి లోనైంది. తెలంగాణ అస్తిత్వ భావుటాలు ఎగురవేసే రచనలు తొంభయవ దశకం నుంచే ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంలోనే తెలంగాణ అంశం సాహిత్య ప్రక్రియల్లో ప్రాంతీయవాద దృక్పథంను సంతరించుకున్నది.

బలమైన ఉద్యమాల నేపథ్యం ప్రాంతీయ స్పృహతో ఈ వాదాలకు బలాన్ని చేకూర్చింది. చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు, ఆర్థిక స్థితిగతులు ఆ ప్రాంత ప్రభావం ఉంటుంది. అందువల్ల ప్రాంతీయ వాదానికి సాహిత్య పరిభాష రూపమే ప్రాదేశిక వాదం.

రవీందర్ చాలా జాగ్రత్తగా పరిశోధనలో తెలంగాణ ప్రాంత సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాహిత్య ప్రాదేశికతలుగా విభజించి తెలంగాణ గేయ సాహిత్యం – ప్రాదేశిక విమర్శను పాటను కలగలిపి నిరూపించాడు.

అందుకోసం తెలంగాణ ఉద్యమపాట పరిణామక్రమాన్ని పూర్వపు పరిస్థితుల్ని వీరశైవ మత ప్రభావం వల్ల గ్రాంథిక భాషను ధిక్కరించి జానుతెనుగుకు పట్టం కట్టి అందలమెక్కిన పాటల్ని విధానాన్ని వివరించాడు. తదనంతరం హనుమద్దాస్(ముదిరాజ్), రాకమచర్ల వెంకటదాస్(నేత)ల తత్వగీతాలు సమాజాన్ని వ్యక్తీకరించాయి. మరో వాగ్గేయకారుడు దున్న ఇద్దాసు మాదిగ మహాయోగి. భక్తి ఉద్యమాలు పాటతో అందరిని అలరించాయి. సమాజానికి అనుగుణంగా పరిణామం చెందిన విధానాన్ని రుజువుల్తో పొందుపరిచాడు.

నిజాంపై పోరాటాన్ని విశ్వవ్యాప్తం చేసిన సాంస్కృతిక తిరుగుబాటును ఎగురేసిన జయకేతనం పాట. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ప్రతిబింబించిన పాటల్ని వెట్టిచాకిరి తెలిపే పాటలు, దోపిడిని తెలిపే పాటలు, నిజాం వ్యతిరేక పాటలు, అమరవీరుల పాటలు, సైనికచర్య పాటలుగా విభజించి పాట సాహిత్యాన్ని మదింపు గావించి రవీందర్ పరిపుష్టి కలిగించాడు. సైనిక చర్య అనంతరం పాట వలస ప్రభావాన్ని గానం చేసింది. వీరులకు కాణాచిరా! తెలంగాణ ధీరులకు మొగసాలరా! అని గానం చేసిన రావెల వెంకట రామారావు ద్వారా ఆనాటి సమాజాన్ని చిత్రించిన పాట తెలంగాణ తొలిదశ ఉద్యమాన్ని చిత్రించిన పాటను వివిధకోణాల్లో పరిశీలించారు.

నక్సలబరీ ఉద్యమంతో తెలంగాణ సమాజం ఎంతగానో ప్రభావితమైంది. అస్తిత్వ పోరాటాలు ఉధృతమైనవి. కులవ్యతిరేక చైతన్యం కలిగించేలా వచ్చిన పాటలు, వివిధ వాదాల్ని, ప్రపంచీకరణ వ్యతిరేక చైతన్యపాటల్ని దర్శించారు. తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని అమరవీరుల సంస్మరణ, వ్యవసాయిక సంక్షోభం, సామాజిక సంక్షోభం, రాష్ట్ర ప్రకటన డిమాండ్, ఆత్మగౌరవం లాంటి వివిధ రకాలుగా పాటలు సంధించిన ఆకాంక్షల్ని తెలిపిన విధానాన్ని, భావోద్వేగాలు చిందిన పాటల్ని శోధించారు.

తెలంగాణ పాటను గత, వర్తమాన, భవిష్యత్ కాలాల చరిత్రకు వాహకమై నిలిచేలా చేసిన పరిశోధన ఇది. ఉస్మానియా విశ్వ విద్యాలయం వచ్చిన మొదటి పరిశోధన గ్రంథం పాటల పైనే వచ్చింది. 'తెలంగాణ ఉద్యమ పాట ప్రాదేశిక విమర్శ' పరిశోధన గ్రంథం తెలుగు పాట సాహిత్యంలో వెలుగులా నిలుస్తుందనడానికి ఎలాంటి సంశయం లేదు.

సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పరిశోధన గ్రంథంగా భావించిన తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ (తేనా) వారు అభినందిస్తూ 2015లో తెలంగాణ పునరుజ్జీవన గౌరవ పురస్కారం సురవరం ప్రతాపరెడ్డి అవార్డును అందజేయడంతో పాటు పుస్తకంగా వెలువరించడానికి తగినంతగా ఆర్థిక సహాయం అందజేసారు. నాలుగు వందల నలభై పేజీల ఈ పుస్తకం కవర్ పేజీ రమణజీవి చేతిలో ఆకర్షణీయంగా తీర్చి దిద్దబడింది. భుజానేసుకున్న గొంగడి మీదుగా పొడుస్తున్న పొద్దులో సూర్యున్ని . ఈ కాంతి పుంజంలోనే తెలంగాణ చిత్రపటం కనిపించడం ఎంతో అద్భుతంగా వున్నది. ♦

కథ

# మిషను శబ్దం

- వి. వెంకట్రావు
9247235401



"బందరెల్లాలి"

"ఎందుకు? అక్కడెవరున్నారు?"

"ఉందిలే తాతల నాటి పెంకుటిల్లు. ఒకసారెల్లి దాని పని చూడమంటున్నాడు మావాడు. చాలా కాలం నుండి అదేమాట. దాని మాటకేంగానీ... అక్కడికెళ్ళి నా సంగతే చూసుకోవాలి."

"అంటే కొన్నాళ్ళు వుందామనా?"

"కొన్నాళ్ళేమిటి? వున్నన్నాళ్ళు."

"వెళతావు సరే.... జరుగుబాటు ఎలా?"


"ఎలాగేమిటి? కష్టపడేవాడికి జరుగుబాటు కేముంది. ఏ అరుగు మీద పాత చిరుగులు కుట్టుకున్నా ఆ మాత్రం దినం తీరకపోతుందా? ఒక్కడి కడుపుకే వుంది నాలుగు మెతుకులు లోనికి వెళ్లకపోతాయా?"

"అంత అవసరమేమొచ్చింది గవర్రాజు. తొందరపడి వెళ్ళకు. ప్రసాద్ తో నేను మాట్లాడతాను."

"ఏం మాట్లాడతావులే. అసలోడికి వుండాలి." అని నా మాటైనా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. అరవైఎనిమిదేళ్ళ వయసులో సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు. నాకూ కొట్టు దగ్గర అర్జెంట్ పని ఉండడంతో నేనూ వారించకుండా వచ్చేసాను.

కొట్టుకు వెళ్ళానుగానీ... గవర్రాజు ఆలోచనలు వదల్లేదు. నేను జయరాజ్ కొట్లో పని నేర్చుకోడానికి వెళ్ళేనాటికే అక్కడ సీనియర్ పేంటు మేకరు గవర్రాజు. ఎంత ఓపికని. అబ్బా! అతను పని చెయ్యడం చూస్తే భయం వేసేది. ఇల్లు కాట వీధిలో వుండేది. నేను ఇంటికి వెళ్ళాలంటే, గవర్రాజు ఇంటిని దాటుకునే వెళ్ళాలి. అందుకే అతని గురించి కాస్త ఎక్కువ తెలుసు. సంక్రాంతిలో అయితే... రాత్రి పన్నెండు వరకూ జయరాజ్ కొట్లో పనిచేసి, ఇంటికి వెళ్లి మళ్ళీ మిషను ఎక్కేవాడు. ఎంత ఓపిక రా బాబూ! అలా ఎంత వరకూ కుట్టేవాడో తెలీదుగానీ.. మళ్ళీ చీకట్నే కొట్టుకి వచ్చేసేవాడు. అతగాడు ఇంటి దగ్గర పని చేసుకొని వస్తున్నాడని కొట్లో కుర్రోల్లందరికీ తెలుసు. కొంతమంది కొట్లలో పని చేసుకునే టైలర్ కుర్రోళ్ళు ఇళ్ళ దగ్గర వేరేగా బట్టలు ఒప్పుకొని కుట్టుకుంటారు. అది అందరికీ తెలిసిందే. కొత్తగా కత్తిరింపులు నేర్చుకునేవాళు ్ళ ఆ విధంగా ట్రైనింగ్ అవుతుంటారు. పుణ్యం, పరుషార్ధం అన్నట్లు కాస్తో, కూస్తో డబ్బులూ వస్తాయి. కత్తిరింపుల్లో

మెళకువలూ తెలుస్తాయి. ఇంటి దగ్గర మిషను పెట్టుకొని కుట్టుకోవడమనేది మామూలు రోజుల్లో అయితే ఎవరికీ ఇబ్బంది వుండదుగానీ... సంక్రాంతి లాంటి సీజన్లో అయితే చాలా ఇబ్బంది. రెండు చోట్లా పని చెయ్యాలంటే మనుషులా? యంత్రాలా? అలా ఒకదగ్గర పని చేస్తూ, ఎంత చెయ్యగలమో అంతా గురువు దగ్గరే చెయ్యాలి గానీ... ఇలా ఇంటిదగ్గర పని చెయ్యడం అవినీతే గానీ... అవినీతి అనే పదంలో నీతి వున్నట్లు ఆ చర్యలో కూడా నీతి అంతర్లీనంగా దాగి వుంది. ఆ నీతికే మరొకపేరు పరిస్థితులు. గవర్రాజు ఓపిక గురించి అందరూ చెప్పుకునేవారు. ఇలా పనిచేస్తే ఎన్నాళ్ళో బతకడని ఒకరూ, తిండిలేకపోయినా బతకొచ్చుగానీ... నిద్రలేకపోతే బతకలేం అని మరొకరూ, అసలు గవర్రాజు మనిషా? యంత్రమా అని వేరొకరూ అనుకునేవారు. ఇలా రకరకాలుగా.



నేను రోజూ గవర్రాజు ఇల్లు దాటుకునే వెళ్ళడం వలన అతని సంగతులన్నీ నాకు బాగా తెలుసు. వాళ్ళ అమ్మ నాలుగిళ్లలో పాచి పని చేసేది. వాళ్ళ ఇళ్ళల్లో మిగిలిన అన్నం, కూరలూ తెచ్చేది. అందుకని ఇంటి ఖర్చు పెద్దగా ఉండదని, వచ్చిన దంతా రాబడేనని అనుకునేవారు. కొట్టుకి వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడు సాధారణంగా ఎప్పుడూ మిషనుమీదే కనిపించేవాడు. పక్క వీధిలో నుండి వెళ్ళినా సరే... మిషను శబ్దం వినిపించేది. గవర్రాజు మిషను గురించీ, మిషను శబ్దం గురించి కొంత చెప్పాలి. అబ్బా! ఏం శబ్దం రా బాబూ ! పిండి మిల్లులాగా వుండేది. ఆ శబ్దాన్ని రాత్రుళ్ళూ, పగలూ భరిస్తున్న ఆ వీధి వాళ్ళకు సన్మానం చెయ్యాలి. "శబ్దం తగ్గడానికి మరమ్మత్తు చేయించుకోవచ్చు కదా గవర్రాజు" అన్నాను ఒకసారి.

"రెండు, మూడు సార్లు చేయించాను. తగ్గలేదు. పైగా తిబ్బి(కుట్టు) తేడా వచ్చింది. మరింకెందుకని వదిలేసాను."

"నిజమేలే... తిబ్బి తేడా వస్తే కుట్టు అందంగా వుండదూ. పట్టూ వుండదు. మరేం చేస్తావులే" అన్నాను. ఆ పక్కవీధిలో నుండి ఎప్పుడు వెళ్ళినా ఆ శబ్దం వినిపించేది. అలా కష్టపడే తాతల నాటి పెంకుటిల్లు శ్లాబు వేయించాడు. ఆ ఇల్లు కట్టేటప్పుడు ఎంత కష్టపడ్డాడో ప్రత్యక్షంగా చూసిన నాకు తెలుసు. అతనేనా వాళ్ళ అమ్మకూడాను. ఇద్దరు మనుషుల కూలి డబ్బులు మిగులుతాయని తల్లీ కొడుకులు ఇద్దరూ ఇటికలూ, పిక్కా మోసేవాళ్ళు. అప్పటికి ప్రసాదు చిన్నపిల్లాడు. గవర్రాజు భార్య మాత్రం వంటపనిలో వుండేది. ప్రసాదుకి ఈ విషయాలు ఎంత వరకూ తెలుసన్నది సందేహమే.

తరువాత రోజుల్లో మేం ఇల్లు మారిపోవడం, జయరాజ్ కొట్లో పనిమానేసి, కొట్టు పెట్టుకోవడం వలన గవర్రాజు బోగట్టాలు నాకు పెద్దగా తెలీలేదు. ఒకసారి గవర్రాజు కనిపించి...." తను పెద్ద జబ్బు పడిపోయానని, దాదాపు పదేళ్ళు మిషను ఎక్కలేదని, కొడుక్కి వుద్యోగం వచ్చిందని, ఇప్పుడు ఇంటి వ్యవహారాలన్నీ కొడుకే చూసుకుంటున్నాడని, భార్య చనిపోయిందని" చెప్పాడు.

''ప్రసాద్ అంత పెద్దయిపోయాడా? పోనీలే కష్టపడినన్నాళ్ళూ కష్టపడ్డావు. ఇప్పుడైనా సుఖపడు" అన్నాను. మా మధ్య ఆ మాటలు నడచిన తర్వాత, మళ్ళీ ఈ రోజు కనిపించడమే. గవర్రాజు ఆలోచనలతోనే కొట్టుకి వచ్చాను. కొట్టుకి వచ్చిన తర్వాత పనిలో పడిపోయాను. కాసేపు పనిలోపడ్డా మరి కాసేపటికి... గవర్రాజు జ్ఞాపకం వచ్చాడు. ప్రసాదుతో మాట్లాడాలనే వుంది. ప్రత్యేకించి ఇంటికి వెళితే... అలా బాగోదు. తండ్రి ఏదో కంప్లైంటూ ఇచ్చినట్లు, తను అడగడానికి వచ్చినట్లు వుంటుంది. అలా కాకుండా త్రోవలో ఎక్కడైనా కనిపిస్తే.... మిగతా విషయాలు అడిగి... ఈ విషయానికి పెద్దగా ప్రాధాన్యత లేనట్లు అడగాలి అనుకున్నాను. ఒకసారి కొట్టు ముందు నుండే వెళ్ళిపోతుంటే, పిలిచాను. ఒంటిమీద రడీమేడ్ వుండడం గమనించాను. చాలా చిన్నతనం నుండి తెలియడం వలన కాస్త చనువు వుంది. నేనంటే కాస్త గౌరవం కూడా వుంది.

"రావయ్యా! ఎక్కడా కనిపించడం లేదు?"

"లేదండి... కుదరడం లేదు. ఆఫీసు, ఇల్లూ"


''రడీమేడ్ బట్టలు వేసావు. మీనాన్న మిషను ఎక్కడంలేదా? గవర్రాజు జబ్బుపడి పోయాడని తెలుసు.

"మా నాన్న ఇంకేం మిషను ఎక్కుతాడండీ. అయినా చెప్పిన మాట వినడు. అన్నిటికీ బయలుదేరిపోతాడు."

"అది సరే! మీ నాన్న బందరు వెళ్తానంటున్నాడేమిటి?"

"ఏం చెబుతామండీ... పొయ్యేకాలం. తిని ఉండలేక.. చూసేవాళ్ళు ఏమనుకుంటారంటే.... కొడుకు సరిగ్గా చూడలేదంటారు. ముసలి నా కొడుకులు ఎలా ప్రవర్తించినా

పట్టించుకోరు. ఏ మాత్రం తేడా వచ్చినా కొడుకుల్నే అంటారు.'' అంటూ సంబంధం లేని మాటలు మాట్లాడుతున్నాడు.



"అదికాదు ప్రసాదూ ! ఇక్కడ అతనికి బాగుంటే... అంతదూరం వెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చింది. అక్కడైతే... ఒంటిగాడు. అదే ఇక్కడైతే మంచికీ... చెడ్డకీ మనం వున్నాం. అక్కడెవరున్నారు?"

"నిజమేనండీ.... ఎవడెల్లమన్నాడు. ఇక్కడేటిలోటు. తిండికి లోటా... గుడ్డకి లోటా... ఉండడానికి లోటా... పది అడిగితే పాతిక ఇస్తాను. పాతిక అడిగితే వందిస్తాను. నా మాట అబద్ధమైతే ముసిలోడ్ని అడగండి. కనిపించినోల్లందరి తోటి ఇదే మాట. పోతే పొమ్మనండి"

"అది కాదు ప్రసాదూ ! తొందరపడి అంత మాట అనకు. యంతయిన తండ్రి. వయసు మీద పడినపుడు, ఓపికలు తగ్గుతాయి. ఎవరిది తప్పూ, ఎవరిది ఒప్పూ అనరు. ఈ వయసులో వదిలేసాడని నిన్నే అంటారు."

"నిజమేనండి! తాతల నాటి పాత పెంకుటిల్లు వున్న మాట నిజమే. అది అమ్మేయ్యాలి. అక్కడెవరుంటారు. ఆ సంగతి చూడమని అన్నాను. అంటే ఏకంగా అక్కడికెల్లి వుండిపోతానంటున్నాడు. ఎంతకని చెబుతాను. చెప్పి చెప్పి విసుగెత్తిపోయాను."

ముసిలోడు.. ముసిలోడు అని అనడం లోనే, ఆ తీరులోనే ఏదో వ్యతిరేకత ధ్వనించింది. ముందు ఏదో అనుకున్నాను గానీ... గవర్రాజుదే తప్పులాగా వుంది. కొడుకు అంత బాగా చూసుకున్నప్పుడు. అడిగినంత డబ్బు ఇస్తున్నప్పుడు.... ఎక్కడికో ఎందుకెళ్ళాలి. ఏదిఏమైనా విషయాలు పూర్తిగా తెలియకుండా మనం ఒక నిర్ణయానికి వచ్చేయకూడదు. కాసేపు వేరే విషయాలు మాట్లాడి వెళ్ళిపోయాడు. ఈసారి గవర్రాజుని అడగాలి. అనుకున్న రెండు మూడు రోజులకే గవర్రాజు కొట్టుకి వచ్చాడు.

"కొట్లో పాతవి వదిలేసిన బట్టలు ఏవైనా ఉన్నాయా? వుంటే ఇద్దూ... బొత్తిగా బట్టలు లేవు. సైజు చేసుకొంటాను."

"చూస్తానులే... చేతిలో పని అయిపోయాక. అది సరే గానీ... మీ అబ్బాయి నువ్వు అడిగినన్ని డబ్బులు ఇస్తాడా? పది అడిగితే పాతిక ఇస్తాడా?

"అంటే మా వాడు కలిసాడా? అందరితోనూ అలాగే చెబుతున్నాడు."

"ఏం ? ... ఆ మాటలో అబద్ధం వుందా? ఇవ్వడంలేదా?

"ఇవ్వలేదని ఎవడన్నాడు?"

''మరి ఇంకేం అంత బాగా చూసుకున్నప్పుడు వూరు ఎందుకెళ్ళాలి?"

''బాగా చూసుకోవడమంటే డబ్బులు ఇవ్వడమా? చెప్పు."

"..............................."

'వాచ్‌మెన్‌కి ఇచ్చిన గది నా కిచ్చాడు. బట్టలు సంగతా? ఇప్పుడు నీ దగ్గరకు పాత బట్టల కోసం వచ్చాను కదా! నీకు అర్థం అయ్యేవుంటుంది. భోజనం సంగతా? డబ్బులు పారేస్తాడు. అది వున్నన్నాళ్ళు ఏదో అదే పడింది. ఏ విషయమూ నాకు తెలీనిచ్చేది కాదు. ఏం? ఆళ్ళు వండుకున్న వంటలో నాకా మాత్రం రెండుముద్దలు పెట్టలేరా? నేనేం నాకు ప్రత్యేకించి అదికావాలీ, ఇది కావాలీ అని అడిగానా? ఆల్లు ఏది వండుకుంటే అదే పెట్టమన్నాను గానీ.. ఇంకేం అడగలేదే. కుటుంబం మనిషిలాగా నన్ను చూడాలి గానీ... బయటోడి లాగా డబ్బులు పారేస్తానంటే... నాకెందుకు. ఆ మాత్రం నా ఒక్కడికి కడుపుకి ఏం వుంది. జరుగుబాటు లేకుండాపోతుందా?"

ఇప్పుడు విషయం అర్థం అయ్యింది. గానీ.. ఆ మాత్రం దానికి వూరు వదిలి వెళ్లి పోవడమెందుకు? అదే విషయం అడిగాను.

"ఆ పనేదో ఇక్కడే చేసుకోవచ్చు కదా!"

''ఇక్కడెందుకు? యీ వయసు తండ్రితో పని చేయిస్తున్నాడని వాడినే అంటారు."


"అదేటి గవర్రాజు అలా అంటావు? కొడుకు మీద అంత చెప్పావు. కొడుకు ప్రవర్తన వలన క్షోభపడ్డావు. మళ్ళీ ఆ ప్రేమేమిటి? కొడుకుని ఎవరో ఏదో అంటారని నువ్వు వూరు వదిలి వెళతావా? అంత సిగ్గుపడే వాడు తన ప్రవర్తన మార్చుకొంటాడు. లేదా నీతో గొడవ పడతాడు. అన్నిటికీ సిద్ధపడాలి. అంతే గానీ కొడుకుల మీద ఈగ వాలనివ్వకూడదంటే వాళ్ళెప్పటికి మారతారు. అది బాగాలేదు. ఆలోచించుకో."

"చూద్దాం" అనుకుంటూ వెళ్ళిపోయాడు. వారం పది రోజుల తర్వాత అటువైపు వెళుతుంటే... పిండి మిల్లు శబ్దం లాంటి శబ్దంతో మిషను శబ్దం చాలా సార్లు వినిపించింది.

**కవిత**

# గాయపడ్డ విత్తనం

- ఈ.రాఘవేంద్ర
9494074022



ఊళ్లో ధ్వంసమై మొలకెత్తని
విత్తన మొకటి
పట్నంలో
ఓ ఇంటి గేటు ముందు
గ్రీష్మం కురిసిన చెట్టై నిలబడింది

తూట్లు పడ్డ కాలంలో
తాను కాసిన
స్వప్నాలన్ని ఒడగట్టబడి

గతమనే జ్ఞాపకాలను మాత్రమే మిగిల్చాయి
ఇపుడు
తాను
చీకటి కార్చిన కన్నీరు
ఆత్మాభిమానం విడిచిన కుబుసం

చుక్క నీరు లేక
చెరువు పగుళ్ళుదేలినట్లున్న
ఆ దేహం
ఈ దేశం చిరునామా

♦

# అయామ్ ఆన్ ద వే

- నీలం వెంకటేశ్వర్లు
9502411149



అయామ్ ఆన్ ద వే...
అవును నేనే కాదు
మనమందరం అదే దారిలో ఉన్నాం
కాళ్ళకు కాలచక్రాలు తగిలించుకొని మరీ ఉరకలేస్తున్నాం
వజ్రాల్ని దూరం చేసుకొని
రంగురాళ్ళ వెతుకులాటకు
అవును..మనమందరం అదే దారిలో
అపసవ్యదిశలో పరుగులు పెడుతున్నాం

భూగోళం అరచేతిలో ఇమిడిపొయ్యాక
జీవితం స్మార్ట్‌కు ఎడిక్షన్ అయ్యాక
మనం చెప్పే ప్రతి గుడ్‌మార్నింగ్ గుడ్‌నైట్‌లు
స్మార్ట్ మనిషికే
స్మార్ట్‌యుగం నా..నీ తేడా లేకుండా
ఎదగదులను ఆక్రమించాకా
ఇపుడు స్టెతస్కోప్‌కు వినిపించేది మృత్యులయలే

అమ్మఒడి ఆటలోని వెచ్చదనం
కోతికొమ్మచ్చుల కమ్మదనం
ఒప్పులకుప్పల వయ్యారాలు
వాడిన పువ్వులయ్యాక
మనకు మిగిలింది అన్నీ స్మార్ట్‌గేమ్‌లే

కెరీరిజపు పరుగుల ఒంటరి ప్రయాణంలో
కనిపించే దారిదీపాలన్నీ ఎండమావులే
అజ్ఞాత మారీచుల పద్మవ్యూహంలో
చేతిమునివేళ్ళు లాక్కెళ్ళే ఒక్కొక్క అడుగు
యమన్‌పాశం ఆశగా ఎదురుచూసే వధ్యశిల వద్దకే

మట్టి మనుషులు మరమనుషులైనపుడూ
మాట్లాడే మనసులు విచ్చుకోనపుడూ
ఒంటరితనం ఒళ్ళు పులుముకున్నపుడూ
నీకూ నాకు మధ్య మైళ్ళదూరం పెరిగినపుడూ
ఇక మన నడకలన్నీ నీలితిమింగలాల వైపే
( బ్లూవేల్ గేమ్ ఆత్మహత్యల నేపథ్యంగా...)1

♦

పరిశీలన

# వదరుఁబోతు కు వందేళ్లు...!

- డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి
*9963917187*



***తెలుగు వ్యాసానికి తొలిదశలో ప్రమేయాలు, సంగ్రహం, ఉపన్యాసం తదితర పదాలు సమానార్థాలుగా కొనసాగాయి. రాజమండ్రిలో జిల్లా న్యాయమూర్తిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన సామినేని ముద్దునరసింహం నాయుడు తన వ్యాసాలను 'ప్రమేయాలు'గా పేర్కొన్నాడు. బందరు నుండి వెలువడే 'హితవాది' పత్రికలో 1842 నుండి 1847 వరకు ఇవి ప్రచురిత మయ్యాయి. 1862లో 'హితసూచిని' పేర అవి పుస్తకంగా వెలువడినాయి. హేతువాద దృక్పథంతో, సంఘసంస్కరణ ఇతివృత్తంగా ఈ వ్యాసాలు కొన సాగాయి. లభిస్తున్న ఆధారాలలో తెలుగు వ్యాసరచయితలలో వీరు ప్రథములు. తరువాత తరాలకు మార్గదర్శకులు కూడా.***

ఏదైనా ఒక విషయాన్ని వివరించి రాయటమే వ్యాసం. విషయ ప్రధానంగా, సులభంగా అర్థమయ్యేలా, సంగ్రహంగా రాయటం వ్యాస ప్రధాన లక్షణం. ఫ్రెంచ్ రచయిత మాంటెన్ 1571లో తాను రాసిన వచన రచనకు ఫ్రెంచ్‌భాషలో 'ఎస్సె' అని పేరు పెట్టాడు. ఫ్రాన్సిస్ బేకన్ దీనిని స్వీకరించి ఆంగ్ల సాహిత్యంలో ఈ ప్రక్రియను విస్తృతపరిచాడు.

తెలుగు వ్యాసానికి తొలిదశలో ప్రమేయాలు, సంగ్రహం, ఉపన్యాసం తదితర పదాలు సమానార్థాలుగా కొనసాగాయి. రాజమండ్రిలో జిల్లా న్యాయమూర్తిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన సామినేని ముద్దునరసింహం నాయుడు తన వ్యాసాలను 'ప్రమేయాలు'గా పేర్కొన్నాడు. బందరు నుండి వెలువడే 'హితవాది' పత్రికలో 1842 నుండి 1847 వరకు ఇవి ప్రచురిత మయ్యాయి. 1862లో 'హితసూచిని' పేర అవి పుస్తకంగా వెలువడినాయి. హేతువాద దృక్పథంతో, సంఘసంస్కరణ ఇతివృత్తంగా ఈ వ్యాసాలు కొన సాగాయి. లభిస్తున్న ఆధారాలలో తెలుగు వ్యాసరచయితలలో వీరు ప్రథములు. తరువాత తరాలకు మార్గదర్శకులు కూడా.

విజయనగరానికి చెందిన పరవస్తు వెంకటరంగాచార్యులు 1872లో 'సంగ్రహం' పేరుతో వ్యాసాలు రాశాడు. భారతీయ మత, సాహిత్య అంశాలు ఇందులో ప్రధానంగా ఉన్నాయి. పోతం జానకమ్మ తన ఇంగ్లాండు పర్యటన గురించి వ్యాసరూపకంగా 1874లో 'ఆంధ్రభాషా సంజీవని' పత్రికలో వ్యాసాలు రాశారు. బెంగుళూరులో ఆంధ్రోపాధ్యాయులుగా ఉండిన జీయర్‌సూరి 1875లో వ్యాసాలను రాసి ' స్త్రీ కళాకల్లోలిని' పేర వ్యాససంపుటిని ప్రచురించాడు. స్త్రీల కు సంబంధించిన అంశాలే ఇందులో ప్రధానంగా ఉన్నాయి.

ఆధునిక వ్యాసనిర్మాణానికి నిర్దిష్ట రూపం తీసుకువచ్చి సంఘసంస్కరణ, సమాజ చైతన్యం ఇతివృత్తాలుగా దాదాపు రెండువందలకుపైగా కందుకూరి వీరేశలింగం పంతులు వ్యాసాలు రాశాడు. 1875 నుండి 1879 వరకు వివిధ పత్రికలలో వీరి వ్యాసాలు 'ఉపన్యాసాలు' గా ప్రచురించారు. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, కందుకూరి వీరశలింగం గారి వ్యాసాలను విమర్శిస్తూ అనేక వ్యాసాలు రాశాడు. అవి 1910లో పుస్తకాలుగా వెలువడ్డాయి. ఫ్రాన్సిస్ బెకన్ ఉపన్యాసాలను 'బెకన్ ఉపన్యాసములు' గా 'కిళాంబి రామానుజచార్యులు' తెలుగు లో అనువాదం చేశారు. 1900 నుండి వ్యాసమనే పేరు తెలుగులో వాడుకలో ప్రారంభమైంది.

1901లో పి.ఎ.ప్రణతార్థి హరిశాన తన వ్యాస సంపుటికి 'వ్యాసమంజరి' అని 'వ్యాసం' పదాన్ని ప్రయోగించాడు.

భాష, సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, సామాజికఅంశాలు తదితర విభిన్న రంగాలలో తొలితరం వ్యాసకర్తలుగా పైన పేర్కొన్నవారితో పాటు మానవల్లి రామకృష్ణ కవి, చిలుకూరి వీరభద్రారావు, కోరాడ రామకృష్ణయ్య, వేలూరి శివరామశాస్త్రి, వేదం వెంకటరామయ్య శాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, బండారు తమ్మయ్య, గిడుగు వెంకటరామమూర్తి, గురజాడ అప్పారావు, జయంతి రామయ్య, పానుగంటి లక్ష్మీనరసింహారావు, కొమర్రాజు లక్ష్మణరావు, అచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ , నడుకుదుటి వీరరాజు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వేంకటరమణయ్య, కందూరి ఈశ్వరదత్తు, ఖండవల్లి లక్ష్మీ రంజనం, సురవరం ప్రతాపరెడ్డి, మట్నూరు కృష్ణారావు, చిలుకూరి నారాయణ రావు, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పప్పూరు రామాచార్యులు తదితరులెందరో కృషిచేశారు.

1835 నుండి 'తెలుగు పత్రిక'లు ప్రారంభమయ్యాయి. తొలిదశలో మత, సాంప్రదాయ అంశాలకు పత్రికలు ప్రాధాన్యతను ఇచ్చాయి. 19వ శతాబ్దం చివరి దశ నుండి పత్రికలలో సంఘసంస్కరణ, భాష, సాహిత్య, చారిత్రక రాజకీయ, జాతీయోద్యమ తదితర అనేక అంశాలు వ్యాసాలుగా రావడానికి అవసరమయ్యే పరిస్థితులు ఏర్పడినాయి.

♦♦♦

తెలుగు సాహిత్యంలో వ్యాసాలు అనగానే అప్రయత్నంగా గుర్తుకు వచ్చేది పానుగంటి లక్ష్మీనరసింహారావు వారి 'సాక్షి వ్యాసాలు'. రాజమండ్రి సమీపంలోని సీతానగరంలో 1865 సంవత్సరాన జన్మించిన పానుగంటి లక్ష్మీనరసింహారావు బి.ఏ.చదివి, ఉపాధ్యాయుడిగా, లక్ష్మీనరసాపురం ఎస్టేట్ దివాన్‌గా, పిఠాపురం సంస్థాన ఆస్థానకవిగా కొనసాగారు. నాటక రచయితగా తెలుగు సాహిత్యంలో వీరు ప్రముఖ స్థానం పొందారు. 1913లో తన నలభై ఎనిమిదో యేట 'సాక్షి వ్యాసాలు' ను 'సువర్ణలేఖ' వారపత్రికలో ప్రకటించడం ప్రారంభించాడు. కొన్నాళ్లపాటు అవి కొనసాగాయి. తిరిగి

***పానుగంటి లక్ష్మీనరసింహారావు కూడా ఈ వ్యాసాలతో ప్రభావితుడై 'స్పెక్టేటర్' పేరునే 'సాక్షి'గా అనువదించుకొని వ్యాసాలను ప్రచురించాడు. 'సాక్షి వ్యాసాల'లో తెలుగు దేశీయతే ప్రధాన జీవంగా కొనసాగాయి.***

1920,1922లలో, 1927,1933 సంవత్సరాలలో 'ఆంధ్రపత్రిక' సారస్వతానుబంధాలలో 'సాక్షి వ్యాసాలు' ప్రచురితమవుతూ వచ్చాయి.

ఆంగ్లసాహిత్యంలో 'రిచర్డ్ స్టీల్' 1709 ఏప్రిల్ 12 నుండి 1711 జనవరి 2 దాకా రెండేళ్లపాటు వారానికి మూడు రోజులు 'టాట్లర్' వ్యాసాలను పత్రికగా కొనసాగిస్తూ ప్రచురించాడు. తరువాత కాలంలో జోసెఫ్ అడిసన్‌తో కలిసి 1711 మార్చి 1 నుండి 1712 దాకా 'స్పెక్టేటర్' పేరున దినపత్రికగా వ్యాసాలను ప్రచురించారు. 1914లో స్టీల్‌తో సంబంధం లేకుండా అడిషన్ వారానికి మూడు రోజుల పాటు 'స్పెక్టేటర్' పత్రికను ఆరునెలల పాటు నడిపాడు. ఈ మొత్తం వ్యాసాలు ఎనిమిది సంపుటాలుగా తరువాత కాలంలో ప్రచురించ బడినాయి. ఆనాటి సాంఘిక దురాచారాలు, సామాజిక స్థితిగతులను ఇవి తెలియజేస్తాయి. ఆంగ్ల సాహిత్యంలో ఈ వ్యాసాలకు విశేషప్రధాన్యం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని ఈ వ్యాసాలు ప్రభావితం చేశాయి.

పానుగంటి లక్ష్మీనరసింహారావు కూడా ఈ వ్యాసాలతో ప్రభావితుడై 'స్పెక్టేటర్' పేరునే 'సాక్షి'గా అనువదించుకొని వ్యాసాలను ప్రచురించాడు. 'సాక్షి వ్యాసాల'లో తెలుగు దేశీయతే ప్రధాన జీవంగా కొనసాగాయి. గ్రాంథిక భాషలో సాగిన మొత్తం నూటాయాభై సాక్షి వ్యాసాలలో సంఘసంస్కరణ, మూఢవిశ్వాసాల ఖండన, దేశీయత, దేశాభ్యుదయం, లోకవ్యవహారాలు, భాషా,సాహిత్య, సాంస్కృతిక, సమకాలీన సమాజం తదితర అనేక అంశాలను అవి ప్రతిబింబిస్తాయి. అధిక్షేపంగా, వ్యంగ్యంగా, హాస్యాత్మకంగా ఇవి కొనసా గాయి. సాక్షి వ్యాసాలు ఉపన్యాసరూపకంగానూ, అయిదుగురు సాక్షి సంఘ సభ్యుల మధ్య సంభాషణల రూపంగాను, లేఖల రూపంగాను నడుస్తాయి. వ్యాసంలో ఉపన్యాసశైలి కొనసాగించటం వలన విషయంపట్ల పాఠకులలో మరింత ఆసక్తి కలిగించ వచ్చని ఆ పద్ధతిలో రాసి ఉండవచ్చు. పద్యం రాసినవాడే కవిగా గుర్తింపు పొందుతున్న ఆ రోజులలో గద్యం రాసి పండిత పామరుల చేత పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు మెప్పు పొందారు.

♦♦♦

1917కు ముందు దాకా తెలుగు సాహిత్యంలో వ్యాసప్రక్రియ వికాసం పత్రికల ఆధారంగా ఆయా వ్యక్తులుగా చేసిన కృషిగా కనిపిస్తుంది. అందుకు భిన్నంగా 1917 ఆగస్టు 1 నుండి అనంతపురం పట్టణం కేంద్రంగా 'స్టూడెంట్స్ క్లబ్ అనంతపురం' పక్షాన విద్యార్థులు సమిష్ఠిగా 'వదరుఁబోతు' పేరున వ్యాసాలను కరపత్రాల రూపంలో ప్రచురించడం ప్రారంభించారు. 1709లో 'రిచర్డ్ స్టీల్' ప్రచురించిన 'టాట్లర్' పేరును 'వదరుఁబోతు'గా అనువదించుకొని ఈ విద్యార్థులు ప్రచురించారు. "ఈ వ్యాసకర్తలు ఆ మొదటి 'సాక్షి' (1913) పేరును తెలిసియుండలేదని స్పష్టముగాఁ జెప్పవచ్చును .కావున 1917లో 'వదరుఁబోతు' జననమునకు 'సాక్షి'తో నేసంబంధమును లేదనుట నిక్కము " అని 1932లో పుస్తక రూపంలో వెలువడిన 'వదరుఁబోతు' పీఠికలో పేర్కొన్నారు. 1913 నాటి 'సువర్ణలేఖ' పత్రికలు వీరి దృష్టికి వచ్చి వుండక పోవచ్చు. ఒకవేళ వచ్చినా తప్పులేదు. 'సాక్షివ్యాసాలు' నలభైఎనిమిది సంవత్సరాల పండితుడు రాసినవి, పత్రిక ఆధారంగా వెలువడినవి. వదరుఁబోతు వ్యాసాలు ఇరవైలలోని విద్యార్థులు, యువకులు రాసి కరపత్రాల రూపంలో వెలువడినవి. దేని ప్రాధాన్యత దానిదే!. అదే పీఠికలో "చేతడబ్బు ఎక్కువలేక, అధికారములేమియూ లేక యున్నవారు ఆ కాలములో పక్షమునకొకతూరి క్లుప్తముగా నాలుగైదు పుటల వ్యాసమును ముద్రింపించు భగీరథ ప్రయత్నమూపని, చేసినవారు తప్ప నితరులెఱుఁగలేరు. ఎట్లో కష్టపడి ముద్రింపించి వ్యాసములను కాలణాకొకటిగా వీధిలో అమ్మి, పోస్టు ఖర్చులు పెట్టుకొని బైటి కెందఱకో ఉచితముగా పంపి, ఎన్నో ప్రతులు తిరిపెము పంచి, సుమారు రెండేండ్లకు మించి దీనిని నడిపి తుదకు సుప్రసిద్ధ కారణములచేత, వదరుఁబోతు వాయి మూసికొనెను" అని పేర్కొన్నారు. దీనిని బట్టి వీరి శ్రమ అర్థమవుతుంది. 'సాక్షి','వదరుఁబోతు' వ్యాసకర్తలిరువురూ 'స్పెక్టేటర్, టాట్లర్' వ్యాసరచనల ధోరణికి ప్రభావితమైనవారే. చిన్నవయసులోని విద్యార్థులు, యువకులు సమిష్ఠిగా కరపత్రాల రూపంలో 'వదరుఁబోతు' వ్యాసాలను క్రమం తప్పకుండా ప్రచురిస్తూ సమాజమార్పే ఆశయంగా కొనసాగించడం ప్రపంచ సాహిత్యంలోనే అరుదైన అంశం.

'వదరుఁబోతు' వ్యాసాల ప్రచురణలో క్రియాశీలక బాధ్యత, బరువు మోసింది పప్పూరు రామాచార్యుల వారు. 1896 నవంబర్ 8న అనంతపురంలో రామాచార్యులు జన్మించారు. ప్రాథమిక విద్య ఇక్కడే కొనసాగింది. తన బావగారైన కుంటిమద్ది రంగాచార్యులు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా ఉద్యోగం చేస్తుండడంతో అక్కడ వారి ఇంటనే ఉంటూ మెట్రిక్యులేషన్ పూర్తిచేసారు. అప్పటికి రామాచార్యుల వయస్సు పదహేడు సంవత్సరాలు. తన బావగారి ద్వారా వీరేశలింగం పంతులుగారితో పప్పూరు రామాచార్యులవారికి కొంత పరిచయం కూడా ఉండేది. రాజమహేంద్ర వరంలోని సాహిత్య, సంఘసంస్కరణ తదితర అంశాల పట్ల కొద్దోగొప్ప పరిచయం రామాచార్యులకు కలిగి ఉంటాది. 1914-1916లలో ఇంటర్మీడి యట్‌ను మద్రాసులోని పచ్చాయప్ప కళాశాలలో చదివాడు. పత్రికలు, ఆంగ్ల సాహిత్యం, దేశ వర్తమాన స్థితిగతుల పట్ల అవగాహన విస్తరించడానికి మద్రాసు వాతావరణం వీరికి తోడ్పడింది. 1916లో అనంతపురంలో ఆర్ట్స్ కళాశాల ప్రారంభమైంది. సర్వేపల్లి రాధాకృష్ణన్ తదితర పండితులు ఈ కళాశాలలో అధ్యాపకులుగా ఉండేవారు. ఉన్న ఊర్లోనే చదువుకోవచ్చని 1917లో అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో బి.ఏ. కోర్సులో చేరాడు. ఈ సమయంలోనే తన ఇరవయ్యేవయేట పప్పూరు రామాచార్యులు తన సహచరులు, మిత్రులు, యువకుల సహకారంతో 'వదరుఁబోతు' వ్యాసాలను ప్రచురించడం మొదలు పెట్టారు.

పదిహేను రోజులకొకసారి 1/8 సైజులో నాలుగు పుటలుగా వదరుఁబోతు కరపత్రం వెలువడేది. కరపత్రం పైభాగానా క్రమసంఖ్య, తేది, వెలతో పాటు 'వదరుఁబోతు' అని ప్రధాన శీర్షిక ఉండేది. 'పబ్లిష్డ్ బై ... స్టూడెంట్స్ క్లబ్ అనంతపురం' అని ఉండేది. ప్రతి కరపత్రం ప్రారంభంలో ఆంధ్రభారతములోని...

**'సాక్షి','వదరుఁబోతు' వ్యాసకర్తలిరువురూ 'స్పెక్టేటర్, టాట్లర్' వ్యాసరచనల ధోరణికి ప్రభావితమైన వారే. చిన్న వయసులోని విద్యార్థులు, యువకులు సమిష్ఠిగా కరపత్రాల రూపంలో 'వదరుఁబోతు' వ్యాసాలను క్రమం తప్పకుండా ప్రచురిస్తూ సమాజమార్పే ఆశయంగా కొనసాగించడం ప్రపంచ సాహిత్యంలోనే అరుదైన అంశం.**

*గీ॥ కార్యగతుల తెఱఁగుగల రూపుచెప్పిన*
*నధికమతులు దాని నాదరింతు*
*రల్పబుద్ధులైన యట్టివారలకది*
*విరసకారణంబు విషము వోలె"* అనే పద్యం ప్రచురించేవారు.

వదరుఁబోతు వ్యాసం చివరన ఆ వ్యాస రచయితలకు గుర్తుగా వారి పేర్లలోని ఒక అక్షరం సంకేతంగా ప్రచురించేవారు. వ్యాసం చివరలో వ్యాసాంశానికి అనువైన సూక్తియో, శ్లోకమో, పద్యపాదమో ప్రచురించేవారు. స్వామివిలాస ప్రెస్-అనంతపురం అని ప్రెస్‌వారి పేరు ఉండేది. ఇది వదరుఁబోతు కరపత్రం బాహ్య స్వరూపం.

మొత్తం రెండేండ్ల కాలంలో యాభై వ్యాసాలు ప్రచురించగా అందులో హిందూపురంలోని పక్కా గురురాయాచార్యుల వద్ద లభ్యమైన ఇరవై రెండు వ్యాసాలను 1932లో వదరుఁబోతు పుస్తకంగా సాధన ముద్రణాలయం పక్షాన ప్రచురించారు. పప్పూరు రామాచార్యులవారే ఈ ముద్రణాలయం నిర్వాహకుడు. అందులో ఇరవై వ్యాసాలు వదరుఁబోతు కరపత్రాలు కాగా రెండు వ్యాసాలు పినాకిని పత్రికలో ప్రచురితమైనవి ఉన్నాయి. ''కర్తలు స్థలాంతరములకుఁ బోయి కార్యాంతరములకుఁ జిక్కి పోవుటచేతను, ఒకతూరి వ్రాసి పంచి పెట్టుటచేత తాము తలపెట్టిన పనియైనది గావున నీవ్యాసములను భద్రపఱచి యుంచ వలసినంత యక్కర వారి కంతగా లేకపోవుట చేతను పై వ్యాసములలో ననేక ములు దుర్లభములైనవి" అని పీఠికలో పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఎంత ప్రయత్నించినా మిగతా ముప్పై వదరుఁబోతు వ్యాసాలు నాకు లభించలేదు. రాయలసీమలో స్వాతంత్ర్యం పొందేనాటికి దాదాపు యాభై పత్రికలు వెలువడినాయి. వాటిలో మనకు ఒకటిరెండు మాత్రమే లభ్యమవు తున్నాయి. కనీసం యాభై ఏళ్ల క్రిందట సీమవాసులు ప్రచురించిన పుస్తకాలు కూడా నేడు అలభ్యాలుగా ఉన్నాయి. వీటిపట్ల సీమవాసులు బాధ్యతగా వ్యవహ రించి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే గత కాలానికి సంబంధించిన ఎంతో విలువైన సమాచారం చేజేతులా పోగొట్టుకున్నవారమవుతాము. తమ వద్ద ఉన్న పాతపత్రికలు, పుస్తకాలు అటకలమీదికి ఎక్కించి బూజు, చెదలు పట్టించుట కంటే, గుప్తధనంగా దాచుకొనేకంటే వాటిని

**యాభై కర పత్రాలలో ఇరవై మాత్రమే లభించాయి, మొదటి మూడు, పదహేనవ మరియు చివరి ఇరవైఆరు కరపత్రాలు లభించలేదు. చివరి కరపత్రం 1919 ఆగస్టు 30న వెలువడి ఉంటుంది.**

లోకానికి వెల్లడిచేయటం ద్వారా, వెల్లడించేందుకు ప్రయత్నించే పరిశోధకులకు తోడ్పడటం ద్వారా రాయలసీమకు మహోపకారం చేసిన వారవుతారు.

కరపత్రాలుగా వెలువడినప్పుడు వదరుబోతు వ్యాసాలకు శీర్షికలు లేవు. 1932 ముద్రణలో చదువరులకు అనుకూలంగా ఉండేందుకు ప్రతి వ్యాసానికి శీర్షికలు ప్రకటించారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పీఠిక రాసారు. ప్రచురణ కర్తలు ఇచ్చిన సమాచారం మేరకు మొదటి కరపత్రాల సంఖ్య ప్రకారం, ఏడవ నెంబరు కరపత్రం 1917 నవంబర్ 1న వెలువడినట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి మొదటి కరపత్రం 1917 ఆగస్టు 1న వెలువడి వుంటుంది. ఏడవ నెంబరు కంటే ముందువి నాలుగు, ఐదు, ఆరు మాత్రమే లభించాయి. ఒకటి, రెండు, మూడు కరపత్రాలు లభించలేదు. ఇరవైరెండవ కరపత్రం 1917 సంవత్సరం అని మాత్రమే పట్టికలో చివర ఇచ్చారు. ఈ కరపత్రం ఎనిమిదోవ నెంబరు 1917-11-15న దీపావళి సందర్భంగా ప్రకటించబడి వుంటుంది. మొత్తం యాభై కర పత్రాలలో ఇరవై మాత్రమే లభించాయి, మొదటి మూడు, పదహేనవ మరియు చివరి ఇరవైఆరు కరపత్రాలు లభించలేదు. చివరి కరపత్రం 1919 ఆగస్టు 30న వెలువడి ఉంటుంది.

1932 నాటి 'వదరుఁబోతు' పుస్తక పీఠికలో "ఇదిగాక ఇంచు మించుగా నీ'వదరుబోఁతు' జన్మించిన కాలమందే గుంటూరు నుండి కాఁబోలు నొక్కరు ఇట్లే కొన్ని వ్యాసములు ప్రకటించుచుండిరి. వాని పేరు ప్రకృతము మఱచితిమి. ఎట్లో వారు మకుటముగా నుంచుకొని యుండిన ఈ క్రింది పద్యమొకటి జ్ఞప్తిలో నిలిచినది.

*తే. 'ఉద్ధరించెద దేశమేనొక్కరుఁడనె*
*నిక్కమియ్యది చేయంగ నేర రొరులు*
*అనుచు విలియము పిట్టను నతఁడు పలికె;*
*అట్లెయందఱుఁ దలఁచిన నగును శుభము'.*

గుంటూరు మిత్రు లొక్కరివద్ద నీ వ్యాసపత్రములు రెండుండఁగాఁ జూచియుంటిమిగాని యితరులీప్రాంతములలో నెవరును వాని నిదివఱకు కనియెఱుఁగరు. వినియెఱుఁగ రన్నను తప్పులేదు" అని ప్రకటించారు. 1935 నాటి

'వదరుఁబోతు' పుస్తకం పునర్ముద్రణలో పై గుంటూరు వ్యాసపత్రాల సమాచారం తొలగించి ప్రచురించారు. ఆధారాలు లభించని సమాచారం రెండవ ముద్రణలో అవసరం లేదని భావించి ఉండవచ్చు. వీటిపై పరిశోధకులు దృష్టి పెడితే అవి కూడా లభించవచ్చు.

**వదరుఁబోతు కరపత్రాలలోని సంకేతాక్షరాలు వీరి పేర్లే అని చెప్పటం మరింత అధ్యయనంతోనే సాధ్యం. తొమ్మిదవ వ్యాసం 'స్వకీయచరిత్ర'లో వ్యాసకర్తలు సాధకబాధకాలు చెప్పుకున్నారు.**

◆◆◆

ఈ వ్యాసాలు పరోపకార గుణం, విలువలతో కూడిన విద్య, గ్రంథాలయాలు, కళాశాలల ఆవశ్యకత, దేశాభ్యుదయం, సహజస్వభావశక్తి విశిష్టత, స్వదేశీ వస్తూత్పత్తి, మూఢ మతభక్తి నిరసన, అనర్హగౌరవం, కీర్తికండూతి, ఆడంబర జీవనం, అనవసర ధనవ్యయం, పరాయిసంస్కృతి, పరాయి అనుకరణ వ్యతిరేకత, హాస్యం ఆవశ్యకత, సత్యసంధత, కవిత్వ నాటకతత్త్వం, తెలుగు సంస్కృత సాహిత్యాల వికాసం, ఇలా మానవ ప్రవృత్తికి, సమాజ పోకడలకు సంబంధించిన అనేక అంశాల నేపథ్యంగా 'వదరుఁబోతు' వ్యాసాలు సాగుతాయి.

వ్యాసాంశానికి లోబడి ఏమాత్రం సంగ్ధిత లేకుండా చెప్పదలచుకొన్న విషయాన్ని సూటిగా చెప్పడం వీరి ప్రత్యేకత. ఆయా సందర్భాలలో కొన్ని వ్యాక్యాలను గమనిస్తే వీరి ప్రాపంచిక దృక్పథం అర్థమవుతుంది.

"సుగుణ దుర్గుణములకు లింగ వ్యవస్థ యుండదు",

"క్షుద్రజంతువులును తమ భోక్తను దప్ప యితర మృగములను ద్వేషింపవు. మనుజుఁడన్ననో స్వభావము చేతనే సర్వజంతువులను ద్వేషించును".

"సంఘమునకుఁ జెఱుపుఁ గలిగించు కార్యములనే గదా వారు నరక హేతువు లగు పాపకార్యములనుట. మనకుఁ జేతనైనంత మట్టున కితరులకు మేలు చేయుచు, సంఘమున కేవిధమగు కీడుఁగలిగింపక నలుగురిలో సజ్జనుఁడని పించుకొన్నచో"

"భావనా శిల్పముల నెఱంగక వ్రాయఁబడు కవితకును గవితయను పేరు చెల్లునేని,యిఁక ప్రపంచమున నూటికి నూరువంతులు కాళిదాసులే యగుదురు గదా? అపుడాడిన మాటలన్నియు నాశుధారలై పాడిన పాటలెల్ల ప్రబంధము లగును"

"అన్ని నీతి శాస్త్రములయు, అన్ని ధర్మశాస్త్రములయు, అన్ని మతగ్రంథములయు సార మీ సత్యసంధతమే. అది లేక యుండెనా మానవుఁడెంత పండితుఁడైనను, ఎంత యాచారవంతుఁడైననుం ఏవగింపఁదగిన వాఁడే. 'సత్యము సర్వశ్రేయో మూల'మని పెద్దలే నుడివి యున్నారు"

"యోగ్యత ననుసరించి గౌరవము తనంత రావలయుఁగాని, కొలఁదికి మీఱి యపేక్షించినంత రాదనుట ధ్రువము"

"తెలియని మతములకై యర్థముకాని గ్రంథములఁ జదివి రానిపోని స్వర్గసుఖమున కర్రులు సాచుటకన్న మనయింట మనయూర, మన దేశమున, మన సంఘమున, మన జీవితముల నుపయుక్త ములుగఁ జేయుట మిగుల ముఖ్యమని నాయాశయము "

"సామాన్య ధర్మములలో రుచిలేక విశేషధర్మము లెఱుఁగక యందు నిందుఁ గొఱగాని యవివేకులగు చదివినవారికన్న నపండితుఁడేమేలని ప్రపంచ తత్త్వవేత్తల మతము"

"ధనమును మితిలేక వెచ్చించి బాణములగొని తమ ధనుర్విద్యనంతయు నాపయింబెట్టి తగులఁబెట్టినచో వీరికేమి ఫలము? నాకై పాడు చేసిన ద్రవ్యమున సగబాలుతో నూరూర మంచి గ్రంథాలయములగునే? ఇట్టి ధనమంతయు ప్రోగుచేసినచో నొక గొప్ప జాతీయకళాశాల యేర్పడదా? దేశము బాగుపడదా? ఏమి మౌర్ఖ్యమిది! ఆ బాణములైన తమంత జేసికొను శక్తి వీరికి లేదే ? ఏ జపానుతల్లియో, ఏచీనా సోదరుఁడో, తయారుచేసి వీరికి భిక్ష మివ్వవలసి యుండుటకైన వీరు సిగ్గుపడరు గదా"!

ఈ విధంగా తామనుకున్న భావాలను, నమ్మిన సత్యాలను గొంకు జంకు లేకుండా ప్రకటించడం అనాటికి గొప్ప విషయమే.

ఈ వ్యాసాలు ఉత్తమ పురుషలోను, ఆత్మస్వగతంగా చెబుతున్నట్లు, సర్వసాక్షి దృష్టికోణంగా, సందేశాత్మకంగాను కొనసాగుతాయి. వ్యాసాల ఎత్తు గడలో, విషయచర్చలో, ఉపపత్తుల సమీకరణలో, ముగింపులలో ఇలా అన్ని సందర్భాలలో నిర్మాణ నైపుణ్యం భావితరాలు అనుసరించదగ్గవి. వ్యాసాలు ఎలా రాయాలో నేర్చుకొనేవారికి నమూనాగా ఈ వ్యాసాలు తోడ్పడుతాయి. అందుకే 1950వ

దశకంలో ఉన్నతపాఠశాలల తెలుగు పాఠ్యపుస్తకాలలో 'వదరుఁబోతు' వ్యాసాలు చోటుచేసుకున్నాయి. మొన్నటి దాకా పదవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో 'వదరుఁబోతు' వ్యాసాల పీఠిక పాఠ్యాంశంగా ఉండింది.

"సుమారు రెండేండ్లకు మించి దీనిని నడిపి తుదకు సుప్రసిద్ధ కారణములచేత వాయి మూసుకొనెను" అని పీఠికలో ప్రచురించారు. అలాంటి సుప్రసిద్ధ కారణములు పరిశోధకులు ఆలోచించాలి. పత్రిక నిర్వహణ వ్యయం కష్టమవటం, వ్యాసకర్తలైన విద్యార్థులు చదువులో నిమగ్నం కావటం, వ్యాసకర్తలు ఉద్యోగాలలో కొనసాగుతుండటం, ఈ వ్యాసాలపట్ల ఆనాటి ప్రభుత్వాల నిఘా ఇలా కారణాలేవైనా ఉండవచ్చు. చివరి పత్రికలు లభించివుంటే మరింత సమాచారం దొరికేది. ఎట్టకేలకు 1919 ఆగస్టు 30కి 'వదరుఁబోతు' వాయి మూగబోయింది.

**ఈ వ్యాసకర్తలు విద్యార్థులు,ఉద్యోగులు కావడంతో బహిరంగంగా మాట్లాడేందుకు అవకాశముండదు, ఒక వేళ ఉన్నా కీర్తికాంక్ష కోరుకోక మఱుగున ఉంటూ లోకహితార్థమై హృదయాంతరాలలో కలిగే భావోద్వేగాలను రాతల రూపంలో వదురుచూ ఆత్మసంతృప్తికై చేస్తున్నామని తెలియజేశారు.**

'వదరుఁబోతు' ప్రచురణకర్తైన పప్పూరు రామాచార్యులు 1920లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగానే అనంతపురం కలెక్టర్ కచేరిలో చిన్న ఉద్యోగం వచ్చింది. స్వతంత్ర్యంగా జీవించాలన్న ఉద్దేశంతో 1921 మార్చి నెలలో ఆ ఉద్యోగం మానివేసారు. ఉద్యోగమైతే మానివేశారుగానీ ఆ తరువాత ఏపని చేయడానికి అవకాశాలు దొరకలేదు. కైప సుబ్రహ్మణ్యశర్మ గారి తోడ్పాటుతో ఇల్లూరు గ్రామంలోని నీలం చిన్నపరెడ్డి కుమారులకు చదువు నేర్పడానికి బాధ్యతలు చేపట్టాడు. కొన్నాళ్లకు ఆ గ్రామ కరణం ఐతరాజు నరసప్ప మరియు కైప సుబ్రహ్మణ్యంలతో కలిసి 1922 సెప్టెంబర్ 16న 'పినాకిని' పేరున పత్రికను అనంతపురం కేంద్రంగా ప్రచురించడానికి పప్పూరు రామాచార్యులు సిద్ధమయ్యారు. ఆ పత్రికకు 'స్వరాజ్యోదయం' అనే పేరు పెట్టాలని చర్చకు రాగా "స్వరాజ్యోదయం అనే పేరు కంటే దత్తమండలాలకన్నిటికీ జీవప్రధాయిని అయిన పినాకిని (పెన్నానది)" పేరు మీదనే పత్రిక నిర్వహిం చాలని రామాచార్యులు చొరవ తీసుకున్నారు.

ఆనాటికే రాయలసీమ ప్రాంతం ఔన్నత్యం, అస్తిత్వానికి సూచకంగా ఈ పేరు ఉంచటం ఆయనకీ ప్రాంతంపట్ల ఉన్న అభిమానం, బాధ్యతను తెలియజేస్తాయి. 'వదరుఁబోతు' వ్యాసాలు ఎంత సార్వజనీనమైనప్పటికీ అందులో స్థానీయ అంశాలు కూడా కనిపిస్తాయి. పినాకిని, కరువుల, జొన్నంబడి, కొర్రకూటికి తదితర ప్రస్తావనలు ఈ ప్రాంత జీవితంతో ముడిపడినవే. 'వదరుఁబోతు' వ్యాసాల వరంపరలోనే పినాకిని పత్రికలో 1922లో రెండు వ్యాసాలను ప్రచురించారు. అవి కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి. మరిన్ని వ్యాసాలు పినాకినిలో ప్రచురించి ఉంటారు. ఆ పత్రిక అలభ్యంగా ఉంది. 1920లో ఆదోని కేంద్రంగా సి.శ్రీనివాసరావు సంపాదకత్వంలో 'అరుణోదయం' పత్రిక, 1922లో అనంతపురం కేంద్రంగా అనంతగిరి వీరనార్యకవి సంపాద కత్వంలో 'బాలభారతి', 1925లో అనంతపురం కేంద్రంగా యం.సుందరమ్మ సంపాదకత్వంలో 'భారత మహిళ', 1927లో పత్తికొండ కేంద్రంగా వనం శంకరశర్మ సంపాదకత్వంలో 'ఇంద్రావతి' తదితర పత్రికలు రాయలసీమ ప్రాంతంలో వెలువడినాయి. ఈ పత్రికలలో 'వదరుఁబోతు' కోవ వ్యాసాలు ప్రచురించి వుండే అవకాశముంది. పరిశోధకులు అలభ్యాలుగా ఉన్న ఆ పత్రికలను అధ్యయనం చేయాల్సి ఉంది.

పినాకిని పత్రిక మూడున్నరేళ్ల పాటు కొనసాగి నిర్వహణ వైరుధ్యాలవల్ల 1926 మార్చి నాటికి ఆగిపోయింది. పినాకిని పత్రిక దూరం కావటం కన్నబిడ్డకు దూరమైనంత బాధగా ఉందని పప్పూరు రామాచార్యులు వాపోయారు. పినాకిని పేరునే పత్రికను నడపాలని ఎంతో ప్రయత్నించినా చట్టరీత్యా అది సాధ్యపడ లేదు. ఎట్టకేలకు తన ముప్పైయ్యోవ యేట తాను సంపాదకుడుగా, తన మిత్రుడైన కర్నమడకల రామకృష్ణమాచార్యులు సహాయ సంపాదకుడుగా 'సాధన' పత్రికను వారపత్రికగా పన్నెండు పుటలతో ప్రచురించడం ప్రారంభించారు. 'వదరుబోతు'లో లాగే ప్రతి సాధన పత్రిక సంచికలోనూ భారతంలోని 'కార్య గతుల' పద్యం ప్రచరరించేవారు. 1972 దాకా నిర్విఘ్నంగా 46 సంవత్సరాల పాటు పప్పూరు రామాచార్యులు సాధన పత్రికను నడిపారు.

'వదరుబోతు' స్ఫూర్తితో అదే పంథాలో సాధన పత్రికలో విభిన్న వ్యాసాలకు విశేష ప్రాధాన్యతనిచ్చారు. పత్రికలో వార్తలు అరభాగం వుంటే వ్యాసాలు అరభాగముండేవి.

## కవిత

# కులరక్కసి పొలికేకలు....

- సి హెచ్ .వి .లక్ష్మి
9493435649



చిలికిన ఆశల శిఖరాలపై
ఎక్కిన సిరి కల్లు తాగిన కోతిలా
శివాలెక్కి చిందేస్తుంటే
విరిగిన కెరటాలపైన నిలచిన
బ్రతుకు నావ డిస్కోలు చేస్తోంది .
అసమానతల తలపై కెక్కి
అస్త్రాలను సంధిస్తూ పాడుతున్న
ప్రగతి గీతికలు ఎవరిని మాయచేయటంకొ

పరవళ్ళు తొక్కుతున్న స్వేద సముద్రములో
కొట్టుకుపోతూ కులరక్కసి
పెడుతున్న పొలికేకలు .....

♦

# లక్ష్యం

- గొర్రెపాటి శ్రీను
9652832290



ఆశయాల శిఖరాలను చేరుకోవాలంటే....
ఆటంకాల అడ్డంకులని దాటుకుని
అవరోధాల మెట్లను అధిరోహిస్తూ
సాగిపోవలసిందే...
నువ్వు నిర్దేశించుకున్న లక్ష్యం ఎంతటి
క్లిష్టమయినదయినా సరే...

మొక్కవోని ఆత్మవిశ్వాసాన్ని వెంటబెట్టుకుని....
పట్టుదలగా ప్రయత్నిస్తుంటే...
సుదూరమైన లక్ష్యం సైతం దగ్గరవుతుంది !
గెలుపు బావుటా చేతికి అందిస్తూ....
విజయం నీదేనంటూ ఎదురేగి చెబుతుంది !

♦

సాక్షివ్యాసాలను అనుసరించి ఆదోనిలోని కొందరు యువకులు 'ఆదోని పురాణసంఘం'గా ఏర్పడి 1928 ఫిబ్రవరి 2 నుండి రాసిన మూడు వ్యాసాలను 'సాధన' పత్రికలో ప్రచురించి ప్రోత్సహించారు. ఈ వ్యాసాలు ఆనాటి స్త్రీల పరిస్థితులు, స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, విధ్వంసమ వుతున్న విలువల గురించి తెలియజేస్తాయి. ఈ వ్యాసాలను కూడా ఈ పుస్తకంలోని అనుబంధంలో ఇవ్వడం జరిగింది. పప్పూరు రామాచార్యులు జాతీయోద్యమంలో పాలుపంచుకున్నారు. తన రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి రాయలసీమ బాగోగుల కోసం వందల వ్యాసాలను సాధన పత్రికలో రాసాడు. రాసినవాళ్లవి ప్రచురించారు. ఈ ప్రాంత ప్రజలలో చైతన్యాన్ని తీసుకురావడానికి పాటుపడ్డారు. ఈ విధంగా 'వదరుబోతు' జననంలోనూ, 'వదరుబోతు' కరపత్రాలను రాయడంలోను, ప్రచురణలలోను, వదరుబోతును పుస్తకంగా ప్రచురించడంలోనూ, వదరుబోతు స్ఫూర్తిని పినాకిని, సాధన పత్రికలలో కొనసాగించడంలోనూ పప్పూరు రామాచార్యులకు విడదీయరాని బంధం ఉంది. పప్పూరు రామాచార్యుల కుమారుడు పప్పూరు శేషాచార్యులు 1986 సంవత్సరంలో 'వదరుఁబోతు'ను ప్రచురించారు.


ఈ సంవత్సరానికి 'వదరుఁబోతు' వందేళ్లు నిండిన సందర్భంగా నేటికీ ఆ వ్యాసాల ఆవశ్యకత ఉందని భావిస్తూ, నేటి విద్యార్థులకు, యువతకు మహత్తర బాధ్యతను గుర్తుచేస్తూ 1932, 1935ల నాటి 'వదరుఁబోతు' పుస్తక ప్రతుల ఆధారంగా ఈ పుస్తకాన్ని పునర్ముద్రిస్తున్నాను. ఈ పుస్తక అనుబంధంగా పప్పూరు రామాచార్యులు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వదరుఁబోతు తొలి ముద్రణల ముఖచిత్రాలు, కరపత్రాలప్రతులు, ఆదోని పురాణసంఘం వ్యాసాలు, పానుగంటి లక్ష్మీనరసింహారావు సాక్షివ్యాసాలలోని 'కర్నూలులోని కాటకం' వ్యాసాన్ని, రిచర్డ్‌స్టీల్–టాట్లర్, జోసఫ్ అడిసన్–స్పెక్టేటర్ ప్రతులను చేర్చడమైనది.

**('వదరుబోతు' వ్యాస సంపుటి ముందుమాట నుండి సంక్షిప్తంగా)**

♦

# 'పద్మావతి' పై పగబట్టిన పరివారం

- తెలకపల్లి రవి




*చరిత్ర నేపథ్యంలో కల్పన మేళవించిన ప్రసిద్ధ గాథ 'పద్మావతి'. రాజస్థాన్‌లోని చితోడ్‌గఢ్ లేదా చిత్తూరు రాజ్యానికి చెందిన రాణి పద్మిని పేరు భారతీయులకు సుపరిచితం. పాఠాలలో చాలా కాలం వుండేది. 13వ శతాబ్దంలో ఆ రాజ్యాన్ని పాలించిన రతన్ సింగ్, పద్మావతిల గురించి 1540లో సూఫీ కవి మాలిక్ మహ్మద్ జైసి రాసిన ప్రేమ కథగా ఇది ప్రాచుర్యం పొందింది.*

అభివృద్ధి నిరోధక అప్రజాస్వామిక అరాచక శక్తులు అందలమెక్కితే అన్ని రంగాల్లోనూ అల్లకల్లోలమేనని అనుదినం రుజువు చేస్తున్న సంఘ పరివార్ ఇప్పుడు హిందీచిత్రం పద్మావతిపై కత్తి కట్టింది. చివరకు ఆ చిత్రం విడుదలనే వాయిదా వేయించింది.. చెదురు మదురు సంస్థలు గాక బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలే ఆ చిత్రం రాకుండా చేయాలని రాజకీయ వాజ్యాలు బెదిరింపులకు పాల్పడుతున్నాయి. కేంద్ర మంత్రులైన నితిన్ గడ్కరీ వంటి వారు ఈ విధ్వంసకారులకే వంత పాడుతున్నారు. గతంలో ఆరక్షణ్(2011) విశ్వరూపం(2013) జోదా అక్బర్(2008) వంటి చిత్రాలపై సాగిన దాడిని మించి రెచ్చిపోతున్నారు. జాతీయ పురస్కారాలు పొందిన ప్రతిభాశాలి దీపికా పడుకునే ముక్కు చెవులు కోస్తామని అనాగరికంగా భయపెడుతున్నారు.

డిసెంబర్ 1న విడుదల కావలసిన పద్మావతి చిత్రాన్ని ప్రసిద్ధ దర్శకుడు సంజరు లీలా భన్సాలీ 180 కోట్లతో నిర్మించారు. బన్సాలీ గతంలో 1942 ఎ లవ్ స్టోరీ, దేవదాసు, బ్లాక్, ఫరిందా, కామోష్ తదితర భారీ చిత్రాలతో ఘన విజయాలు సాధించిన వ్యక్తి. చరిత్ర నేపథ్యంలో కల్పన మేళవించిన ప్రసిద్ధ గాథ పద్మావతి. జస్థాన్‌లోని చితోర్‌ఘర్ లేదా చిత్తూరు రాజ్యానికి చెందిన రాణి పద్మిని పేరు భారతీయులకు సుపరిచితం. పాఠాలలో చాలా కాలం వుండేది. 13వ శతాబ్దంలో ఆ రాజ్యాన్ని పాలించిన రతన్‌సింగ్, పద్మావతిల గురించి 1540లో సూఫీ కవి మాలిక్ మహ్మద్ జేనీ రాసిన ప్రేమ కథగా ఇది ప్రాచుర్యం పొందింది. నాగమతి అతని మొదటి భార్య. ఆ కథ ప్రకారం రతన్ అపురూప సౌందర్యరాశి. సింహళ యువరాణి పద్మిని (లేదా పద్మావతిని) గురించి విని రతన్ సేన్ అక్కడకు వెళ్లి ప్రయత్నించి పెళ్లి చేసుకుంటాడు. తన కొలువులో ముఖ్యుడైన రాఘవ చేతన్ క్షుద్ర విద్యలకు పాల్పడుతున్నట్టు తెలుసుకున్న రాజు అతన్ని వెళ్లగొడతాడు. అప్పుడు ఢిల్లీని అల్లావుద్దీన్ ఖిల్జీ పాలిస్తున్నాడు. రాఘవ చేతన్ ఎలాగో ఖిల్జీ దృష్టిలో పడి పద్మావతి సౌందర్యం గురించి చెప్పి ప్రలోభపెడతాడు. ఖిల్జీ ఒక పథకం ప్రకారం రతన్ సింగ్‌తో స్నేహం కలిపి పద్మావతిని ఒక సోదరిగా చూడాలనుకుంటున్నానని కబురు చేస్తాడు. భర్త చెప్పినా ఒప్పుకోని పద్మావతి అద్దాలలో ప్రతిబింబం ద్వారా మాత్రమే ఖిల్జీ తనను చూడటానికి అనుమతిస్తుంది. అలా వెళ్లిన సమయంలోనే కోట రహస్యాలు తెలుసుకున్న ఖిల్జీతర్వాత(1303లో) దాడి చేస్తాడు. రతన్ సింగ్ బందీ అవుతాడు. అయితే ఖిల్జీ కోటలోకి వెళ్లే సరికి పద్మావతి అంత:పుర పరివారంతో సహా ప్రాయోపవేశం చేసి ప్రాణాలు విడుస్తుంది. దీన్నే జౌహార్ లేదా జోహార్ అంటారు. అప్పటి నుంచి రాజస్థాన్‌లో ఆమెకు ఆలయాలు కట్టించి దేవతగా పూజిస్తున్నారన్నది కథ. నిజానికి ఈ కథలో తేదీలే గాక పద్మావతితో సహా పాత్రలు కూడా భిన్న తరహాలలో ప్రచారంలో వున్నాయి.. అవన్నీ అప్రస్తుతమే.


ఈ చిత్రం షూటింగు ప్రారంభదశలోనే శ్రీరాజపుత్రకర్ణిసేన దాడి ప్రారంభించింది.[౯] ఈ సేన ప్రతిసందర్భలో ఏదో వివాదం రగిలించి డబ్బులు దండుకుంటుందని ఆరోపణలు ఆధారాలతో సహా వున్నాయి. ఈ సేన దుండగులే రాజస్థాన్ కోటలో చిత్రం సెట్టింగులను

ధ్వంసం చేశారు. సేన స్థాపకుడైన లోకేంద్ర సింగ్ కర్వాన్ దర్శకుడైన బన్సాలీని కొట్టిన వారికి పదివేలు ఇస్తానని ఆఫర్ చేశాడు. నిజంగానే ఆయనను కొట్టారు కూడా. ఈ దాడులను సినీ ప్రముఖులతో పాటు అందరూ ఖండించారు. ఎన్ని బెదిరింపులు వస్తున్నా భయపడకుండా బన్సాలీ బృందం నిర్మాణం పూర్తి చేసింది. అయితే సెన్సార్‌కు కూడా పంపించే లోగానే చిత్రంలో ఒక కల పాట వుందని , అందులో ఖిల్జీ పద్మావతి కనిపిస్తారని వదంతి పుట్టింది.. ఇది రాజపుత్ర వనితలకు అవమానమంటూ దుమారం తీసుకొచ్చారు. అలాటిదేమీ లేదని బన్సాలీ స్పష్టమైన వివరణ ఇచ్చినా సరే ఈ ప్రచారం ఆపలేదు. అఖిలేశ్ ఖండేల్వాల్, రాజ్ కె. పురోహిత్ వంటి బిజెపి నేతలు చిత్రాన్ని నిషేధించాలని గగ్గోలు మొదలు పెట్టారు. ఆఖరుకు సెన్సార్ బోర్డు సభ్యుడైన అర్జున్ గుప్తా ఇది దేశద్రోహమేనని ప్రకటించారు. హర్యానా మంత్రి విపుల్ గోయల్, రాజస్థాన్ మంత్రి కిరణ్ మహేశ్వర్ వంటివారు కూడా బహిరంగంగా విమర్శలు గుప్పించారు. ఇక యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అయితే ఈ చిత్రంపై వివాదం శాంతి భద్రతలకు భంగకరమంటూ స్థానిక ఎన్నికల దృష్ట్యా సెన్సారింగు, విడుదల వాయిదా వేయాలని అధికారికంగానే కోరారు. గతంలోనూ జోదాఅక్బర్ చిత్రంపై ఇలాగే దాడి చేయడంతో రాజస్థాన్‌లో విడుదల చేయనేలేదు. బాజీరావు మస్తానీ పైన వివాదాలు లేవనెత్తినా జనాదరణ పొందింది. ఇప్పుడు పద్మావతిని విడుదల కాకుండా ఆపాలని అడ్డుకోవాలని బరితెగించారు. ఇందుకు చెబుతున్న కారణాలు హాస్యాస్పదమైనవే గాక హానికరమైనవి కూడా. ఒక ముస్లిం పాలకుడు రాజపుత్ర స్త్రీ గురించి ఆలోచించినట్టు చూపడమే తప్పంటున్నారు. తాము చెప్పే లవ్‌జిహాద్‌కు ఈ చిత్రం నిదర్శనమని మరో విషప్రచారం ఎత్తుకున్నారు. త్వరలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికలు వస్తాయి గనక రాజపుత్రులను ఆకట్టుకోవడానికి ఇదో ఆయుధమని బిజెపి నేతల వ్యూహంగా వుంది.

సింహళ రాజకుమార్తె పద్మావతికోసం రతన్ సింగ్ మారువేషంలో వెళ్లడం వంటివి చాలా కథల్లోచూస్తాం. అల్లా వుద్దీన్ ఖిల్జీ గురించికూడా చరిత్ర చెప్పేదానికి ఈ కథలో చూపిన దానికి చాలా తేడా వుంటుంది. చరిత్రకు సంబంధించిన పేర్లను తీసుకుని ప్రణయగాథలు అల్లడం ప్రతిచోటా వున్నదే. . నిన్న మొన్నటి అల్లూరి సీతారామరాజులో ప్రేయసి సీత నిజం కాదని నిర్మాతలే చెప్పారు. ఆ మాటకొస్తే చారిత్రిక వ్యక్తి అన్నమయ్య చిత్రంలో వెంకటేశ్వరుడు కనిపించడం ఆ నాడు ఎవరైనా చూశారా? స్క్రీన్‌ప్లే రాశారా? కృష్ణదేవరాయలు తిమ్మరుసు కథల వంటివాటిలో నిజమెంత కల్పన ఎంత? అలాటిది ఏడెనిమిది వందల ఏళ్లనాటి కథలు తీసేప్పుడు సృజననూ వూహాశక్తిని ఉపయోగించి ఖాళీలను పూరించడం జరుగుతుంది. ఆ మాటకొస్తే శివాజీ గురించి, రాణా ప్రతాప్ గురించి సంఘ పరివార్ చెప్పే చాలా విషయాలు కల్పనలే. గతంలోనూ ముంబాయి చిత్రాన్ని బాల్‌థాకరేకు చూపి అనుమతి పొందారు. మణిరత్నం వారణాసి గంగా తీరంలో దీపా మెహతా వాటర్ చిత్రం షూటింగుపైనా దాడి చేశారు. అయితే ఇప్పుడు కేంద్రంలో మోడీ ప్రభుత్వం 16 రాష్ట్రాలలో బిజెపి పాలన వున్నందువల్ల కర్ణిసేన వంటివి మరీ చెలరేగిపోతున్నాయి.

ఈ వివాదం జరుగుతుండగానే సుప్రీం కోర్టు సృజన స్వేచ్ఛపై ఒక కీలకమైన తీర్పు నిచ్చింది. సామాన్యుడుగా వుండి ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠమెక్కిన అరవింద్ కేజ్రీవాల్‌పై తీసిన చిత్రాన్నిముందే ఆపాలంటూ ఆయనపై ఒకప్పుడు ఇంకు చల్లిన నాచికేత వాఘ్లేకర్ వేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. " ఒక చిత్రం, నాటకం, నవల ఏదైనా సరే సృజనాత్మక ప్రక్రియ. కళాత్మక అభివ్యక్తి. చట్టం నిషేదించని పరిధిలో తన భావాలు ప్రకటించడానికి కళాకారుడికి రచయితకూ స్వేచ్ఛవుండాల్సిందే' అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రచయితలు కళాకారులు నవలాకారులు చిత్రకారుల వంటి వారు రాసింది తీసింది తమకు నచ్చలేదంటూ రెచ్చగొట్టే శక్తులకు లోబడిపోకూడదని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. పద్మావతి చిత్రంపైనా నిషేధానికి ఇంతకు ముందే నిరాకరించింది. సినిమా రంగంలోనూ మీడియాలోనూ కూడా కర్ణిసేన దాడులపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. గతంలోనూ పెరుమాళ్ మురుగన్ వంటి వారిపట్ల దౌర్జన్యం, కల్బుర్గి తదితరుల హత్యలు పద్మావతి ఉదంతం మరోసారి గుర్తుచేస్తుంది. ఆవుల నుంచి అమ్మాయిల వరకూ , చదువుల నుంచి చిత్రాల వరకూ ప్రతిదీ తమ ఇష్టానుసారం జరగాలనే ఈ ధోరణిని తీవ్రంగా ప్రతిఘటించాలి. బాధితులకు సంఘీభావంగా నిలవాలి. ఆలస్యంగానైనా పద్మావతి సజావుగా విడుదలవుతుందని భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుతుందని ఆశించాలి. ఏమైనా అఘాయిత్యాలు జరిగితే మాత్రం అందుకు బిజెపి సంఘ పరివార్‌లే బాధ్యత వహించాల్సి వుంటుంది. మూల్యం చెల్లించవలసీ వస్తుంది.

**ఆవుల నుంచి అమ్మాయిల వరకూ, చదువుల నుంచి చిత్రాల వరకూ ప్రతిదీ తమ ఇష్టానుసారం జరగాలనే ఈ ధోరణిని తీవ్రంగా ప్రతిఘటించాలి. బాధితులకు సంఘీభావంగా నిలవాలి.**




# మైనారిటీల సాంఘిక జీవిత ప్రతిబింబం - 'అలావా'

- డా. జి. శైలమ్మ
9618361905

'అలావా' షాజహాన్, స్కైబాబ సంపాదకత్వంలో 2006న వెలువడింది. ముస్లింల పట్ల దేశం వ్యవహరిస్తున్న తీరు, ముస్లింల మధ్య తమలో తాము గొప్ప అన్న భావనతో వచ్చే మనస్పర్ధలు, ముస్లిం స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు, మూఢనమ్మకాలు మొదలైనవన్నీ పూసగుచ్చినట్లు కూర్చారు.

యం.డి. యాకూబ్, పాష రాసిన "అన్నారం యాకన్న దర్గా' అన్న కవితలో ముస్లింలు, హిందువులు ఎలా కలిసిపోయి ఉన్నారో- ***"తెల్లారిగట్ల-/ అన్నారం చెరువు మాకు తానం పోసింది/తామర కాడలు చేతుల బెట్టింది!/ సలసల్లగా మెచ్చుట్లు చెప్పింది/ గవ్వలు కొన్ని ఏరిచ్చింది/ దూరంగా అల్లాహో/ అని వినిపిస్తున్నది.../ చెరువు అలలన్నీ అల్లాహో.....అన్నాయి"***

అందరం భారతీయులం అని సమైక్యభావుటా ఎత్తిన స్వరం మహమ్మద్ నిసార్ 'ఆల్వ' కవితలో కనిపిస్తుంది –

***"అబ్బ! తెలంగాన ఒడిలో తప్ప/ దునియల ఎక్కడా కానరాని సంబురమిది/ లంబాడేషం గౌండ్లేషం పక్కీ రేషం/ గుడ్డెలు గేషం సాదువేషం గొల్లేషం ఆడేషం/
ఏషమేదైనా పాట ఏదైనా/ ఏసే అడుగు మాత్రం ఒక్కటే/ ఆడించే దరువు ఒక్కటే/ అందరి వేదిక ఒక్కటే"***

ముస్లింలు హిందువులు అన్న భేదభావన లేకుండా అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉన్నారని చెప్పడానికి ఈ కవితలు ఉదాహరణలు.

ముస్లింలు సంఘంలో జీవించే క్రమంలో తనకంటూ కొన్ని ఆచారాలు సంస్కృతులు ఏర్పరచుకున్నారు. అవి పొద్దున లేచింది మొదలు నిద్రపోయే వరకు చేసే పనులు. వారిని గుర్తించే విధానం కవితల్లో వ్యక్తం అవుతుంది-

"ఖాదర్ షరీఫ్ – 'మేరీ దునియాం " అన్న కవితలో

**"శుక్రవారం తురకోళ్ల ఈదిగుండా నడస్తా ఉంటే/ ఉదయం నుంచీ మొదలైన మసాలా వాసనలు/ జొహర్ కీ అజాతో బంద్పైతయ్/ అత్తరు గుబాళింపు పై జమా లాల్చీలు"**

వారి తిండి, వారి అలంకరణ విషయాలు అన్నీ గుర్తించదగినవే నంటాడు. వాటికి చరిత్ర ఉంది. వారికి సమాజంలో సానుకూలత లభించడం లేదంటాడు.

**"ఘూంగట్ కప్పుకుని అత్తగారింటికి వెళ్లిపోతున్న/ ఆరస్కని చూస్తుంటే/ తురక బూబమ్మతోపాటు.../ అలివేలు మంగమ్మ కూడా ఏడ్చేది..../అవును...... ఇప్పుడు శు క్రవారం/తురకోళ్లు ఈదుల గుండా నడస్తా ఉంటే/మనసుల్ని చీల్చే త్రిశూలాలు గుచ్చుకుంటున్నాయి"**

కలిసి మెలసి అన్నదమ్ముల్లా ఉండే వారని వారి మధ్య ఏదో తెలియని శక్తి వారిని విడదీస్తుందని ఆవేదన చెందుతున్న విషయాన్ని చక్కగా వివరించారు.

మై బోరేవాలా! – షేక్ పీరా బోరేవాలా అన్న కవితలో ముస్లింల జీవన విధానం వివరించారు. సమాజంలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవించే వీరి పట్ల వివక్ష చొరబడింది. వివక్ష కారణంగా సామాజికంగా వెనకబడిపోయినట్లు తెలుస్తుంది.

**"నా వృత్తిపై చిన్నచూపు/ నాభాషపై చిన్నచూపు/ వెరసి నేనంటేనే చిన్న చూపు/ఏది *మానవీయం? ఏది***

*అమానవీయం?"*

ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి జీవిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేస్తారు.

సైబాబ– 'సూఫీదేవుడు' –

***"మనకు చేలెందుకు లెవ్వో – చెల్కలెందుకు లెవ్వో/ పొలమెందుకు లేదో – తలమెందుకు లేదో/ చేతిలో ఆరె ఎందుకు లేదో/ ఇంటిముందు సారె ఎందుకు లేదో/ ఇంట్లో మగ్గం ఎందుకు లేదో/ ఏనాడూ చింత చెయ్యవైతివి అబ్బా/ రిజర్వేషన్ మాటెత్తితే/ సర్కారు బిచ్చం మనకెందుకురా అంటివి"***

కులప్రస్తావన చేయడం కూడా వారు చేసే పనిని బట్టి, వారికి తెలియకుండా ఏర్పడిందనేది తెలుస్తుంది. మనువు చెప్పిన చాతుర్వర్ణ వ్యవస్థా సిద్ధాంతాన్ని వివరించారు.

***"మసీదుని నాలుగు గుమ్మటాలతో భాగించినట్టు/ అందర్నీ పోగులుగా కలిపి నేసిన మతం తానుని/ఎక్కువ తక్కువ ముక్కలుగా చింపిన/ మనుముల్లాల సంగతి యిది"***

కులాలు ఇలా పుట్టాయని తెలియజేసే గ్రంథాలు తమకు లేవని మహ్మమద్ ప్రవక్తలు కూడా చెప్పలేదని అయినా కుల విభజన చాపకింద నీరులా విస్తరించిన తీరుని వివరిస్తారు.

***"ప్రవక్తలు ఎక్కడా చెప్పిన గుర్తులేదు/ కుట్ర ఎలా జరిగిందో కూడా తెలియదు/ నా చాప కింద నేల మాత్రం నదికోతకు గురైంది"***

తినడానికి తిండి కడుపు నిండా నింపుకోడానికి ఎన్నో రకాల పనులు చేసుకుంటూ జీవించే వారిని ఓసిగా కేటాయించడం వారిని మరింత అభివృద్ధికి దూరం చేసిన వైనం ఈ కవితలో కనిపిస్తుంది. టిఎండి రఫి "నేను ఓసీ నెట్టైతినో"

**"కాసులు పండే భూముల్లేవు/దాలర్లిచ్చే చదువులు లేవు/ కడుపు నింపే కులవృత్తుల్లేవు/ఏమీ లేకున్నా మరి ఓ.సీ. నెట్లయితినే/ మనసు నిండా మైనారిటీ భయం"**

దూదిని సాపు చేసి పరుపులు కుట్టి దూదేకుల వారు జీవనం సాగిస్తుంటారు. వీరు సమాజంలో ఎదుర్కొనే అవమానాలను –

**''అందరూ నన్ను మనిషిలా కాక/ ఏకిపెట్టిన దూదికుప్పలా చూస్తూ/ మాటల్లోనే ఊదిపారేయాలని ఉబలాటపడతారు/ మా పుట్టింటోళ్లు మాత్రం అచ్చం తురకదాన్నయిపోయానని/ ఖరారు చేసుకున్నారు''** కవిత్వీకరిస్తారు.

**''కూటికి పేదయినా కులానికి నవాబునేనని/ మధ్యయుగాల అనాగరిక ఫ్యూడల్ భావాలకు ప్రాణం పోస్తాడు ఒకడు/......./ఏ సాయిబు లేని చోట దూదేకులోడే పీరు సాయిబని/ నన్నొక సామెతను చేసి/ అపహాస్యంలోకి గిరాటు వేస్తాడు ఇంకొకడు"**

దూదేకుల వారిని తక్కువ చేసి చూడటం అన్ని కులాల్లో ఉన్నట్టే ఇక్కడ కనిపిస్తుంది. మహ్మద్ అక్బర్ "గవాహ్" కవితలో

**"చిన్నతనంలో సలామాలేకుం 'మామూ'/ అని ఆదాబ్ చేసినపుడు/నీ నోటి మాట నిజం కావాలంటూ దీవించాడు/ఇప్పుడు హసీనాను పెళ్లి చేసుకుంటానన్నప్పుడు/ దూదేకే కులం వాడినని/ దూది పింజలా/ నా మనసును తీసిపారేసిన/ ఈ ముస్లిం సమాజం"**

ముస్లింలు తమలో తాము హెచ్చుతగ్గులు చేసుకొంటూ విభజించుకున్న తీరుని తెలియజేశారు.

జీవన విధానం దుర్భరంగా సాగుతున్నట్లు ఖాజా "ఎంగిలిపీక" అన్న కవితలో కనిపిస్తుంది.

**"సంగీతమే లేని బతుకులోంచి/ సరిగమల నెత్తుటి జలపాతాన్నై/ సన్నాయి కర్రలోంచి నిత్యం చొంగ కారుతుంటాను/ ఒక అనుమానిత అవమానిత గొద్దునై/ మెడలో గుదిగొయ్య వేలాడేసుకుని/ అగ్రహారాల మెట్ల దగ్గర బిక్కుబిక్కున తచ్చాడుతుంటాను"**

ముస్లింలు ఈ దేశంలోనే పుట్టినప్పటికి భాష వేరని, సంప్రదాయాలు భిన్నమని అడుగడుగున హింసిస్తూ హక్కులు లేకుండా బానిన సంకెళ్లు చుట్టుకొంటున్న తీరుని ఎస్. షమీఉల్లా 'విశ్వాస ప్రశ్న' ద్వారా ప్రశిస్తున్నాడు–

***"నీవు, నేనూ ఈ భూమ్మీదే గదా పుట్టాం/ నా తాత ముత్తాతలు/ ఈ దేశం కోసమే గదా ప్రాణాలర్పించారు/ మరి, నీకున్న హక్కులు/ నాకెందుకు లేకుండా పోయాయి"***

ఉపాధి అనేది అందరికి ప్రధానం కోటి విద్యలు కూటి కొరకు అని అందరికి తెలుసు. పెద్ద చదువులు వారికి ఆకాశ కుసుమమే. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. బాల కార్మిక వ్యవస్థ ఇంకా ఇప్పటికీ కొనసాగుతుంది.

**''బస్టాండులో పల్లీలమ్ముతూ/ రోడ్ల వెంట టీ, కాఫీలమ్ముతూ/ అంధకారంలో అయోమయంలో/ రోడ్డుమీదే వాడి బాల్యం గడిచిపోతుంది/ బాల్యం మల్లెపువ్వులా వాడిపోతుంది"** ని అన్వర్ "మల్లెపూల అక్బర్" కవిత్వీకరిస్తారు.

***"ముస్లింల షీర్‌ఖుర్మాలాగా మల్లెపూలు/ మల్లెపూలు పిల్లగాని శరీరం ఒక్కతీరు/ మల్లెపూవు పూటకే వాడిపోతుంది/ చౌరస్తాలో పూటపూటకు వాడిపోతూ పసితనం"***

చిన్న చిన్న పనులు చేసుకొంటున్న ముస్లింలు, ప్రభుత్వం వారిపట్ల సవతి తల్లి ప్రేమను చూపడంలో ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం. ఎం.యూసుఫ్ అలీ "జనాజా"లో

***"గింజ గింజకు నడుమ బతుకు గిర్నీల నలిగి/ బట్టల బండి లాగుకుంటూ/ రోజూవారీ చచ్చుకుంటూ/ రోడ్డుపక్క గతుకుతున్న"*** ముస్లిం బతుకు చిత్రం దర్శనమిస్తుంది.

బీబీ 1874లో బ్రిటీష్ సైనిక బలగాలను ఎదుర్కొని మాతృభూమి కోసం ప్రాణాలు పెట్టింది. ఆమె ధైర్యసాహసాలను బ్రిటీష్ అధికారి హెన్రీ లారెన్స్ "ఎక్కడా కూడా ఇంతకు మించిన శౌర్య ప్రతాపాలు మేము చూడలేదు" అని పేర్కొన్నారు. (భారతస్వాతంత్రోద్యమం: ముస్లిం మహిళలు – సయ్యద్ నశీర్ అహమ్మద్) బేగం అజీజున్ బ్రిటీష్ సైన్యాలతో ధైర్యంగా పోరాడింది. ముస్లిం స్త్రీలు దేశం కోసం తమ ప్రజల రక్షణ కోసం రక్తాన్ని చిందించగల వరిపాలనా సమర్థులున్నారన్నది నిజం. ఇది చరిత్ర. దేశాన్ని పాలించగల చేవ గల స్త్రీలు విలువలేకుండా మనిషిలా కాకుండా యంత్రంలా చూడబడుతున్న తీరుని కవిత్వీకరించారు–

మున్వరున్నిసా "గుడియా" –

***"నేనొక గుజరాతీ బొమ్మను/ మారణ 'హెూమాగ్ని'లో మాడిన అబలను/ నిన్ననేడురేపు లేనిదాన్ని/ ఒక్కరాత్రి తప్ప"***

స్త్రీ అంటే ఇంతేనా ఆమె పరిధి తగ్గించబడింది. ఎందుకు ఈ స్థితిలో కనిపించాల్సి వచ్చిందో రచయితే ముగింపులో వివరించారు.

***"మేము ముద్దొచ్చే ముద్దు బొమ్మలమే/ అయినా మాకు ముద్దు మురిపాలు లేవు/ కన్నవాళ్ల అసహాయతకు/ కటిక పేదరికానికి/ బలిపీఠం ఎక్కుతున్న వాళ్లం/ మేము కేవలం బొమ్మలం!"***

షంషాద్ బేగం "ప్రాణమున్న లాన్" రాసిన కవితలో

***"ఏడాదికొక కొత్త జన్మనెత్తుకునే యంత్రాన్నై...../ ఇదే నా తన్‌ఖా లేని నౌకరీ ఐనప్పుడు/ నిజంగా నేను రివాజుల పింజ్రాలో/ నిస్సహాయపు దీవానీని/ ఖిల్వత్ నుండి బయటకు రాలేని/ అసహాయపు దిల్‌వాలీని***

మహెజబీన్ "ఖిల్వత్"

**''మాడిమసైపోయే కలల కారాగారం నుండి/ తప్పించుకున్న వాస్తవ స్వప్నాన్ని నేను"/..../నా పాట మీద, మాట మీద పర్దా అడ్డు పడేది/ రసోయిఘర్, ఖిల్వత్ యీ రెండింటి మధ్య/ నాకు జీవితం కావాలి/ చార్ దివారీ లేని ఇల్లు కావాలి"**

ఈ సమాజంలో స్వేచ్ఛ కావాలని నాలుగు గోడల మధ్య బంధించవద్దని కోరుకొంటుంది.

"వాజిదా ఖాతూన్ 'పర్దా' కవిత్వంలో

***"ఆచార బంధనాలతో చేశారు నిన్ను బానిసను/ తెచ్చి పెట్టుకున్న కృత్రిమ అందాలతో/ మహిళలు అవుతున్నారు ప్రపంచ సుందరులు/ సహజమైన నీ అందాలను బుర్ఖా మాటున దాచి/ నిన్ను సమాధి చేస్తున్నారు/ బహెనా! కాస్త ఆలోచించు!"***

షహ్‌నాజ్ ఫాతిమా "ఔరత్" కవితలో

***"చూపుల్లోనైనా భావానుభూతులను/ వ్యక్తం చేసే హక్కులేని కళ్లున్న కబోధి/....../ హక్కులన్నీ ఉన్నట్లు భ్రమింపచేస్తున్న/ ఆత్మద్రోహులకు ఊడిగం చేస్తున్న శ్రమజీవి"***

ముస్లిం స్త్రీలు వివక్షకు గురవుతున్న తీరు ఈ రచయిత్రి తెలియజేసింది. ఎన్నెస్. ఖలందర్ "చార్ దిన్ కీ దుల్హన్" రాసిన కవితలో

***"చార్ దీనార్‌లు జిందగీల్ని శాసిస్తుంటే/ స్వేచ్ఛని శ్వాసించే జిందగీలు ఉప్పు సముద్రాలే!/.../మరిది ఎంగిలి చూపులు/ ఆడపడుచు స్వైరవిహారం/ అత్తామామల అలుపెరగని పెత్తనం../ నిత్యం ఆమెకు పోఖ్రాన్ పరీక్షలే!"***

స్త్రీలు ఇలా వివాహమై విధివశాత్తు భర్తకు దూరంగా అత్తగారింట్లో ఉన్నప్పుడు ఎదురవుతున్న సమస్యలను వివరించారు. స్త్రీ మనస్సున్న మనిషిగా కాక, మగవారికి ఆనందం కలిగించే ఒక బొమ్మ, బానిసలా చూడబడుతున్నట్లు "హనీ ఫ్ "మెహర్" కవిత ద్వారా తెలుస్తుంది.

***"బిస్మిల్లా ఇర్రహిమాన్ నిర్రహీమ్/నేనొక బానిసను కొని తెచ్చుకుంటాను/ నువ్వెన్ని సార్లు మానవ జన్మనెత్తి/ మాకు వూడిగం చేసిపెట్టినా రుణ విముక్తురాలివి కాలేవు/ మా కోసం ఇంట్లో అమర్చుకున్న పనిముట్లలో భాగానివి"***

ఎవరికిష్టమెుచ్చినట్టు వాళ్లు రివాజులు జరిపించుకుపోతున్న తరుణంలో తను నూరేళ్లు జీవించాల్సిన అవసరం లేదంటున్నారని ముస్లింస్త్రీ స్వరాన్ని ఎస్. అహ్మద్ ఖులా వినిపిస్తుంది.

***"ముడి పడీపడగానే/ గొంతు బిగుసుకుంటున్న/ నిఖా వురితాళ్లు/ ప్రేమలేక/ వూపిరాడక/ గిలగిలలాడి చస్తున్న/ షాదీ బంధాలు ఇంకా వందేళ్లెందుకు?"*** ఖులా, తలాఖ్‌లు కొన్ని సార్లు పని చేయకుండా ఆనవాయితీలే ఒక్కోసారి జరిగిపోతుంటాయి.

కట్నం దురాచారానికి ముస్లిం స్త్రీలు దూరమేమికాదు కట్నం ఇచ్చి దేహాలనిచ్చి మోసపోతున్నంత కాలం. ఆచారం పేరుతో వివాహాలు వ్యాపారంగా పరిణమించాయని సయ్యద్

ఖుర్షీద్ 'సవాల్' అన్న కవితలో వివరించారు.

***"ముక్కు పచ్చలారని పసిబిడ్డలకు/ ఆరుపదుల అరబ్ షేఖ్‌తో నిఖా...."***

బాల్యవివాహం దురాచారం కొనసాగుతుంది. చివరికి నష్టపోతుంది ముస్లిం స్త్రీలే. ***".......ప్రమేయం లేకుండా/పసిదేహోల్ని చిన్నా భిన్నం చేసి/ తలాఖ్ చెప్పి వాళ్లు చల్లగా జారుకుంటే/ ఈ తలాఖ్ నామాలకు అర్థమేంటి?"*** ఇలా ప్రశ్నలతో జరగుతున్న అన్యాయాలను వెలిబుచ్చుతారు.

అధిక సంతానం అనర్థాలకు ముస్లిం స్త్రీలు సమిధలవుతున్నారని తెలుపుతూ ఎస్. షంషీర్ అహ్మద్ 'సమిధలు' కవితలో చెప్తారు...

***"ఆలనా పాలనా లేక/ లేమికి లేకితనం తోడై/ నీ 'మాసూం' పిల్లలు/ బాల నేరస్థులవుతారు/ అర్థం వికటించిన/ 'జీహద్' యజ్ఞంలో/ బలవంతపు సమిధలవుతారు"***

ముస్లిం సమాజంలో తల్లాఖ్ ఉండటంవల్ల పెళ్లైన మూడునెలల్లో గర్భవతి కాకముందు మూడు సార్లు చెప్పే సంప్రదాయం వల్ల స్త్రీ జీవితంలో ఎన్ని నమాజులు చేసినా ప్రయోజనం లేదంటున్న షంషాద్ బేగం "పర్సనల్‌లా" కవితలో

***"పొట్టమీది పెద్దాపరేషన్ కత్తిగాట్లతో/ వదలిపోయిన సెహరా జ్ఞాపకంగా నన్ను మిగిల్చి/ వాడు నలుగుర్నైనా నిఖా కట్టుకోవచ్చని చెప్తున్న/ నా షరియత్‌ని నిలదియ్యకుండా ఎలా ఉండను?"*** అంటుంది. వివాహాల పేరుతో స్త్రీకి జరుగుతున్న అన్యాయం ఈ కవితలో చిత్రించారు.

ముస్లింల పండుగలు జాతరులు చేసుకొనేటప్పుడు కుల మత భేదాలకు అతీతంగా పాల్గొంటారు అందరు కలసి తింటారు. తాగుతారు. చిందులేసుకుంటారు.

రహమతుల్లా "బీకా అలం" కవితలో మొహరం పండుగ రోజున ఏం చేస్తారో వివరించారు. ఇది వారికి దుఃఖ దినంగా గడుస్తుంది. ఆ రోజు పాటలు పాడుకుంటారు.

***"నిండు బురఖాల గుండెల్లోపట దుఃఖాలాపన/ ......చెప్పులు షోకులూ ఏ ఖుషీలు లేని/ నల్లని బట్టలు నల్లని జండాలు విషాద వదనాలు"***

కులమతాలకతీతంగా ఈ జాతరలో పాల్గొంటారు.

***"బీబమ్మ ఊర్లోకు వచ్చే దస్మీనాట/ జనం జనం మస్తు జనం/ తిల్ ఫేకే తొ నీచే నైగిరతా – ఉసుకేస్తే ఉసుక రాలదు/ గుట్ట కిందంగా నడిమిట పైనంగ కందూర్లే/ చెట్లకు తలకాయ కిందంగా వేలాడే యాటలే/ బీబమ్మ జాతరంటే కొండంతా జజ్జనకరే"***

జంతుబలి, తినడం, తాగడం ఈ పండుగనాడుంటుంది. ఈ పండుగ రోజున గుండం తొక్కడం అన్ని కులాలకు చెందిన వారంతా డప్పు మోగిస్తారు, పీర్లను మోస్తారు

***"పీర్లయినా రాళ్లయినా చెట్లయినా పుట్టలైనా/ మొక్కుంటాం కలసిమెలసి నిమ్మలపడ్తం"*** పండుగనాడు చేసే పనులన్నీ ఇందులో చెప్పబడ్డాయి.

దర్గాలు మేలు చేసేవని, మొక్కిన మొక్కులు తీరుస్తుందని అందరు నమ్ముతారు. దర్గాలు ఒక మతానికి చెందినవి కాదని భారతీయులందరివని అందరు కలిసి సంక్రాంతి రంజాన్ పండుగలు చేసుకోవచ్చని తెలియజేసే కవిత యాకూబ్ "దర్గా దయలో లెక్కకురాని మతం"

***"త్యాగం సతతహరితారణ్యం దర్గాలో సమాధి/ వేల లక్షల మొక్కుల్ని అందుకుంటా/ మరణించాక సతతం బతుకుతూనే...../ ఎల్లప్పుడూ పచ్చపచ్చగానే....."***


దర్గాలోకి ఎవరైనా ప్రవేశించవచ్చు. దేవాలయాల్లోకి ప్రవేశం కొందరికి లేదు. దాన్ని గుర్తు చేస్తూ దర్గా గొప్పతనాన్ని చెప్తున్నారు షాజహానా– "దర్గాదారికి అంటు లేదు" కవితలో...

***"అంటరానితం/ ఆలయ ప్రవేశం జరిగిందని/ శుద్ధి చేసుకోవడం చూస్తుంటే/ అందరినీ/ అలాయిబలాయి తీసుకునే/ దర్గాలు/ ఇప్పుడు ఆకాశమంత కనబడతున్నయ్"***

ముస్లిం మైనారిటీలు దేశంలో రాజకీయపరంగా ఎదురవుతున్న సమస్యలు, బ్రతుకు బండిని సాగించడానికి చేస్తున్న పలురకాల వృత్తులు ఎదురవుతున్న సమస్యలు, పేదరికంగాను, తగిన ఆస్తిపాస్తులు లేకపోయిన ధనవంతుల వర్గంలో చేర్చడం, ముస్లిం సమాజంలో స్త్రీలు వివాహ సమస్య, బురఖా, అధిక సంతానం, ఉత్పత్తి చేసే యంత్రంగా చూడబడటం, చిన్నపిల్లల కార్మిక విధానం భారతదేశం బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించొద్దని చట్టం చేసినా ఈ సమాజంలో ఇప్పటికీ కొనసాగుతుంది. బాల్యవివాహాలు, ముసలి వ్యక్తులకిచ్చి వివాహం చేయడం వంటి సాంఘిక దురాచారాలు రూపుమాపాల్సిన అవసరం ప్రతి భారతీయునిపై ఉంది. ప్రభుత్వం వారికి ఆపన్న హస్తం అందించి అభివృద్ధి పథంలో నడిపించాల్సిన అవసరం ఉంది. ప్రతి సమస్యను కవిత్వీకరించిన షాజహానా, స్కైబాబ సంపాదకత్వంలో వచ్చిన 'అలావా' ముస్లింల జీవనానికి అద్దం పడుతుంది.

# బువ్వ

- చిత్తలూరి
9133832246



బువ్వ దొరకనోళ్లు శాన మందున్నరు లోకమ్మీద... నువ్వు బువ్వొద్దంటవేంది తిను మల్ల... గుర్ గుర్... ముట్టెతోటి ముందుకు తోస్తూ పిల్లను తొందర చేస్తుంది తల్లి వరహం.

"నాకీ బువ్వొద్దు... తినబద్దయిత లేదమ్మా ఎందుకట్ల యిసిగిస్తవ్ నన్ను"

ఏంది యిసిగిస్తున్ననా... ఎక్కడో కాల్తెనట గుర్రమైన వొరి గడ్డి తింటదట అట్లుంది నీ బడాయి... తిన్తిను.. దేశం మీన గీ బువ్వ గూడా దొరకనోళ్లు శానా మంది వున్నరు... మల్ల గా మనుషులోస్తే... గీ బువ్వ గూడా దొర్కదు.. అగో స్తంభం కాడ ఇందాకట్నుంచి ఒకడు గీ కూడు కోసమే నాచు పెట్టుకునున్నడు.... కనపడ్త లేదా"


తల్లి వివరణతో మూతి ముందుకు సాచి బలవంతంగా ముద్ద నోట్లో పెట్టుకోడానికి తెగ ప్రయత్నం జేస్తున్నది పిల్ల వరాహం. ఊహు.. ససేమిరా నోట్లోకి బోతలేదు. మాంచి ఆకలి మీదనే వున్నది మల్ల... ఏమయిందమ్మా గీ పిల్లకు దీంతో ఎట్లా పాడయిద్ది... ఇంకా సేపయితే ఆ మాసిన గడ్డపోడు ... సగం సినిగిన అట్టు కట్టిన జిడ్డోదుతున్న, పాయింటు తప్ప ఒంటి మీద మరో గుడ్డయినా లేక అర్ధ నగ్నంగా వున్న ఆ బిచ్చపోడు స్తంభం సాటు నుంచి కుక్కలా నాచు పెట్టి చూస్తున్నోడు కర్ర దేవులాడుతున్నట్టుంది... దీని కేమో ఎంత సెప్పినా అర్థమైతలేదు ఏంజేయాలిగ....ఒకటే పరేశానయితుంది తల్లి వరాహం.

ఇంతలో వంటి మీద బట్టల్లోని మురికి కంటే కళ్ళల్లో ఆకలి ఎక్కువ కనబడుతున్న ఆ బిచ్చగాడికేదో కర్ర దొరికినట్టే వుంది. తమ కేసి రావటం చూసిన తల్లి వరాహం గుర్రంటూ ముట్టె పైకెత్తి పక్కనే వున్న మొండి గోడ దాటి కొంచెం ముందుకొచ్చింది. అప్పటి దాకా దాని ఆకారం సరిగా కనిపించని ఆ బిచ్చగాడు వొళ్లు భయంతో జలదరించింది. అది పర్వతమల్లె వుంది మరి దాడికి సిద్ధమైనట్టుగా వుంది. పైగా తమకు లభించిన ఆహారాన్ని తాను లాగేసుకోవాలని చూస్తున్నాడాయె.

నోట్లోకి ససేమిరా ముద్ద దిగని పిల్ల వరాహం తల్లిని... చేతిలో కర్ర జారిపోయి భయంతో రెండడుగులు వెనక్కేసి నిలబడ్డ బిచ్చపోడిని మార్చి మార్చి సూస్తుంది.

అంత పెద్ద ఆకారం పైగా పిల్లతో వున్న తల్లి వరహాన్ని చూసి బతుకు జీవుడా అనుకుంటూ తిరుగుముఖం పట్టాడా బిచ్చగాడు. ఆ సందు మలుపులో మరికొంత మంది మనుషుల అలికిడి వినిపిస్తుంది.

"త్వరగా రెండు ముద్దలు నోట్లో వేసుకోరా.. లేకపోతే రోజంతా ఆకలితో చస్తావ్.. మల్లెవరో ఇటువైపే వస్తున్నట్టుంది'' ఈ సారి తానే భయపడుతూ కాస్తంత ప్రేమగానే బిడ్డను ప్రేరేపించింది తల్లి వరాహం. కాస్త శాంతంగా కనిపించిన తల్లికేసి చూస్తూ.. "అమ్మా నిన్నో ప్రశ్నడగుతాను. సమాధానం చెబితే నువ్వు చెప్పినట్టుగానే ఈ బువ్వ తింటాను సరేనా?" అంది పిల్ల వరాహం.



దీని సందేహాలు కూల.... తిండి తిని రెండు రోజులయింది. ఏదో పక్కింటావిడ పుణ్యమాని ఇంత మంచి బువ్వ దొరికితే తినక ప్రశ్నలంటూ కాలయాపన చేస్తదేంది.. ఈ లోపల మరో అడుక్కుతినే వాడెవడయినా వస్తే ఇది కూడా దొరక్కుండా పోద్ది.. అడుక్కునే వాళ్ళ దాకా ఎందుకు... ఈ దేశంలో పొద్దంతా కష్టపడి పని చేసే ఎంతో మంది పేదలకూ మూడు పూటలా కనీసం పాసి పోయిన బువ్వ కూడా దొర్కుతలేదు.. అనుకుంట గబ గబ రెండు ముద్దల్ని నోట్లోకి దోపుకుని... నీ ఖర్మ అన్నట్లుగా బిడ్డకేసి చూసి..." అడుగు... ఇందాకేదో ప్రశ్నడుగుతానన్నావ్?" అంది.

"ఏం లేదమ్మా.... మన బువ్వ మనం దినాలె గానీ... గా మనుషుల బువ్వ మనకెందుకు జెప్పు... పాపం గా బువ్వ దొరక్క ఇందాకొచ్చిన గా బిచ్చగాడిలాంటి ఎంతో మంది పేదలు ఆకలితో అలమటించి.. ఎండకెండి వానకు తడిసి సోసొచ్చి రోడ్డుకవతలివైపు గా గుడి మెట్ల కాడ పడిపోవడం.. చనిపోవడం మన కళ్ళారా మనం ఎంత మందిని చూళ్లేదు...." కాస్త తెలివిగానే జవాబులాంటి ప్రశ్న సంధించిన పిల్ల వరాహంకేసి ఆశ్చర్యంగా చూసింది తల్లి.


"నువ్వనేది నిజమేరా కన్నా... కానీ ఏం చేస్తాం చెప్పు.... నువ్వూ రోజూ చూస్తూనే వున్నావు కదరా చిన్నా.. ఈ పెంట గడ్డకి ఆనుకుని వున్న ఆ ఖరీదయిన కాంపౌండు వాల్ మీంచి రోజు ఎంతెంత అన్నం గడ్డలు గడ్డలుగా ఆ ఇంటి ఇల్లాలు... విసిరేస్తుందో తెలుసుగా... ఆమె వుద్దేశమేదయినా నిజానికి గత మూన్నేళ్ళనుంచి మన బతుకు దెరువు ఆ ఇల్లాలు యిసిరేసిన పుణ్యమే మరి...' అంది తల్లి. నిజమేగానన్నట్టు చూసి తల పంకిస్తున్న పిల్ల వైపు చూసి నిట్టూరుస్తూ మళ్ళీ చెప్పటం మొదలెట్టింది తల్లి వరాహం.....ఏందో ఈ రోజుల్లో కూడా మనుషులు ఆకలితీరని వరిస్థితులు... మనకొచ్చినయి తిప్పలు..నిజానికి... మనుషులకు అన్నం దొరికితేనే మనక్కూడా ఇంత బువ్వ దొరికేది... నా చిన్నప్పటి రోజుల్లోనయితే ఇంతకంటే బలాదూరుగా నా యజమాని నన్నూ మీ అయ్యనూ ఊరి మీద వొదిలేసేటోడు. గప్పుడు గీ స్వచ్ఛ భారతులు గట్రా ఎక్కడివి... అయినా గింత మంది జనం ఎక్కడున్నరు. అంతా జంగల్... మనుషులు స్వేచ్ఛగా ప్రకృతిలో విహరించెటోళ్లు.. మేము పెంటకుప్పల మీద బురద మడుగులల్ల మీదర విహారం చేసుకుంట హాయిగా బతికెటోళ్లం.

గిప్పుడెమైంది... మైదానాలు మాయమైనయి... ప్రకృతి నిండా రియల్ ఎస్టేట్ల ఫ్లాట్లయినయ్.. మరుగుదొడ్లలాంటి వసతులు కూడా మనుషులకు సమకూరినయి.. ఇగ మనలాంటోళ్ల జనాభా కూడా తగ్గిందనుకో... కాదు కాదు... తగ్గించారు... మెదడువాపుకు మనమే కారణమని... దోమల వ్యాప్తికి మనమో చేయి వేస్తామని... మనుషుల నమ్మకంతో మన ఊర జాతి ముఖ్యంగా అంతరించి పోతనేవుంది.. కొద్దో గొప్పో ఊళ్లల్లో మిగిలిపోయిన మన లాంటోళ్లకు బతకమే కనా కష్టమైపోతుంది.. అందుకే ఎప్పుడూ ఎరుగని గిలాంటి బువ్వ కూడా తిని బతకాల్సి వస్తుంది."

"ఇదంతా బానే వుందిగానమ్మా... గా పట్నంల మనుషుల ఆహారంకోసమే మనలాంటోళ్లను స్పెషల్గా అదేదో ఫాములల్ల పెంచుతరంటగా..... గాళ్లు భలే తెల్లగా... తెల్లోళ్లలాగా వుంటరట... గటువంటి సౌకర్యాలు మనగ్గూడ గలిపిస్తే... మనం గూడ నీటుగా పెరిగి నలుగిరికీ ఉపయోగపడతం గదా...." అని పిల్ల వరాహం అనగానే....

"బానే వుంది నీ వరస... మనుషులే కుక్కల్లా... నక్కల్లా... మనలాంటోళ్లలాగా బతుకీడుస్తుంటే... ఇగ మనగురించెవరాలోచిస్తరు...?" అంది తల్లి, ఇంతలో మనుషులు కాస్త దగ్గరలో కొస్తున్నట్లేదో అలికిడయింది. తల్లి చెవులు రిక్కించి వింటూ విషయం గ్రహించేలోపే... గాలిలో ఏదో కర్ర రివ్వున దూసుకుంటూ వచ్చి... ఫట్ మంటూ తల్లి వరాహం కాలికి తగిలింది... క్షణాల్లో పిల్లను కాపాడేందుకు అడ్డంగా వచ్చిన నిలబడ్డందుకు కాలితో సరిపోయింది లేదంటే పిల్ల వరాహం పుచ్చ లేసిపోయేది.... రెండూ కలిసి పక్కనే

వున్న ముళ్ల పోదలోకి దూరిపోయాయి. పిల్ల వరాహం బెదరిపోయి గస పోస్తూ తల్లిని రాసుకుంటూ నిలబడింది.. ఆకు సందులోంచి కర్ర విసురుగా వచ్చి పడ్డ దిశగా చూస్తూ అంది తల్లి వరాహం "చెబితే విన్నావా...? నీ సందేహాలతో కాలయాపన చేయించావు... ఈ లోగా వాడెవడో ఇటు రానే వచ్చాడు.. కాసేపు నిశ్శబ్దంగా గమనిద్దాముండు ఏం చేస్తాడో....?"



మట్టి పెడ్డల్లాగా పడి వున్న అన్నం పెడ్డల వైపు ఆకలిగా చూస్తూ వాటిని చేరుకున్నాడా బిచ్చగాడు... అటూ ఇటూ చెట్ల పొదల్లోకి తేరిపార చూసి.. ప్రమాదమేదీ లేదని నిర్ధారించుకున్నాక.. అన్నం పెడ్డల్లో అరచేయినుంచాడంతే! ఎక్కడ పట్టుకున్నా తిన శక్యంగా లేదు ఆ బువ్వ పెడ్డలు... ముందు మంచి అన్నంలాగే వుంది... అప్పటి దాకా బూడిద కుప్పల్లోనూ... బురద మట్టిలోనూ పొర్లాడిన వరాహాలు ఆకలితో అన్నం పెడ్డల్లో మూతి దూర్చేసరికి... బువ్వ నిండా బూడిద...... బురద అంటుకుపోయి వుంది. అక్కడకి అరచేత్తో... అక్కడక్కడా అంటిన బురదనూ...బూడిదనూ నోటితో ఊదుతూ... సగం చిరిగిన తన ప్యాంటు గుడ్డ పెలికకు తుడుస్తూ... అన్నాన్ని శుభ్రం చేసుకుంటున్నాడు ఆకలిని చంపేందుకు.... అయినా తిన శక్యంగా లేదు బురదంటిన బువ్వ.... బూడిదంటిన మెతుకులు... ఇదంతా పొద చాటునుండి ఊపిరి బిగ బట్టి చూస్తున్నాయా వరహాలు.

"చూశావా... నీ వల్ల ఆ కాసిన్ని మెతుకులు తినలేక వెళ్లిపోతున్న ఆ బక్క పీనుగను పాపం!..." జాలి పడింది పిల్ల వరాహం "అవునా...?"

అంటూ తల పొదల్లోంచి పొటమరించి చూడబోయిన తల్లి వరాహం..." ష్! గొడవ చేయకు వాడెందుకో తూలుతూ మన వైపే వస్తున్నాడదిగో!" అంది పిల్లను తన ముట్టెతో మరింత పొదలోపలికి తోస్తూ....

దేనికోసమో వెతుకుతున్నట్లు నీరసంగా వచ్చిన ఆ బిచ్చగాడు... వరాహాలు దాక్కున్న పొద దగ్గరగా వచ్చి... తీక్షణంగా చూస్తూ ఆగాడు.. వాటి గుండెలు లబ లబలాడాయి... ఊపిరి బిగబట్టి అతన్నే చూస్తున్నాయి... ఇంతలో ఆ బిచ్చగాడు పొద దగ్గర పడిపోయి వున్న ఇంతకు ముందు తమ వైపు విసిరేసిన తన చేతి కర్రను తీసుకోవటం చూసి.. ''హమ్మయ్య... కర్ర కోసమన్నమాట..." అనుకొని అంతలోనే మళ్లీ నెత్తి మీద పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడ్డాయి... కొంపదీసి మళ్ళీ తమ పైకి విసురుతాడా యేమిటి ఆ కర్ర అనుకున్నాయవి. కానీ నీరసంతో నిలబడలేక తూలుతున్న తనకు ఆసరా కోసమని గ్రహించి ఊపిరి పీల్చుకున్నాయి తల్లి పిల్లలు.

కర్ర సాయంతో అతి కష్టమ్మీద పొదనుండి దూరంగా జరుగుతూ మొండి గోడవైపు కదులుతున్న ఆ ముసలి ప్రాణం దబ్బుమని కింద పడిపోయింది... అంతే ! ఎండిపోయిన పెదాలు మరింత విడివడ్డాయి... బాగా లోతుకుపోయిన ఎండిన డొక్క కాసేపు పైకి కిందికి ఎగ శ్వాసగా దిగ శ్వాసగా కదిలినట్లు కదిలి కాసేపటికి చలనం లేకుండా అయిపోయింది. తమ వైపు విసరివేయబడ్డ ముసలి చేతి కర్ర వైపు భయం భయంగా చూస్తూ పొదలోంచి మెల్లగా బయటకొచ్చాయి వరాహాలు...

ఆ ఎండలో చలనం లేకుండా చచ్చిపడివున్న ఆ బిచ్చగాడి శరీరం వైపు చూసిన పిల్ల వరాహం చలించిపోయి వాళ్లమ్మతో అంటోంది..." అన్యాయంగా ఆ ముసలి బిచ్చగాడి చావుకు కారణమయ్యావమ్మా నువ్వు.. పాపం ఎన్ని రోజుల్నుండి ఆకలితో వున్నాడో అల్లాడిపోయాడు.... నువ్వు మూతి పెట్టకుండా.. అసలు మనం ఆ బువ్వను ముట్టకుండా వుంటే ... ఓ రెండు పెడ్డలయినా తిని బతికేవాడేమో ఆ ముసలి పీనుగ.. అనవసరంగా అతని చావుకు కారణమయ్యావమ్మా నువ్వు...."

"ఛట్! నోరు ముయ్యి... నన్నెందుకే అంటావ్. నేనేమైనా అతని నోటికాడి కూడును లాక్కున్నానా... మన స్థావరంలో పడి వున్న బువ్వను మన ప్రాణాలు నిలుపుకోవడం కోసం నేను కదలించాను... నిన్ను తినమన్నాను.. లేకపోతే...

మనుషుల బువ్వ మీద నాకేమైనా మోజా... అయినా ఇదంతా మనుషులు చేసే తప్పిదమే తెలుసా బుడతా!" అంది తల్లి వరాహం..." అదెట్లా నువ్వు చేసిన తప్పును సమర్థించుకుంటున్నావా ఆ ముసలాడి చావుకు పరోక్షంగా నువ్వే కారణమై కూడా వాళ్లమ్మను రెట్టించింది పిల్ల వరాహం.

ముమ్మాటికి నేను కాదు ఈ వ్యవస్థ.. దానిలోని మనుషులు.. అదెట్లాగంటావా...?

రోజూ అంతంత అన్నం ఎక్కువ తక్కువలొండి మన మొండి గోడ మించి ఇవతలకి విసిరి పారేసే గొడవతలి ఆ

**కవిత**

# జ్ఞాపకాలను తవ్వేవాడు

- సి.యస్.రాంబాబు
9490401005



స్వప్నమే మొలకెత్తే
పూలవనం కోసం అతను
ప్రతి ఉదయం అన్వేషిస్తాడు

రాత్రి కురిసిన జ్ఞాపకాల వర్షపు చెమ్మ
ఇంకా పచ్చిగానే ఉంది
గాయమై సలుపుతూనే ఉంది

మెలకువలో నిద్రలా
విచ్చుకుంటూ వడిలిపోతాడతను
పరిమళం మాత్రం వదలదు

దిగులుపడ్డ మనసు
దివారాత్రాలు
జ్ఞాపకాలను జపిస్తుంది

హృదయనావ కల్లోల సముద్రంలో
బతుకుముద్రల ఆనవాళ్లు వెతుకుతోంది
చివరిసారి స్పర్శిద్దామని

మనసు పద్మంలో
వికసించిన ఆకాశంలా వెలుగురేఖ
రేపటి ఆశలా తళుక్కుమంటోంది

యుద్ధవిరామం తర్వాత
క్షతగాత్ర గానంలా
అంతర్యుద్ధం చేస్తూ అతనిలో మౌనం

అన్వేషిలా తనను తాను
వెతికే ఆ బాటసారికి
విప్పారిన వేకువ ఓ దీపధారి

♦

---

ఖరీదయిన బంగ్లాలోని ఇల్లాలేనాడయినా ఆలోచించిందంటావా ఇలాని....

అయ్యో అంతంత బువ్వ అలా పారేసే బదులు ఈ వీధిలోనే తెల్లారితే ఎదురొచ్చే ఎంతో మంది అడుక్కునే అన్నమో రామచంద్రాని అలమటించే వాళ్లున్నారు. వాళ్లల్లో ఓ నలుగురిని పిలిచి పెడితే ఆకలి తీరిన వాళ్లు ఇంకొంత కాలమైనా హాయిగా బతుకుతారు కదాని ఆలోచిస్తే అంత బువ్వను ఇలా మనం తిరుగాడే చెత్త కుప్ప పాలు చేయదు... ఒక పక్క.. ఒక్క పూటయినా ఇంత అన్నం ముద్ద దొరక్క ఆకలితో అల్లాడిపోతున్న నిరుపేదలుంటే.. మరో పక్క ఇలా అన్నం విలువ తెలియక వండిన బువ్వను నేల పాలు చేసే తెగ బలిసిన బాపతులున్నారు.. ఇక పెళ్ళిళ్ళపుడూ... పండగలకూ.. పబ్బాలకు ఎంతెంత తినుబండారలను పసి గుడ్డుల్ని కుప్ప తొట్లలోనికి విసిరేసినట్టు విసిరి పారేస్తూ సన్నివేశాలూ.. పారేసిన విస్తరాకుల దగ్గర కుక్కలతో పాటు ఎంగిలి బువ్వ కోసమైనా వెంపర్లాడే ఎంతో మంది నిరుపేద బిచ్చగాళ్లని మనం ఇదే చెత్తకుప్ప కాడ ఎన్ని సార్లు చూడలేదూ.... ?రోత తిని బతికే మనలాంటోళ్లకేమో బువ్వ తినిపిస్తున్న ఈ మనుషులు... సాటి మనుషులు పస్తులతో చస్తుంటే పట్టించుకోక ఎంతో ఆహారాన్ని ఇలా పెంటకుప్పల పాలు చేస్తున్నారు..... అలాంటి మనుషులు కాదా ఇలాంటి ముసలయ్యల ఆకలి చావులకు కారణం...?" వివరించి చెప్పిన తల్లి కేసి చూసిన పిల్ల వరాహానికి ఏదో స్ఫురించింది... " అమ్మా నీతో పాటు నేనూ ఇంక ఆ బువ్వ తింటాను పదవే" అంది... తల్లి పిల్ల వరహాలు పాద పక్కనే చెత్తకుప్పలో చచ్చిపడి వున్న ముసలి బిచ్చగాడిని దాటుకుంటూ... చెల్లా చెదురై పడివున్న మట్టి పెడ్డల్లాంటి బువ్వ పెడ్డల్లోకి దారి తీసాయి... దారి మలుపులో మరో బిచ్చగాడెవరో వస్తున్న కర్ర చప్పుడు వినిపించి క్షణ కాలం చెవులు రిక్కించి నిలబడిపోయాయి... మట్టిలో కలిసిపోయిన పారేసిన బువ్వ కేసి ఆకలిగా చూస్తూ.....,.!

♦

కవిత

# పచ్చదనమై కదలాలి...!

- గోపగాని రవీందర్
9440979882



విశాలంగా విస్తరించిన
నేలంతా ఆకుపచ్చని రంగును
పులుముకుంటున్న కాలమిది.

కురిసిన అగ్నిలో
సర్వం కోల్పోయిన తరువులు
చిగురిస్తున్న తరుణమిది.

ప్రవాహంతో అలిసిపోయి
విశ్రమించిన వాగులు
చినుకులతో కదులుతున్న సమయమిది.

కాలాన్ని ఎన్ని విధాలుగా
భాగించుకున్న శేషం మాత్రం
సున్నా రాకపోవడం ఆనందకరం.

తోటలోని సుమాలు
వాడిపోయి రాలకమానవు
మొగ్గలు రాకమానవు.

ఉషోదయపు క్షణాల్లో
విచ్చుకుంటున్న
జీవన పరిమళాన్ని ఆస్వాదిద్దాం.

పురాణాగాథలు విన్న
ఇతిహాసాలు చదువుకున్న
ఆ సారమంతా మనుగడ కోసమే.

మబ్బులు అడ్డుపడితే
కిరణాలు ఆగుతాయా?
మార్గాన్ని మార్చుకుంటాయి.

మనకంటే చిన్నవైన జీవులు
బతకటానికి అహర్నిశలు
ప్రయత్నాలు చేస్తున్నాయి కదా.

అంధకారమిస్తున్నదని
చీకటిని తిట్టుకుంటామా?
తరమడానికి వెలుగుంది కదా.

ఆవేశం దుర్భరమైనది
వెలలేని ప్రాణాన్ని హరిస్తున్నది
అనంతమైన శోకాన్ని ప్రసాదిస్తున్నది

కారణం చిన్నదైనా
నిన్ను భయపెట్టేదంత పెద్దదైన
నీ వాళ్ళున్నరని ఆలోచనెందుకు రాదు?

సమస్య సాధన
అసాధ్యం మాత్రం కాదు
క్షణమాలోచించు కుంటే.

చదివే పిల్లలు
ఊపిరిని చిదుముకుంటుంటే
కలచివేస్తున్నది హృదయాన్ని

ముళ్ళ దారులను
రాళ్ళ దారులను దాటుకునే కదా
మనిషి నాగరికత నిలబడింది


ఈ విశ్వమంతా మీదే
ఎన్నో తన రహస్యాలను
కనుక్కోమ్మని ఆహ్వానిస్తున్నది కదా.

నిండుగా నూరేళ్ళు
పచ్చదనమే ప్రాణమై కదలాలి
నువ్వేమిటో నిరూపించుకోవాలి

♦

విశ్లేషణ

# మురాసకి శికిబు - ఆధునిక ప్రపంచపు మొదటి నవలా రచయిత్రి




- వేలూరి కృష్ణమూర్తి
9448977877

ఎన్నో శతాబ్దాల నుండి అక్షర జ్ఞానానికి వంచితులైన మహిళలు సహజంగా చాలా ఆలస్యంగానే సాహిత్య రచనకు పూనుకొంటారు. ఇలాంటి దౌర్భాగ్యం భారతదేశానికి మాత్రమే పరిమితం కాదు. కాని, అలాంటి వారి రచనలు యోగ్యత, ఆ రచనలలోని వైవిధ్యమైన విషయాలను గమనించినపుడు, వారికి లభించిన అత్యంత పరిమితమైన అవకాశాలనూ, అనుభవాలనూ అతిక్రమించి విశిష్టమైన సంవేదనలతో చేసిన మహిళా సాహిత్యపరమైన రచనలు అనన్యమైనవి. పురుషాధిక్యత ప్రాబల్యం అధికంగా వున్న ఆ కాలంలో స్త్రీలు రచనలు చేయడానికి అవకాశమే అరుదుగా వుండిన 11వ శతాబ్ధపు సమయంలో **'గెంజికథ'** అన్న ఒక బృహత్ నవలను రచించిన కీర్తి జపానుదేశపు ఒక మహిళ 'మురాసకి శికిబు'కు చెందుతుంది. ఇది మాత్రమే కాదు. ఈ రచన ఆధునిక ప్రపంచపు మొట్టమొదటి నవలగా ప్రసిద్ధి చెందినది. దీనికి తోడు యీ నవలలో మనోవైజ్ఞానిక సంబంధాలను, వాటికి సంబంధించిన క్లిష్టకరమైన విషయాలను చర్చించినదన్న గౌరవానికి కూడా అర్హమైనదన్న సంగతిని ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం.

మురాసకి శికిబు అన్నది ఈ రచయిత్రి కావ్యనామం. ఆమె అసలు పేరు యిప్పటికీ నిగూఢంగానే వుండిపోయినది. శికిబు ఆ ప్రదేశంలోని ఒక స్థానిక న్యాయాలయంలో 'లేడీ ఇన్ వెయిటింగ్ (Lady in waiting) గా పని చేసినదట. అందువల్లనే ఆమె ఈ రచనలో పలుచోట్ల అక్కడి న్యాయాలయానికి సంబంధించిన సన్నివేశాల వర్ణన కూడా చిత్రితమై వున్నది.

సుమారుగా ఒక వెయ్యి సంవత్సరాల క్రితం రచించబడ్డ 'గెంజికథ' నవల వెయ్యి పేజీలకు పైబడి 54 అధ్యాయాలతో ఉంది. ఈ బృహత్ నవలే కాక, తన రోజువారి అనుభవాలను దాఖలుపరచిన దినచరి (Personal Diary)తో పాటు 128 పద్యాలున్న ఒక కవితా సంకలనాన్ని కూడా 'మురాసికి శికిబు' రచించింది.

మురాసికి శికిబు జీవించినది హేయన్ రాజ్యమేలుతున్న క్రీ.శ. 794-క్రీ.శ. 1185 మధ్యకాలంలో, అపుడు జపాన్ దేశ ప్రభుత్వం మరియు రాజవంశపు దాఖలాలు చైనాదేశం నుండి అరువు పుచ్చుకొన్న 'కాంజి' లిపిలో వుండేవి. అప్పటి సాహిత్యం కావ్యం, పద్యాలకు మాత్రమే పరిమితమై వుండేది. అపుడు అరుదుగా రచింపబడిన గద్యరచనలు అత్యంత రంజనీయమైన జానపద కథలు, ఒకిన్ని ఆత్మ చరిత్రలు మాత్రమే వుండేవి. అన్నిటికంటె ముఖ్యంగా సాహిత్య రచనలు చేసేవారు బుద్ధిమంతులైన పుత్రులకు (మగవారికి) మాత్రమే

సహజంగా వుండేదేగాని, తెలివితక్కువ స్త్రీలకు వుండేది కాదన్న అభిప్రాయం బలంగా వుండేది.

> ***స్త్రీ-పురుషుల సంకీర్ణమైన సంబంధాలను గురించి, మరియు మానవుల వివిధ రకాలైన స్వభావాలను గురించి, విపులంగాను చాలా సమర్థవంతంగానూ పరిచయం చేస్తుంది. 'గెంజికథ' నవల.***

అప్పటి జపాను సమాజంలో మహిళలు పాత్ర కేవలం సంసారం, భర్త, పిల్లలకు మాత్రమే పరిమితమై వుండేది. ఇలాంటి నిర్భందాలతోపాటు మహిళలు వారి పేర్లతో గుర్తింపబడేవారు కాదు. స్త్రీలు ధరించిన రంగు వస్త్రాల ఆధారంతో వారిని గుర్తించేవారు. అలా కాకపోతే ఆ ఇంటి వారి పురుషుడికి వున్న, స్థాన మానాలను, హోదాలను ఆధారం చేసుకొని ఆ స్త్రీలు గుర్తింపబడేవారు. ఒక మహిళ తన పూర్తి జీవిత కాలంలో స్వతంత్రంగా మాట్లాడుతుండినది ఆ ఇద్దరితో మాత్రమే – తన భర్త, మరియు తన తండ్రి, భార్యభర్తలు వేరు వేరు గదులలో నివసిస్తూ, బిడ్డల పోషణ మాత్రం పూర్తిగా తల్లి వహించేది. అందువల్ల అప్పటి జపాను సమాజంలో ఒక మహిళ తన జీవితంలోని ఎక్కువ పాలు సమయాన్ని దప్పంగా వున్న దుప్పటిలాంటి పరదాలు వుంటున్న చీకటి గదులలో నివసిస్తూ, బట్టలు శుభ్రం చేయడం, పంఖాలు వేయడం, పిల్లల పెంపకం, పోషణ లాంటి పనులతో గడిపేవారు. అక్కడి స్త్రీలకు వీటినుండి కొద్దిసేపైనా తప్పించుకోవడానికి వున్న ఒకే ఒక ఉపాయమంటే అపుడపుడు వారు ఎద్దుల బండ్లలో శింటో దేవాలయానికి ప్రయాణం చేయడం! అలా ప్రయాణం చేస్తున్నపుడు పరదాలతో పూర్తిగా కప్పబడిన బండిలో పోతూ పరదాసందులలోంచి బయటి ప్రపంచాన్ని, ప్రకృతిని చూచి ఆనందించడం వారికొక సంభ్రమంతో కూడిన విషయంగా వుండేది.

ఇలాంటి సామాజిక కట్టుబాట్లు వున్న సమయంలో క్రీ.శ. 973లో టమెటోకి అనే రాజుకి చివరి కుమార్తెగా 'మురాసికి' జన్మించినది. ఇంతకు ముందు తెలిపినట్లు 'మురాసికి శికిబు' ఆమె నిజనామం కాదు. శికిబు అన్నది ఆమె సంబంధీకుల స్థానం లేక హోదా సూచకమైతే, 'మురాసకి' అన్నది నేరేడు రంగుపూలు పూచే ఒక చెట్టు పేరు. అప్పటి జపాను సమాజంలో మహిళలు పురుషులలాగా బుద్ధిమంతులు కారన్న నమ్మకం వుండేది. అయినప్పటికీ, ఆ సమయంలో చీని భాషలో వ్రాయడం నిషేదింపబడి వున్నప్పటికీ 'మురాసకి శికిబు' తన అన్నతో సరిసమానంగా కలిసి చదువడం, వ్రాయడం నేర్చుకొన్నది. చదువులో అన్నను అధిగమించినది. చదువులో మురాసకి తన అన్నను ఎంతవరకు అధిగమించిందంటె, ఆమె తండ్రి 'నీవు అబ్బాయి అయివున్నట్టయితే నేను ఎంతగా సంతోషపడేవాడినో' అని తన అసహహనాన్ని వెలిబుచ్చేవారట.

అప్పటి కాలానికి, చాలా ఆలస్యంగానే, అంటే, ఇరవై మూడేళ్ళకే వివాహమైన మురాసకి శికిబుకు ఒక కుమార్తె జన్మించినది. కాని, ఆమెకు వివాహమైన మూడేళ్ళ లోగానే ఆమె భర్త 'నెంబుటాకా' అన్న రోగానికి బలియై మృతిచెందాడు. తన భర్త మరణంతో మురాసకికి కలిగిన దుఃఖం అంతింత కాదు. ఈ ప్రకరణతో, యాతనామయమైన ఏకాకితనం మురాసికి పాలైనది.

ఇలాంటి విషమ పరిస్థితిని ఎదుర్కొన్నప్పటికీ, మురాసకి శికిబు తన బుద్ధి శక్తి మరియు చతురతతో అప్పటి మహారాణి శోశి ఆ స్థానాన్ని చేరుకొన్నది. జపాను దేశంలోని కథనాల ప్రకారం, మురాసకి శికిబు రచనలు చేయడానికి స్ఫూర్తి పొందడం కోసం 'ఇశిమారాదేరా' దేవాలయానికి యాత్రకు వెడుతుండేదట. ఒక పౌర్ణమినాడు ఆ దేవాలయం వద్ద వున్న సరోవరం గట్టుపై కూర్చొని పూర్ణచంద్రుడిని చూస్తూ పరవశు రాలై వున్న సమయంలో మురాసకికి 'గెంజికథ' వ్రాయడానికి స్ఫూర్తి లభించినదట. అపుడలా ప్రారంభించిన యీ బృహత్ నవలను మురాసకి శికిబు పదేళ్ళలో పూర్తి చేసినది.

'గెంజికథ' నవలలోని కథానాయకుడు రాజకుమారుడు 'గెంజి', ఈ కథ ఎన్నో చిన్న, పెద్ద పాత్రల ద్వారా చాలా తరాలు దాటుతూ పోతుంది. ప్రేమ, కామం, దుఃఖం, సాహసం, ఒడిదుడుకుల లాంటి విషయాలకు తోడుగా ఆనాటి రాజకీయ వ్యవస్థ, అప్పటి సామాజిక పరిస్థితులు మరియు ప్రజల జీవితం గురించి వెలుగు చూపుతుంది. వీటన్నిటికంటె ముఖ్యంగా స్త్రీ–పురుషుల సంకీర్ణమైన సంబంధాలను గురించి, మరియు మానవుల వివిధ రకాలైన స్వభావాలను గురించి, విపులంగాను చాలా సమర్థవంతంగానూ పరిచయం చేస్తుంది 'గెంజి కథ' నవల. ఈ నవల నిడువు చాలా దీర్ఘంగా వున్నా, ఎలాంటి ఉత్ప్రేక్షలు లేకుండా మానవుని సహజ స్వభావాన్ని అత్యద్భుతంగా చిత్రించడం వల్లనే ఈ నవల వారి భాషలో అత్యంత శ్రేష్టమైన కృతియని పరిగణింపబడ్డది. ఈ నవల రచన జరిగిన సమయంలోనే 'గెంజికథ' నవలను ప్రజలు

కవిత

# మనలో ఎడార్లు ప్రవహిస్తున్నప్పుడు...



- కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి
9948774243

మనలో
నదులెండిపోయి
ఎడారులు ప్రవహిస్తున్నప్పుడు
ఇసుక సంగీతం గాక
వసంతగానాలు వినిపిస్తాయా!

స్వార్థాలు కరచాలనం చేసుకునే చోట
ఉమ్మడి ప్రయోజనాల ఊసులుంటాయా?
పూచే పువ్వు
నవ్వులు వినలేని వానికి
రాలే ఆకు
దుఃఖం కనిపిస్తుంటుందా?
మాయ పాచికలాటను నమ్మి
కాసుల గలగలలు కలగనే వాడికి
శ్రమైక విత్తం
చిత్తాన్ని ఆకట్టుకుంటుందా?
అందరిలో తెలీనితనం వేటాడుతున్నప్పుడు
సజీవ సామాజిక వివేచనలు, విశిష్టతలు
బలై పోతూనే వుంటాయ్!
మానవీయత ముక్కలై రాలిపోతుంటూంది
పాపం! వో దిక్కులేని పక్షి
గూట్లో ఆకలితో తల్లడిల్లుతున్న పిల్లలకు
రివ్వున ఎగిరి వచ్చి నేల రాలిన
మానవతా ముక్కల్ని ముక్కున కరచుకెళ్లి
ఆనందంగా బిడ్డలకు తినిపిస్తూంది!!
ముందు ముందు తన సంతానమే రెక్కవిప్పి
మనిషితనాన్ని అంతటా పంచక పోతుందానే ఆశతో...

♦

చాలా మెచ్చుకొని ఈ కథను అప్పటి ప్రజలు మరలా మరలా విని ఆనందించేవారట. అలా మురాసికి శికిబు వ్రాసిన నవల ప్రజలలో ఖ్యాతినార్జించినది. కానీ, ఈ కృతి యొక్క గొప్పదనం వెలుగులోనికి వచ్చినది. రచయిత్రి మురాసకి మరణించిన కొన్ని శతాబ్దాల తరువాత అని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది!

ప్రాచీన జపాను భాషలో రచించబడిన 'గెంజికథ' నవలను అర్థం చేసుకోవడం చాలా కష్టంగా వుండేది. కాని, 20వ శతాబ్దంలో ఈ కృతిని అధ్యయనం చేసి ఇపుడు వాడుకలో వున్న జపాన్ భాషలోనికి సరళంగా వ్రాసినవారు 'యా సానా అకికో' అన్న రచయిత. అనంతరకాలంలో ఈ నవల ప్రపంచంలోని అనేక భాషలలోనికి అనువదింపబడి చాలా ప్రసిద్ధిచెందినది.

కేవలం 41 సంవత్సరాలు మాత్రమే జీవించిన మురాసకి శికిబు 1014లో మరణించినది. ఆమె జ్ఞాపకార్థం క్యోటోనగరంలో ఆమె సమాధిని చూపరుల, యాత్రికుల వీక్షణార్థం నిర్మించారు. ఈ నవల రచన – ప్రచురణ జరిగిన వెయ్యి–సంవత్సరాలు నిండిన సందర్భం జ్ఞాపకార్థం చాలా పెద్ద ఎత్తులో ఉత్సవాలు జరుపుకొన్నారు జపాను ప్రజలు. అంతేగాక, జపాను ప్రభుత్వం 'మురాసకి శికిబు' జ్ఞాపకార్థం రచయిత్రి బొమ్మను, వారు విడుదల చేసిన రెండువేల వెలగల 'ఎన్' (N) నోట్లపై ముద్రించి గౌరవించినది.

ఇలా, ఒకప్పటి జపానుదేశపు సమాజంలో వ్రేళ్ళూరిన మూఢ సంప్రదాయాలను పెకలించి ఒక గొప్ప సాహిత్యకృతిని 'గెంజికథ' నవల రూపంలో చిత్రించి తనలోని భావనలను అభివ్యక్తీకరించిన 'మురాసకి శికిబు' ఒక రచయిత్రిగా చేసిన ఒక గొప్ప సాధన. మురాసికి శికిబు నిజనామమేమిటో తెలియకపోయినప్పటికీ వెయ్యి సంవత్సరాల అనంతరమూ ఆమె రచించిన కృతి మరల మరల విశ్లేషణకరమైన విమర్శకు లోనవుతూండడం ఈ ఆధునిక ప్రపంచపు మొట్టమొదటి నవలా రచయిత్రికి లభించిన గౌరవం సార్థకం గదా?

**కవిత**



- రమణ యశస్వి
9848078807

# నానీలు

ఎవరికీ లేదు
దింపుడు కళ్ళం ఆశ
ఆమె మెళ్ళో బంగారు గొలుసు
పైనే ధ్యాస

నా ఆంతరంగిక జగత్తులో
పోరాటాలు
ఎన్నో ప్రపంచ యుద్ధాలకు
సమానాలు

వాగు, చేప పిల్లల్తో
ఆడుకుంటోంది !
జాలరి వల
కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది !!

భగవద్గీత
ఒక సిలబస్
జీవనయుద్ధరంగంలో
పనిచెయ్యి ,బస్ !

ఈ ఉగాదిన కాకికి
వసంత కోకిల బిరుదా ?
మరి పొదిగిన
తల్లి కదా ?

నానీ బోన్సాయ్ కి
నాలుగు కొమ్మలు
ఒక్కో కొమ్మపై
ఆరేడు అక్షర పక్షులు

కప్పల కచ్చేరికి
చెవులు చిల్లులు పడి
కట్టలు తెంచుకుంది
చెరువు

దండెం మీద
స్నానం చేసిన బట్టలు
యోగా చేస్తూ
వాయుదేవుడే గురువు

ద్విచక్ర వాహనంపై
సెల్లులో పకపకలు
యమదూతల్తో
పరాచకాలే

మనసు కొంగకి
జపం కుదరదు
కోరికల
చేపల మడుగులో

ప్రాణం ఐసీయూ పంజరంలో
సేద తీరితే
స్వేచ్ఛగా
చిలకెగిరిపోయింది

మెదడులోనో
ఛాతీలోనో
ఎక్కడో అక్కడ
మనసుంటే చాలు

ఎల్లప్పుడూ ఓటరుదే
పై చేయి కావాలి
నేతలు సదా
అడుక్కునేవారే !

♦

**సాహిత్య ప్రస్థానం చిరునామా**

రచనలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు
ఈ దిగువ చిరునామాకు పంపగలరు
సాహిత్య ప్రస్థానం
27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు
ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

**సాహిత్య ప్రస్థానం పత్రికకు చందా కట్టారా?**

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి!
తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!


1 సంవత్సర చందా రూ. 240/-
5 సంవత్సరాల చందా రూ.1000 /-
10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank Details: SBI, Governorpet, Vijayawada
A/c No. 52001500585, IFSC: SBIN0020343

చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

## నచ్చిన రచన

# కవిత్వమై మెరిసిన నది రేపటిగీతం





- వల్లభాపురం జనార్దన
9440163687


సమకాలీన సంఘటనలను కవిత్వీకరిస్తే, మనసులో చెలిమెలా ఊరుతున్న స్పందనలకు అక్షరాకృతి కల్పిస్తే, తొలకరి చినుకుల కౌగిలిలా భావం మట్టివాసనల స్నానం చేయిస్తే, దృశ్యాలను కలం కుంచెతో అక్షర చిత్రాలను చిత్రిస్తే, సామాజిక పరిణామం పట్ల మమేకమై పాఠకుని మనసును పట్టి ఉంచే కవిత్వమే రేపు కవిగా తనను నిలబెడుతుందని భావించిన కవి రేడియం. అందుకే రేపుకూడా కవిత్వాన్ని, కవిని నిలబెట్టాలనే దృష్టితో కవిత్వం రాస్తున్న కవి రేడియం. ఆయన కొండన్న. కలం పేరు రేడియం. కొండలా తలెత్తి నిలబడాలని, రేడియంలా మెరవాలని అక్షరాలను విత్తి కవితా సేద్యం చేస్తున్న కవిమిత్రుడు రేడియం.

ముప్పైయేళ్ళుగా కవిత్వం రాస్తున్నా ఇప్పటికి ఆయన వెలువరించిన కవితా సంపుటి ఒక్కటే. అదే 'నది రేపటిగీతం'. కవి దగ్గర అక్షరాలున్నా, అచ్చులో చూపించడానికి అవసరమైన పచ్చనోట్లు లేకపోవడమే. ఇది కవులందరికీ అనుభవైకవేద్యమే. ఇంతటితో వ్యక్తిగత పరామర్శను ఆపి ఆయన కవిత్వ పరామర్శలోకి అడుగుపెడదాం.

రేడియం 'నది రేపటిగీతం' కవితా సంపుటిలో 49 కవితలున్నాయి. ప్రతి కవితా సామాజిక అంశాన్ని పట్టి చూపిస్తుంది. "తెగిపడిన నల్లపూసలు, పగిలిన గాజు ముక్కలు, కన్నీటి కథ వినిపించాయి" అంటున్న అర్ధరాత్రి కవిత ప్రస్తుత వివక్షా, అత్యాచార సమాజ చిత్రాన్ని అక్షరాల కుంచెతో రూపుకట్టించింది

"గాలి అంటే ప్రజాశక్తి. ఇప్పుడు ఈ గాలే వీస్తుంది. రేపు ఈ గాలే స్వేచ్ఛాకేతనమై ఎగురుతుంది" అంటూ తూర్పుగాలి కవితలో గాలిని ప్రజాశక్తికి ప్రతీకగా తీసుకొని ప్రజాపోరాటాలను పతాక శీర్షికగా చేసిండు కవి– "స్వేచ్ఛాపుష్పం ఉచితంగా లభించదు. దాని వెల ఒక నెత్తుటి మేరు, ఒక కన్నీటి కడలి" అంటూ "తూర్పు వైపుకే" కవితలో ఇప్పటి వరకూ ఆధిపత్యం ప్రజల మీద రుద్దిన, రుద్దుతున్న బానిసత్వానికి ప్రజలు కార్చిన కన్నీటి కడలి నెత్తుటి సెలయేరై పోరుబాటలో సాగితేనే స్వేచ్ఛ అనే పుష్ప పరిమళం బతుకుల్లో వ్యాపిస్తుంటేనే సందేశమిస్తుంది. "మీ చరిత్ర మేడిపండని, మీ కీర్తి గడ్డి పువ్వని, తిరిగి రాయాల్సిన భావిచరిత్రకు చిత్తుప్రతి తయారుచేశారు." అంటాడు కవి "చిత్తు" కవితలో. కవితా శీర్షిక 'చిత్తు' ఆధిపత్య ఓటమికి సంకేతం. చిత్తుప్రతి పోరాట విజయానికి సంకేతం.

"చిట్లిన ప్రతి రక్తబిందువు. కాకమానదు ప్రళయ సింధువు" అంటున్న "సూక్తం" కవిత ప్రజాపోరు ఉప్పెనై ఆధిపత్యాన్ని ముంచేస్తుంది అని హెచ్చరిస్తుంది.

"ప్రగతి వృత్తనిర్మాణం చేస్తున్నాను. ఇది ఐక్యతకు ప్రతీక. రేపటి చరిత్రకు నాంది" అంటదు కవి చైతన్య వృతం

## కవిత

# గజల్

- చెళ్ళపిళ్ళ శ్యామల
9949831146

ఎదుటి వాడి కున్నదని ఏడిస్తే వస్తుందా
ఎడారిలో గులాబిని పూయమంటే
పూస్తుందా

క్రీములెన్నిరాసినా ఫేషియల్ చేయించినా
ముడుతలు పడ్డ తనువు ముసలితనం
దాస్తుందా

గొంతు చించుకుని కాకి ఎంతసేపు అరచినా
కమ్మని కోయిల పాటల మాధుర్యం
వస్తుందా

ఉత్త మాయమాటలతో ఎలక్షన్లో గెలిచినా
పదవె తప్పు ప్రజల మనసులోన స్థాన
ముంటుందా

ఆకాశం తాకేటి ఎంత పెద్ద చెట్టయినా
ఆసరా ఇచ్చినట్టి మట్టి విడిచి పోతుందా



బతుకుతెరువు కొరకు భాష లెన్నయినా
నేర్చుకో
మాతృభాష మమకారం పరభాషకు
వస్తుందా

పాఠకుణ్ణి వెంటాడే రచనొక్కటైన చాలు
శ్యామలా
పుస్తకాలు అచ్చేస్తే గొప్ప పేరు వస్తుందా

♦

---

కవితలో. వృత్తం గణిత సంబంధమైన రూపం. దానికి కవితా రూపమిచ్చిన కవి భావన గొప్పది.

''ఈ నది జీవనది. ఈ నదిలో అగ్నిగుండం రగులుతున్నది. ఎర్రని నురుగులు కక్కుతున్నది" అన్న పంక్తులు "నది రేపటిగీతం" అన్న పతాక శీర్షికగా ఉన్న కవితలోనివి. ఇందులో నది ప్రజాచైతన్యానికి ప్రతీక. ఇందులో నది, కొండలు, గుట్టలు, లోయలు దాటి సాగినట్లే ప్రజాపోరు ఓటముల హర్డిల్స్‌ను దాటుకొని గెలుపు ప్రవాహంగా మారుతుందని ధ్వన్యాత్మకంగా, ప్రతీకాత్మకంగా చెప్పిన తీరు కవిలోని కవితాత్మకు జండా.

"సూర్యుణ్ణి చంద్రుణ్ణి దేవుళ్ళుగా చూసేవారు చేస్తారు తిరుక్షవరం. గ్రహాలుగా చూసేవారు చూస్తారు ప్రజాక్షేమం" అన్న చార్వాకం కవిత పురాణాలు కాదు చదవాల్సింది సైన్సు అన్న సందేశమిస్తుంది.

"చుక్కల్లా ఉండేజనం సూర్యునిలా పొడుచుకొస్తరు" అంటున్న జనం కవిత ప్రజాచైతన్యాన్ని జండాగా మలిచింది.


"వస్తున్నా వస్తున్నా, వేమనలా, కాళన్నలా ప్రజలకోసం, ప్రజల మనిషి కోసం " అంటూ ప్రజల మనిషికోసం కవితలో భరోసా యిస్తున్నడు కవి.

"నేల తడవలేదని భూమి క్రుంగిపోదు. వేసవికి వేడెక్కి నీటి చుక్కకై ఎదురుచూస్తుంది" అన్న నివేదన కవితలో భూమి ప్రజలకు సంకేతం. నీటిచుక్కకై ఎదురుచూడడం మార్పుకోసం ఎదురుచూడడమే.

ఈనాటి సమాజంలోని మకిలిని కడిగేస్తుంది తన కవిత్వం. అందుకే తన కవిత్వానికి నదిని సంకేతంగా చేసుకున్నడు కవి. ఈ సంపుటిలో కొన్ని సూక్తులుగా, మరికొన్ని మనసును నిద్రలేపేవిగా, ఆలోచింపజేసేవిగా ఉన్నయి. మొత్తానికి ఈ 'నది రేపటిగీతం' కవితా సంపుటి చేతిలోకి తీసుకుంటే చదివేదాకా వదలిపెట్టదని చెప్పటం స్వభావోక్తి.

♦

## నచ్చిన రచన




# ఇప్పుడిది అసలైన సందర్భం...

**- కెంగార మోహన్**
**9493375447**

**E***motion recollected in tranquility* అని అంటూనే దాన్ని సంభాళించుకుని *it takes its origin from emotion recollected in tranquility* పాశ్చాత్యకవి వర్డ్సువర్త్ కవిత్వం గూర్చి అంటే అంత ప్రభావితం మన తెలుగు కవిత్వం చేయగలదా అనే సందేహం వచ్చేది. అన్నీ కాదు కాని కొన్ని కవిత్వ సంపుటాలు చదివాక పైన పేర్కొన్న మాటలు నూటికి నూరుపాళ్ళు నిజమనిపిస్తోంది. తెలుగు కవిత్వంలో లోతైన కవిత్వం, తడున్న వస్తువుల్లేక కవనజీవులు విలవిల్లాడుతున్న కవిత్వ వైరాగ్య, విరహ సందర్భంలో ఇటీవల దూసుకొచ్చిన కవిత్వం జి.వెంకటకృష్ణ గారి చినుకుదీవి. తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధకవుల్లో ముందువరసలోనే వుంటారు. ఆయన్ను పరిచయం చేయాల్సిన పనిలేదు. దున్నేకొద్దీ దు:ఖం, లో గొంతుక.. కవిత్వ సంపుటాలు గతంలో వొచ్చాయి. పైన ఎందుకామాట అనవలసి వచ్చిందంటే భావోద్రేకాలను, మదిలోతుల్లోంచి తిరిగి తవ్వి వొక ప్రశాంత వాతావరణాల మధ్య, వొకానొక సైద్ధాంతిక సంఘర్షణల తాలూకూ అనుభవాలను చినుకుదీవిలో ఆవిష్కరించారు. తనెళ్తున్న దారి తప్పకుండానే దార్లో అగుపడ్డ ముళ్ళను సున్నితంగా ఏరేసుకుని మరీ దారి చేసేసుకుని వెళ్ళాలనుకునే ప్రయత్నమే...

***ఉరుములా వురివే/ మెరుపులా మెరిసే/ అనిర్వచనీయమైన ఉత్సాహమే/ ఏ నేలమీదైనా మానవజీవిత రంగుల రాట్నాన్ని/ గిరగిరతిప్పే గరిమనాభి...***

నిజమే కదా. ఆశలనావ వేసుకుని ఆశయాల గమ్యంవైపు పయనించి చినుకుదీవికి కవి చేరుకుంటాడు. ఒక సైద్ధాంతిక అనుభవాల తాలూకు సంఘర్షణ ఫలితం. గొప్ప కవిత్వమనో మహా కవిత్వమనో చెప్పకూడదు. భావాలను దోసిట్లో పట్టుకుని మనసులోతుల్లోకి విసిరేసిన అనుభూతినిచ్చేకవిత్వం. ఎక్కడా కవి కాంప్రమైజ్ కాడు, లోతైన దృష్టికోణంతో సంచరిస్తున్నప్పుడు కాంప్రమైజ్ కావల్సిన అవసరం కూడా రాదు. నిబద్ధతగా కవిత్వం రాసే వాళ్ళు తెలుగు సాహిత్యంలో అరుదుగానే కనిపిస్తారు. కవిత్వాన్ని అందరూ ప్రేమిస్తామంటారు. కాని ప్రాణప్రదంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా కవిత్వాన్ని కొందరే తమ ఎదలోతుల్లో ఒంపుకుంటారు. అలా చేసిన ప్రయత్నమే ఈ కవిత్వం. ఒక కవితలో..

***అరటితోటలుగా వ్యాపించిన/ అమెరికా ఆత్యాస అకృత్యాలు/ సమ్మెచేసే కార్మికుల శవాల బోగీలై/ చేరిన కన్నీటి సముద్రాల మీద/ గడ్డకట్టిన నూరేళ్ళ ఏకాంతానికి వగస్తూ నేను...***(గాబ్రియేల్ గార్షియా మార్క్వెజ్)

**కవిత**

## నేనిలా ఉంటాను....

**- సుభాషిణి**

*కదలని కలాన్ని అదిలిస్తూ*
*కాలానికి కవిత్వం అద్దుదామనుకుంటాను,*
*కళ్ళముందు పరిగెత్తే వాస్తవాలను*
*కవితలో కుదించలేక*
*కుంగుతాను*
*గుండెల్లో ఉబికే సునామీలను ఆపలేక*
*చెంపలను అభిషేకిస్తాను*
*ఎవరికీ పట్టని ఘోరాలన్నీ నాకే తోస్తాయో??*
*పరిష్కారం తోచక కళవెలబోతాను*
*గాఢంగా పెనవేసుకున్న చిక్కు ముడులలో*



*కాసింత తడికోసం వెర్రిగా వెతుకుతాను*
*కపాలం కొలిమై వేధిస్తే*
*సిరాతో ఇలా....*
*ఆర్పుతుంటాను.*
*మళ్ళీ .....*
*తెల్లారి లేచింది మొదలు*
*అల్ట్రా మోడరన్ మొఖం తొడుక్కుని*
*చురుగ్గా నటిస్తుంటాను...*
*నేనిలా ఉంటాను.* ♦

కవికి ప్రాపంచిక దృక్పథం వుండాలి. ప్రపంచాన్ని కళ్ళతో చూస్తే చూపులో అంధత్వముంటుంది. మనసుతో చూస్తూ ఆకళింపుగా , ఆక్రంధనగా వీక్షించినపుడే వాస్తవ ప్రపంచం కనిపిస్తుంది.అలా చూడగలిగేది మార్క్సిస్ట్ భావజాలమున్నప్పుడు కాస్త సాధ్యమైతుంది. ఈ కవి నూటికి నూరుపాళ్ళు మావో చెప్పిన ప్రజల నుంచి ప్రజల్లోకి అన్న సూత్రాన్ని ఆచరిస్తున్నాడనిపిస్తుంది. అట్టడుగు జనం బతుకు లోతుల్లోకి కవి తొంగి చూశారు. దీనికి కారణాలన్వేషిస్తే విప్లవసాహిత్యోద్యమం పట్ల కవికున్న మమకారమే కావచ్చుఅ కాని గాయాలను గేయాలుగా మలుచుకునే తత్వం కవిత్వం రాస్తున్నప్పటి నుండి వుండవచ్చు. అందుకే వెంకటకృష్ణ కవిత్వం ఆలోచింపజేస్తుంది. కవిత్వమంటే కవిత్వంలో వస్తువునో, శిల్పాన్నో లేదా సహేతుకమైన కవిత్వ హేతువుల్నో వెతుకుతారు. కాని చినుకుదీవి చదివినపుడు వాటితోపాటు నిబద్ధతగల మనిషి సాక్షాత్కరింపబడతాడు. ప్రతి కవితలోనూ వైవిధ్యం, ప్రతి పంక్తిలోనూ ఆర్ధ్రతతో కూడిన కాలరేఖలను కవి గీసుకుంటూనే వెళ్ళాడు. ఒక కవితలో ...

***రైతు విత్తనం విత్తి***
***నడిపొలంలో నిలబడి నడినెత్తు ఆకాశాన్ని***
***చూసినప్పటి దిగులు***
***ఎన్ని తెంపుల కలుపును ఏరివేసినా,***
***ఏ తెగులు సోకుతుందోనని గట్టు మీద చెంపకు చేయి ఆనించినట్లు...***

ఎలా చెప్పగలిగాడని అనుకుంటే మట్టి పరిమళాల సువాసనలు సీమకవులకు మాత్రమే తెలుస్తాయి. అస్తిత్వమనుకున్నా మరేది అనుకున్నా సీమలో కరువున్నది వాస్తవమే. కన్నీళ్ళతో గొంతులు తడుపుకుంటున్నది నిజమే. ప్రతి ఏడు వానలు రాక విలవిలలాడే రైతన్న ఉరికొయ్యకో పురుగుల మందుకో జీవితాలను అర్పిస్తుంటే సీమ అస్తిత్వపు గొంతులు అరవకుండా వుంటాయా? కవిత్వీకరించక మానుతాయా? జి.వెంకటకృష్ణ సీమ అస్తిత్వ పోరాటాల్లో ప్రత్యక్ష్యంగా పాల్గొనకపోయినా అంతకంటే ఎక్కువగా కలంతో పోరాటం చేస్తున్న అసలు సిసలైన సీమకవి. విప్లవనినాదమై గొంతు పెగల్చుకుని,చినుకులకోసం పరితపిస్తూనే ఉద్యమబాటలో నడుస్తున్న సైద్ధాంతిక మేధావి. చినుకుదీవి చదువుతున్నప్పుడు ఉద్యమఫంథా నుంచి కొంత డివీయేట్ అయినట్లు కనిపించినా చివరికి తను నడుస్తున్న దారిలో ఎన్ని అవరోధాలొచ్చినా, ఆటంకాలెదురైనా నవసమాజ ఆవిర్భావం కోసం, సమసమాజాన్ని ఆవిష్కరించే ప్రయత్నంలో నిత్యం తలమునకలై వుంటాడు.

***ఒకని యింటిపేరు కవిత్వం***
***అతనిదొక కరుడు గట్టిన కవిత్వ తత్వం,***
***పీపాల పీపాల కవిత్వం తాగి***
***టన్నుల టన్నుల అక్షరాల్ని మలచి***
***భయనిద్రా మైధునాల అంచులకు***
***వెదజల్లే కవి..***

(ఇద్దరు కవులు) ఇలా ఏ పార్శ్వాన్ని కవి వదల్లేదు. ఈ చినుకులదీవిలో అనేక వస్తువులు పలకరిస్తాయి. కవితాహృదయాలను పలవరిస్తాయి. కవిత్వం చదివేకొద్దీ మదిలో ఒక తృప్తి, నిబద్ధత గల కవి చినుకులదీవిలో సంక్లిష్ట సందిగ్ధ ఉప్పెనలను తట్టుకుని ఆశల తెడ్డును కవన సముద్రంలో ముంచి సంఘర్షణల పెనుతుఫానులకు ఎదురేగి ఆశయాల దీవిని చేరుకునే ప్రయత్నమే ఈ చినుకుదీవి కవిత్వం.

పురస్కారం

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కృష్ణాసోబతీ



**- దాసరి శివకుమారి**
**9866067664**

***భారత్ పాక్ విభజనతో ఏర్పడ్డ పరిస్థితులు స్త్రీ పురుషుల మధ్య వున్న సంబంధాలు, రోజు రోజుకూ కనుమరుగువుతున్న నైతిక విలువల, ప్రస్తుత భారత సమాజ పరిస్థితులను, గురించి ఆమె తన రచనల్లో ఎక్కువగా చర్చించారు. హిందీఫిక్షన్ రచయిత్రిగా వ్యాస రచనాకర్తగా వీరు చాలా మంచి పేరు సంపాదించుకున్నారు.***

కృష్ణాసోబతీ ప్రఖ్యాత హిందీ రచయిత్రి. 1996వ సంవత్సరంలో జ్ఞానపీఠ పురస్కారం బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవిని వరిస్తే ఈ 2017వ సంవత్సరంలో కృష్ణాసోబతీని వరించింది.

కృష్ణాసోబతీ 1925వ సంవత్సరంలో పంజాబ్ ప్రావిన్స్‌లోని గుజ్రత్ ప్రాంతంలో జన్మించారు. ఈ ప్రాంతం ప్రస్తుతం పాకిస్థాన్‌లో వున్నది.

"దార్‌సేబిచ్చుడీ" "మిత్రోమర్జనీ", "జిందగీనామా", "దిలో దానిష్", "బాదలోంకోఘేరే", "ఏ లడకీ" గుజరత్ పాకిస్థాన్ సే గుజరత్ హిందూస్థాన్" వంటి వీరి నవలలు చాలా ప్రసిద్ధి పొందాయి.

"నఫీసా", "సిక్కా బదల్‌గయా" లాంటి కథలు పాఠకుల మన్ననలు పొందినవి. "సిక్కాబదల్ గయా" భారత విభజనకు సంబంధించిన విషయం మీద చిత్రించిన రచన.

రచనావిశేషం : కృష్ణాసోబత్ తనదైన రచనాశైలిలో కొత్త కొత్త ప్రయోగాలు చేశారు. నిత్యజీవితంలో ఎదురయ్యే తీవ్ర వత్తిడులను, జటిలసమస్యలను కూడా ధైర్యంగా ఎదుర్కొనగలిగిన సజీవ పాత్రలనే పాఠకుల కళ్లముందు సాక్షాత్కరింపజేశారు. ఈమె రచనల్లో హిందీ, ఉర్దూ, పంజాబీ సంస్కృతుల ప్రభావం ఎక్కువగా కనిపిస్తూ వుంటుంది. భారత్ పాక్ విభజనతో ఏర్పడ్డ పరిస్థితులు స్త్రీ పురుషుల మధ్య వున్న సంబంధాలు, రోజు రోజుకూ కనుమరుగువుతున్న నైతిక విలువల, ప్రస్తుత భారత సమాజ పరిస్థితులను, గురించి ఆమె తన రచనల్లో ఎక్కువగా చర్చించారు. హిందీఫిక్షన్ రచయిత్రిగా వ్యాస రచనాకర్తగా వీరు చాలా మంచి పేరు సంపాదించుకున్నారు.

"మిద్రో మర్జనీ" నవలలో నూతన వివాహిత స్త్రీ లైంగిక బాధను వర్ణించారు. పంజాబ్‌లోని గ్రామీణ ప్రాంతపు యువతి సమస్యపై వ్రాసిన నవల ఇది. 1972వ సంవత్సరంలో ఇది ప్రచురితమయింది. దీన్ని 'గీతారజన్', 'రాజీనరసింహులు. 'టు హెల్‌విత్‌య' అను పేరుతో ఇంగ్లీషులో కనువదించారు. "సూరజ్ ముఖ్ అంధేరే" అనే నవల గూడా వీరికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇది కూడా 1972లోనే ముద్రితమైంది. ఇంతకంటే ముందు వ్రాసిన మరికొన్ని మంచి నవలలూ వున్నాయి. 1958లో "దార్‌సే బిచ్చుడీ" 1968లో యారాన్ కేయహార్'', ''తీన్‌పహార్'' అను నవలలనూ

పాఠకులకందించారు. "ఏలడకీ" అను నవలలో మరణశయ్యపై వున్న వృద్ధురాలికి అందించిన సేవాశుశ్రూషల గురించి ఆర్ద్రతతో ప్రేమానుభూతులను పంచుతూ చిత్రించారు. "గుజరత్ పాకిస్థాన్ సే గుజరత్ హిందూస్థాన్ తక్" అను నవల ఫిక్షన్ కూడిన ఆత్మకథ. ఇంకా "సమయ్‌సర్గమ్", "దివో దానిష్" అనేవి కూడా రచించారు. "దివోదానిష్ ఇంగ్లీషులోకి "దిహార్ హాజ్ ఇట్స్ రీజన్" అనే పేరుతో రీతూఆనంద్, మీనాక్షిస్వామీలు అనువదించారు. ఇది భారతీయ భాషానువాద రచనల విభాగంలో 2005వ సంవత్సరంలో క్రాస్‌వర్డ్ అవార్డు గెలుచుకున్నది.

> ***"జిందగీనామా" అను నవల కృష్ణా సోబతీకి హిందీ సాహిత్యంలో తిరుగులేని స్థానాన్ని అందించింది. ఈ నవల "జిందారుక్" అను పేరుతో ఉర్దూలోకి అనువాదం అయ్యింది***

"జిందగీనామా" అను నవల కృష్ణా సోబతీకి హిందీ సాహిత్యంలో తిరుగులేని స్థానాన్ని అందించింది. ఈ నవల "జిందారుక్" అను పేరుతో ఉర్దూలోకి అనువాదం అయ్యింది. ఈమె రచనలు భారతీయ భాషలతోపాటు స్వీడన్, రష్యన్, ఇంగ్లీషు భాషలలోకీ అనువాదమయ్యాయి.

1980 వ సంవత్సరంలో 'జిందగీనామా'కు సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 1981లో శిరోమణి పురస్కారాన్ని , 1982లో హిందీ అకాడమీ అవార్డును అందుకున్నారు. 1996లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్‌ను పొందారు. 1999లో కథా చూడామణి అవార్డును జీవిత కాల సాఫల్య పురస్కారంగా పొందారు. హిందీ అకాడమీ ఢిల్లీవారి షలాకా అవార్డును 2008లో స్వీకరించారు.

'సమయ్‌సర్గమ్' రచనకు 'వ్యాస సమ్మాక్', కె.కె. బిర్లా ఫౌండేషన్ అవార్డును, 'మైథిలీశరణ్ గుప్త్ సమ్మాన్' కూడా వీరి ఖ్యాతిని మరింత ఇనుమడింపజేశారు. 2010వ సంవత్సరంలో భారత ప్రభుత్వం వారు "పద్మభూషణ్" పురస్కారానికి కృష్ణా సోబతీని ఎంపిక చేశారు. కాని ఆమె దానిని తిరస్కరిస్తూ నేను సరియైన పనే చేశానని భావిస్తున్నానని పేర్కొన్నారు. "హష్మత్" అనే కలంపేరుతో తాను రచనలు చేసి ఇతర రచయితల కలం స్నేహితుల రచనలను సంకలనం చేశారు.

1952వ సంవత్సరంలో "జిందగీనామా" వ్రాతప్రతిని చెన్నా అనుపేరున్న అలహాబాద్‌లోని లీడర్‌ప్రెస్ వారికిచ్చారు. ఆ ప్రెస్సువారు ప్రచురించారు. కాని మూలగ్రంథంలో వున్న సంస్కృత పదాలకు ఆమె వాడిన ఉర్దూ, పంజాబీ పదాలకు భాషాపరమైన మార్పులు చేసి ప్రచురించారు.


ఆ విషయాన్ని ఇష్టపడని ఈమె తన పుస్తకాన్నే ఉపసంహరించుకున్నట్లుగా తెలిపి ఆ పుస్తకాన్ని విడుదల చేయనీయలేదు. దాన్ని నాశనమూ చేశారు. తర్వాత రాజ్‌కమల్ ప్రకాశన్ అని ప్రచురణా సంస్థకు చెందిన "శీలాసంధు"ని సంప్రదించి "జిందగీనామా" ను ప్రచురించారు. ఇదే జిందగీనామాను 1974లో జిందగీనామా, జిందారుక్ అనే పేరుతో మరింత విపులంగా వ్రాశారు. ఈ పుస్తకం 1900 సంవత్సరం ప్రాంతంలో పంజాబ్‌లోని ఒక గ్రామంలో జరిగిన సంఘటన ఆధారంగా వ్రాయబడింది. ప్రఖ్యాత రచయితా, విమర్శకులైన "త్రిషాగుప్త" ఈ పుస్తకం హిందీ సాహిత్యానికే వన్నె తెచ్చిందని, అభిప్రాయపడ్డారు. అమృతప్రీతమ్ అనే రచయిత "హార్ దాత్ కా జిందగీనామా" అను పేరుతో రచన చేసినందుకుగాను సోబీ, ఆగ్రహించి కోర్టుకెళ్లి ఆ విషయంపై ఇరవై ఆరేళ్ళపాటు న్యాయపోరాటం జరిపారు కానీ చివరకు విఫలం చెందారు.

సాహిత్యాలు కొత్త కోణాలను సృజింపచేయమని, రచనల్లో సృజనాత్మకత పెంపొందింపజేయమంటూ సోబతీకి 1996లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్‌నిచ్చారు. దాద్రీ ప్రాంతంలో జరిగిన అల్లర్లను అణచటానికి ప్రభుత్వం ఏ చర్యా చేపట్టనందుకు నిరసనగాను, వాక్ స్వాతంత్ర్యాన్ని లేకుండా, చేస్తూ హిందీ రచయితల గురించి ప్రభుత్వంకు విమర్శలు చేసినందుకుగాను తన నిరసనను తెలియజేస్తూ, ఫెలోషిప్‌ను వదిలిపెట్టారు.

'సిక్కాబదల్‌గయా" భారత విభజన వృత్తాంతపు రచన ఇది. దీనిని సచ్చిదానంద వాత్స్యాయన యధాతథంగా ప్రతీక్ జర్నల్‌లో ప్రచురించారు. ఇలా భారతదేశ పరిస్థితులను ప్రతిబింబిస్తూ రచనలు చేసిన ఉత్తమ హిందీ రచయిత్రి కృష్ణాసోబతీ. "సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించి పాత్రలకు ప్రాణంపోసి హిందీ సాహిత్యాన్ని కృష్ణా సో బతి సుసంపన్నం చేశారని ఏభై మూడవ జ్ఞానపీఠ అవార్డుల కమిటీ ఛైర్మన్, ప్రముఖ విద్యావేత్త రచయిత, విమర్శకుడైన శ్రనామ్వర్ సింగ్" ఈ సందర్భంగా ప్రస్తుతించారు.

తన తొంభై రెండవ యేట జ్ఞానపీఠ, విశిష్ట పురస్కారాన్ని పొందిన కృష్ణా సోబతీకి అభినందనలు.

# స్వీకారం




## ప్రత్యామ్నాయం: దళితుల చరిత్ర

ఆరవ భాగం


**డా॥ కత్తి పద్మారావు**

వెల : 300/- పేజీలు: 316

ప్రతులకు : 9849741695

ఎందరో మేధావులు, రచయితలు, కవులు, సిద్ధాంత కర్తలు, దళితుల మీద వ్రాస్తున్నారు. వారి గురించి కూడా తెలుసుకోవడం కోసం వారి చిత్రపటాలను ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా దళితుల చరిత్రకు పునాదులు వేసినవారు డా॥ బి.ఆర్. అంబేద్కర్. డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనా విధానంలోనే ఈ రచన సాగింది. డా॥ బి.ఆర్. అంబేద్కర్ మనకు అందించిన వెలుగులోనే ఈ రచన నేను చేశాను.

**- డా॥ కత్తి పద్మారావు**



## అవగాహన

వర్తమాన కవుల కవితా ప్రస్థానం


**డాక్టర్ రాధేయ**

వెల : 150/- పేజీలు: 200

ప్రతులకు : 9985171411

ఒక కవిని గురించి పాఠకునితో స్థూలమైన అవగాహన కలిగించడం రాధేయ విమర్శ ఉద్దేశంగా కనిపిస్తుంది. అందుకే ఆయన విమర్శ అలవోకగా పరిచయం చేస్తున్నట్లుగా ఉంటుంది. అలవోకగా చెప్పడం చాలా కష్టం. దీనికి ఆరుద్ర ఒక మార్గం ఏర్పరిచారు. రాధేయ కవిత్వ పాఠకుని భుజం మీద చేయి వేసి నడుస్తూ కవులను గురించి మాట్లాడుతున్నట్లుగా విమర్శ చెబుతారు.

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**




## ముందడుగు

**అడిగోపుల వెంకటరత్నమ్**

వెల : 100/- పేజీలు: 132

ప్రతులకు : 9848252946

యుగయుగాలుగా మనిషికీ, అద్దానికీ, అద్దానికీ, మనిషికీ సాగుతున్న వీక్షణ సాంగత్యాన్ని అడిగోపుల ఈ కవితాద్దంలో చూపించారు. కవిత్వం పట్ల కవికున్న నిబద్ధతకూ, సమాజం పట్ల కవికున్న బాధ్యతకూ, మానవ సంబంధాల పట్ల కవికున్న లోచూపుకూ, భవిష్యత్తు నిర్మాణం పట్ల కవికున్న ఆకాంక్షలకూ ఇవన్నీ నిదర్శనాలు.

**- మేడిపల్లి రవికుమార్**




## నది అంచున నడుస్తూ


**డా.సి. భవానీదేవి**

వెల : 150/- పేజీలు: 126

ప్రతులకు : 040 - 27636172

దాదాపు నాలుగున్నర దశాబ్దాల సాహితీ సృజనలో నా అంతశ్చేతన కవిత్వమే. ''కూసుండ నీదురా కూసింతసేపు'' అన్నట్లు రాయకుండా ఉండలేని అనివార్యత నాచే కవిత్వాన్ని రాయిస్తోంది. అయినా రాయాల్సిన కవిత ఏదో మిగిలే ఉంది. ఇది నిజంగా తీరని దాహమే!

**- డా.సి. భవానీదేవి**




భారతీయ సాహిత్య నిర్మాతలు

## కె.ఎన్.వై. పతంజలి


**చింతకింది శ్రీనివాసరావు**

వెల : 50/- పేజీలు: 128

సాహిత్య అకాడమీ ప్రచురణ

పతంజలిని దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా, ఆయన పుస్తకాల చదువరిగా, ఆయన నాయకత్వంలో పనిచేసిన జర్నలిస్టుగా, ఆయన రాతలను ప్రేమించే రచయితగా ఆయన గురించి రాయడం నా భాగ్యం.

**- చింతకింది శ్రీనివాసరావు**




## మన చరిత్ర - సంస్కృతి

భిన్నకోణాలు

**శైలజ బండారి**

వెల : 100/- పేజీలు: 160

ప్రతులకు : 040-27678430

మనం ఇప్పటివరకు నమ్ముతున్న చరిత్రపై, అనుసరిస్తున్న ఆచారాలపై అనేక ప్రశ్నల్ని సంధిస్తూ శాస్త్రీయ ఆలోచన వైపు దృష్టి సారించేలా చేస్తాయి ఈ వ్యాసాలు. సకల రంగాల్లో మూఢత్వం రాజ్యమేలుతున్న ఈ కాలాన ఈ వ్యాసాలు రావడం ఆహ్వానించదగిన విషయం.

**- గుడిపాటి**

# గురజాడ యుగస్వరం పరిచయ సభ



గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విజయనగరం సాహితీస్రవంతి, సరోజినీ మహిళామండలి సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 19న గురజాడ గ్రంథాలయంలో తెలకపల్లి రవి పుస్తకం 'గురజాడ యుగస్వరం' ఆవిష్కరణ జరిగింది. సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాజీ ఎంపి డివిజి శంకర్రావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీ విమర్శకులు రామతీర్ధ ఈ గ్రంథాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత తెలకపల్లి రవి మాట్లాడుతూ నేటి సమాజానికి అనుగుణంగా గురజాడ రచనలపై సమగ్ర పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని, ఆయన రచనలు మానవీయ సంబంధాలకు అద్దం పట్టడంతో పాటు మత ఛాందసవాదుల భావజాలాన్ని బద్దలు కొడతాయని అన్నారు. గురజాడ స్మారకభవనంలో ఆయన పుస్తకాలు, రచనలను భద్రపరచాలని సూచించారు. విజయనగరంలో గురజాడ అధ్యయన కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. గురజాడ బాధలు, కష్టాలను అనుభవించిన వ్యక్తి కావడంతో ఆయన రచనల్లో మానవీయ సంబంధాలను సాక్షాత్కరించాయన్నారు. సాహిత్యానికి గురజాడ ఒక యుగపురుషుడని కొనియాడారు.

గురజాడ సాహిత్యం ఒక సముద్రం, భాషకు ఆయనొక వరమని డివిజి శంకర్రావు అన్నారు. నేటి సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా గురజాడ రచనలు ఉన్నాయని, చాందసవాదం ఎక్కువగా ఉన్న సమయంలోనే గురజాడ నిక్కచ్చిగా ఖండించగా, నేడు ఆధునిక యుగంలో భావప్రకటనా స్వేచ్ఛకు అడ్డుతగలడం ఈ సమాజం ఎటుపోతోందో అర్థం కావడం లేదన్నారు. గురజాడ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి అంతా కృషి చేయాలన్నారు.

ఈ సమాజాన్ని పట్టించుకున్నవారే గురజాడ వారసులవుతారని రామతీర్థ అన్నారు. గురజాడ అనేక సార్లు నాది ప్రజా ఉద్యమం అని చెప్పారని గుర్తు చేశారు. ఆయన రచనలు నచ్చచెప్పే పద్ధతిలో ఉంటాయన్నారు. ఎంతో ముందు చూపుతో గురజాడ రచనలు అర్థం చేసుకోవడానికి గురజాడ యుగస్వరం పుస్తకం దోహదపడుతుందన్నారు.

ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ గురజాడ అడుగు వంద అడుగల కన్నా పెద్దదని, అందుకే నేటి సమాజం ఎంత చేసినా గురజాడ రచనలను అందుకో లేకపోతుందన్నారు. సరోజినీ మహిళా సంఘం నాయకురాలు ఈశ్వరీమోహన్ మాట్లాడుతూ, స్త్రీ వంటింటికి పరిమితం కాదన్న విషయాన్ని గురజాడ ఏనాడో చెప్పారన్నారు. కానీ స్త్రీలపై నేటికీ దాడుల జరగడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి ఉపాధ్యక్షులు ఎస్వీఆర్ కృష్ణారావు, చంద్రిక, దప్పుశ్రీను, గాంధీ, పలువురు రచయితలు, కవులు, కళాకారులు, మహిళలు, యువత పాల్గొన్నారు. ♦



*తెలంగాణ సాహితి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో చదువులా? చావులా? అంశంపై జరిగిన యువ కవిసమ్మేళనంలో పాల్గొన్న యువ కవులలతో పాటు ముఖ్య అతిథి బైసా దేవదాసు,మెర్సీ మార్గరెట్ , అనంతోజు మోహన్ కృష్ణ, తిరునగరి శరత్‌చంద్ర, భూపతి వెంకటేశ్వర్లు, తంగిరాల చక్రవర్తి. ఈ కవి సమ్మేళనంలో 30మంది యువ కవులు తమ స్వీయ కవితలు వినిపించారు.*

## విజయవాడలో సి.వి. సంస్మరణ



ప్రస్తుత సమాజంలో మూఢ నమ్మకాలు వేలం వెర్రిగా మారాయని, వాటికి ప్రస్తుత రాజకీయ వ్యవస్థే అస్తిత్వం ఇస్తోందని, ఈ సమాజానికి సివి (చిత్తజల్లు వరహాలరావు) రచనలు కాగడాలు కావాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సంగమం (లౌకిక, ప్రజాతంత్రవాదుల ఐక్యవేదిక) ఆధ్వర్యంలో సివి సంస్మరణ సభ విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 15న జరిగింది. సివి నివాళి, ఇతర వ్యాసాల సంకలనం 'మన తరం ప్రజా స్వరం' పుస్తకాన్ని ఈసభలో ప్రజాశక్తి సంపాదకులు పాటూరు రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కుల వ్యవస్థ కొన్ని వేల సంవత్సరాల నుంచీ ఉందని, దీనిపై జమిలిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కల్బుర్గి, గౌరీ లంకేష్ వంటి వారు ప్రయత్నిస్తే హత్యకు గురయ్యారన్నారు. సమాజ లోతులకు వెళ్లి మనం కనీ వినీ ఎరుగని విషయాలను సులువుగా అర్థమయ్యేలా చెప్పిన గొప్ప సాహిత్య మేధావి సివి అని రాఘవులు కొనియాడారు. ఆయన రచనలు ఒక తరాన్ని ప్రభావితం చేయగలిగాయని చెప్పారు. 300 ఏళ్లలో నిర్మించలేని ప్రత్యామ్నాయాన్ని కేవలం 15 రోజుల్లో ఎలా ఆవిష్కరిస్తారో సివి రచించిన 'ప్యారిస్ కమ్యూన్'లో కొట్టొచ్చినట్లు కనపడుతుందన్నారు. ఒక తరాన్ని ప్రభావితం చేసి సమాజంలో ఉత్ప్రేరక పాత్ర పోషించిన అతి కొద్ది మందిలో సివి ఒకరని చెప్పారు. విస్మరణకు గురైందే చివరికి గొప్ప సాహిత్యం అయిందని చెప్పారు. సివి రచనలను భవిష్యత్తు మార్పునకు, కృషికి కరదీపికగా వాడుకోవాలని సూచించారు. నాగార్జునా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రచురణలతోనే సివి రచనలకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. భారతీయ సాహిత్యాన్ని సివి సాహిత్యం ప్రభావితం చేసిందన్నారు. సాహిత్యకారులకు సివి రచనలు నచ్చలేదన్నారు. దళిత సాహిత్యకారులు , సాహిత్య పురవీధుల్లోకి రావడానికి సివియే కారకులని చెప్పారు. సోషల్ సైన్స్ ప్రొఫెసర్ ఎన్ అంజయ్య మాట్లాడుతూ ప్రస్తుతం పురాణాల చాటున రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. విరసం సభ్యులు సిఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సివి రచనలు కాలాన్ని జయించాయన్నారు. కులానికి, మతానికి ప్రాముఖ్యం ఉన్నంత కాలం, ఆలోచన, ఆచరణ, మానసిక వెనుకబాటుతనం ఉన్నంత కాలం సివి రచనలు ఉంటాయని చెప్పారు. ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, సంగమం కన్వీనర్ సి ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ కె ఉషారాణి, సాహితీ స్రవంతి అధ్యక్షులు వొరప్రసాద్, జన సాహితి సభ్యులు దివికుమార్, నాస్తిక సమాజం సభ్యులు కె అయ్యన్న, ప్రొగ్రెసివ్ ఫోరం సభ్యులు జమిందార్, శ్రీశ్రీ సాహిత్యనిధి తరపున సింగంపల్లి అశోక్ కుమార్, సమన్విత తరపున శమంతకమణి, హేతువాద సంఘం సభ్యులు నార్నె వెంకట సుబ్బయ్య, ఎపి దళిత మహాసభ సభ్యులు పి కృష్ణ, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి వ్యతిరేక ఉద్యమ కవితల పోటీ

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ, రాష్ట్ర శాఖ సౌజన్యంతో "అమరావతి సాహితీమిత్రులు" సంస్థ అవినీతి వ్యతిరేక ఉద్యమ కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు డా. రావి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. 24 లైన్లకు మించని వచన కవిత కాని, గేయం కాని, తేటగీతి/ఆటవెలది /కందం 6 పద్యాలు కాని పంపించవలసిందిగా కోరారు. స్థూలంగా విషయం అవినీతి వ్యతిరేకత. కవిత్వ శిల్పం కూడా అవసరం. ప్రథమ బహుమతిగా 5 వేలు, ద్వితీయ బహుమతిగా 3 వేలు, తృతీయ బహుమతిగా 2 వేలు, నాలుగు 500 రూ.ల ప్రత్యేక బహుమతు లుంటాయి. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం డిసెంబర్ 9న ఉదయం గుంటూరులో బ్రాడీపేట సర్వీస్ హెల్త్ అర్గనైజేషన్ సమావేశ మందిరంలో జరిగే కవి సమ్మేళనంలో బహుమతి ప్రదానం ఉంటుంది. కవితల్ని డిసెంబర్ 5 లోగా "అమరావతి సాహితీమిత్రులు, 101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్ 5వ లైను తూర్పు, గోరంట్ల, గుంటూరు– 522034" కు పంపాలి. ఇతర వివరాలకు 9247581825 ద్వారా సంప్రదించవచ్చును. ♦

# సాహితీస్రవంతి - పల్లెపాలెం ఆంధ్రీకుటీరం - క"వన"భోజనాలు




కాకినాడసాహితీస్రవంతి కవులు, రచయితలం అందరం కలిసి, ఈసారి మధునాపంతుల సత్యనారాయణ మూర్తి ఆహ్వానం మేరకు వనభోజనాలకు పల్లెపాలెం ఆంధ్రీకుటీరానికి తరలి వెళ్ళాం. నవంబర్ 19 ఆదివారం ఉదయం 10 గంటలకల్లా అందరం పల్లెపాలెం చేరు కొన్నాం. ముందుగా ఆంధ్రీకుటీరానికి వెనుకతోటలోగల పెద్ద బంగినపల్లి మామిడి చెట్టును సందర్శించాం. కీ.శే. మధునాపంతుల సత్య నారాయణ శాస్త్రి ఆ చెట్టు క్రిందే కూర్చొని " ఆంధ్రపురాణ" మహాకావ్యాన్ని వ్రాసారని ప్రతీతి. మధునాపంతుల వారిని స్మరిస్తూ సన్నిధానం నృసింహ శర్మ ఆంధ్రపురాణంలోని పద్యాలను ఎంతో చక్కగా ఆలపించి అందర్నీ అలరించారు. మధ్యాహ్నం12.30 కి మధునాపంతులవారి గృహ ప్రాంగణంలోని ఉసిరిచెట్టు క్రింద ఎంతోరుచికరమైన భోజనాలు చేసాం. భోజనానంతరం వేంకట రామకృష్ణ కవులలో ఒకరైన ఓలేటివేంకట రామశాస్త్రి జయంతిసభను ఏర్పాటుచేసారు. ఆ సభలో ముందుగా మాకినీడి సూర్యభాస్కర్ కవిత్వంపై శ్రీహస్త రాసిన " మనసున్నకవి మాకినీడి" అనేపుస్తకాన్ని సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా ఆవిష్కరించారు. అవధానుల మణిబాబు ఆ పుస్తకాన్ని చక్కగా లోతైన పరిచయం చేసారు. కాకినాడ సాహితీస్రవంతి అధ్యక్షులు మార్ని జానకిరాంచౌదరి కూడా పుస్తకంపై చక్కని ప్రసంగం చేసారు.

డా.వాడ్రేవు వీరలక్ష్మీదేవి, శిఖామణి, దాట్ల దేవదానం రాజు పల్లెపాలెంతో తమకుగల అనుబంధాన్ని, అనుభవాలను నెమరువేసుకొన్నారు. ఓలేటి వేంకటరామశాస్త్రిపై డా.రెంటాల శ్రీవేంక టేశ్వరరావు, డా. జోశ్యుల కృష్ణబాబు ప్రధాన ప్రసంగాలు చేసారు. రెంటాలవారు ఓలేటివేంకటరామ శాస్త్రి, వేదులరామకృష్ణ శాస్త్రిగారితో కలిసి జంట కవిత్వం చెప్పటం, నాలుగు గంటలలో అవధానం చెయ్యటం, చెళ్ళపిళ్ళ వారితోస్పర్ధలు, "కవిత" పత్రిక నిర్వహణ, పద్యశైలి, వంటి అనేక విశేషాలతో అద్భుతమైన ప్రసంగం చేసారు. రెంటాలవారు స్పృశించని అంశాలను తీసుకొని ఆయా సందర్భాలలో వేంకటరామకృష్ణ కవులు చెప్పిన హృద్యమైనపద్యాలను ఎంతోశ్రావ్యంగా చదివి వినిపించిశ్రోతలను కృష్ణ బాబు రంజింపజేసారు.

మధునాపంతుల సత్యనారాయణ మూర్తి ఛలోక్తులతో, చతురోక్తులతో మధ్యమధ్య ప్రముఖుల పద్యాలతో సభ అంతటినీ హృద్యంగా హుందాగా నడిపించారు. ఈ కవనయాత్రలో అద్దేపల్లిప్రభు, బొల్లోజు బాబా, కాకరపర్తి దుర్గాప్రసాద్, రామకృష్ణ శ్రీవత్స, ద్విభాష్యం నగేష్ బాబు, తంత్రవహి శ్రీరామ్మూర్తి, పరుగుభాస్కరరెడ్డి, కొండూరిరామరాజు, మధునాపంతుల చలపతి, ఘట్టి శ్రీకృష్ణ దేవరాయ, శ్రీమతిపద్మావతి, పద్మజవాణి, అద్దేపల్లిజ్యోతి, వేంకటరామశాస్త్రి, మురళీకుమారి తదితర కవులు, కవయిత్రులు, హాజరయ్యారు.

రోజురోజంతా పుస్తకావిష్కరణలతో, సమీక్షలతో, ఆత్మీయ ప్రసంగాలతో, ఉపన్యాసాలతో, ఎంతోహాయిగా, ఆనందంగా గడిచిపోయింది. ఇంతమందికి వన భోజనాలేగాక, వీనులవిందైన, పసందైన కవనభోజనాలనూ ఏర్పాటుచేసిన మధునాపంతులవారికి సాహితీస్రవంతి తరుపున ధన్యవాదాలు..!

**- జోశ్యుల కృష్ణబాబు**

## సరికొత్తగా సాహిత్య ప్రస్థానం

*సాహిత్య ప్రస్థానం 15వ వార్షికోత్సవ సందర్భంగా సరికొత్త శీర్షికలతో మరింత ఆకర్షణీయంగా, ఆలోచనలు పెంచేవిధంగా సాహిత్య ప్రస్థానాన్ని వెలువరించబోతున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం.*

- *2018 జనవరి నెల సంచిక నుండి మార్పులతో కూడిన సాహిత్య ప్రస్థానం సంచిక వెలువడుతుంది.*
- *మంచి రచనలకు, కొత్త ఆలోచనలు రేకెత్తించే సృజనకు ఎప్పటిలాగే సాహిత్య ప్రస్థానం వేదికగా ఉంటుంది.*
- *సాహిత్య ప్రస్థానం పత్రిక ధర కూడా ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పెంచక తప్పట్లేదు. 15 ఏళ్లుగా ఒకే విధంగా రు.10గా వున్న పత్రిక ధరను 2018 జనవరి నుంచి రు.20 కి పెంచడం జరుగుతుంది.*
- *సాహిత్య ప్రస్థానం పేజీలు 64కు పెంచి, ఆ పేజీలను మరింత విశ్లేషణ కోసమే గాక మూడు మాసాల కొక ప్రత్యేక అధ్యయనం కోసం వినియోగించడం జరుగుతుంది..*
- *చందాదారుల చందాలను కూడా పెరిగిన ధరకు అనుగుణంగా సర్దుబాటు చేయటం జరుగుతుంది.*
- *చందాదారులు ఈ మార్పులను గమనించి సహృదయంతో ఎప్పటిలాగానే ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాం.*
- *పత్రికలో మార్పులు, చేర్పులకు సంబంధించి పాఠకుల నుండి సూచనలు కోరుతున్నాం.*

*– ఎడిటర్*

## అనంతపురంలో కవి సమ్మేళనం




ఇంటాక్ ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ వారోత్సవాల సందర్భంగా అనంతపురంలో లలితకళా పరిషత్‌లో నవంబర్ 17న కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమం లో పలువురు కవులు పాల్గొని తమ కవితల్ని వినిపించారు. ఇంటాక్ కార్యదర్శి ఎజి వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. వర్ధమాన కవి రచయిత ఉద్దండం చంద్రశేఖర్ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్యాయవాది రాంకుమార్ పాల్గొన్నారు. సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు పిళ్లా కుమారస్వామి ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జానపద సాహిత్యం శ్రమజీవుల సాహిత్యమని దానిని మన వారసత్వంగా కాపాడుకోవాలన్నారు. ఒగ్గుకథ, పగటివేషగాడు, తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ మొదలైన కళారూపాలన్ని మన వారసత్వ సంపదన్నారు. వాటికి సాహిత్య కారులు మళ్లీ ప్రాణం పోయాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన కవిసమ్మేళనం లో మిద్దెమురళీక్రిష్ణ షేక్ రియజుద్దిన్, ఆకుల రఘురామయ్య, యాడికి సూర్యనారాయణ రెడ్డి, రసూల్, అశ్వర్థరెడ్డి, మధుర శ్రీ, ఏలూరి యంగన్న తదితరులు పాల్గొన్నారు. ♦

## సాహిత్య వ్యాస రచన పోటీలు

తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి రచనలు – సామాజిక సందేశం అనే అంశంపై రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చీరాల – కళాంజలి సంస్థ అధ్యక్షులు కాకరపర్తి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో ఎవరైనా పాల్గొనవచ్చునని, పది పేజీలకు మించకుండా (అచ్చులో 5 పేజీలు) వ్యాసం రాసి డిసెంబర్ 15వ తేదీలోపు పంపించవలసిందిగా కోరారు. కాకరపర్తి వెంకటేశ్వర్లు, కళాంజలి, ముత్యాలపేట వీధి, చీరాల – 523155, ప్రకాశం జిల్లా చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. హామీపత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు జతచేసి పంపవలసిందిగా కోరారు. 2018 జనవరిలో 'తుమ్మలవారి జయంతి సభలో విజేతలకు రూ. 5000, 3000, 2000ల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు ఆ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9290005263, 9848039080 ద్వారా సంప్రదించవచ్చును. ♦

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

## ఆహ్వానం

# గురజాడ సాహిత్య వేదిక

డిసెంబర్ 1 నుండి 10 వరకు



**సదస్సులు**

**జనకవనం**

**పుస్తకావిష్కరణలు**

ఉత్తరాంధ్ర ప్రాంతం కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల వికాసానికి పెట్టింది పేరు. విశాఖ నగరంలో జరిగే పది రోజుల సాహితీ ఉత్సవానికి అందరికీ ఆహ్వానం. వైజాగ్ ఫెస్ట్ 2017 బృహత్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో గురజాడ సాహిత్య వేదిక ఏర్పాటయ్యింది. ఆ వేదికపై ప్రతిరోజూ సాహిత్య కార్యక్రమాలు జరుగుతాయి. మీకిదే మా ఆహ్వానం.

ప్రతిరోజు అధ్యక్షుల చిరుపలుకులు • అతిథుల లఘు ఉపన్యాసాలు • పుస్తకావిష్కరణలు • జన కవనం ఉంటాయి

VIZAG Fest 2017
The Spirit of Vizag
1-10 December 2017

ఆంధ్ర విశ్వవిద్యాలయం
ఇంజనీరింగ్ కాలేజి మైదానం,
విశాఖపట్నం

**వైజాగ్ పెస్ట్ 2017**

వివరాలకు :
చీకటి దివాకర్ 9441176882 • ఎ.వి రమణారావు 9848710507
నూనెల శ్రీనివాసరావు 9492970231 • వారప్రసాద్ 9490099059

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 02.12.2017 ▪ Date of Publication: 27.11.2017




If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059